30-7Pg1exHMNWJQE_30-7Pg1exHMNWJQE.qxd 30/Jul/26 12:10 AM Page 1

ఆదివారం - గత వారంరోజులపై విహంగ వీక్షణం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
fb.com/vaartha Digital

ఏడేళ్లు నివసిస్తేచాలు.. అమెరికాలో గ్రీన్‌కార్డు!
భర్తను నెలవారీ లీజుకు ఇచ్చిన భార్య 9లో

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 180 పేజీలు: 12 వెల: 6.50

# 'పరీక్షల' బిల్లు పాస్

- విపక్షాల నిరసనల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ
- చట్టం మరింత కఠినంగా అమలుకే ఈ సవరణలు: మంత్రి జితేంద్ర సింగ్
- విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలపై రగడ
- కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్ ఓం బిర్లా


లోక్‌సభలో మంత్రి జితేంద్ర సింగ్


విపక్ష నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జులై 29:** ప్రభుత్వపరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రభుత్వ పరీక్షలు (అక్రమ మార్గాలనిరోధం) సవరణ బిల్లు- 2026కు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యుల నిరసన నినా దాల మధ్య బిల్లును సభ ఆమోదించింది. సవరణ బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ సవరణల ప్రకారం నేరస్తులకు గరిష్ఠంగా 10 సంవత్స రాల జైలు శిక్షతో పాటు రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం కల్పిం చారు. ఈ సవరణ బిల్లును కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ముందురోజులోక్‌సభలో ప్రవేశ పెట్టారు. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనల నేపథ్యంలో విద్యార్థులు పెద్దఎత్తున చేపట్టిన ఆందోళనల అనంతరం విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన కొద్ది రోజులకే ప్రభుత్వం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చింది. బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీక్‌ఘటనలో ప్రభుత్వం అత్యంతవేగంగా స్పందించిందన్నారు. 2024లో పేపర్ లీక్ నిరోధక చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 52 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. అనుభవాల ఆధారంగా చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం >>2

## లాఠీ-ఛార్జి, పెల్లెట్ గన్స్ ప్రయోగం అమిత్‌షాకు తెలియదా?
### ఆయన రాజీనామా చేయాల్సిందే: రాహుల్

**న్యూఢిల్లీ,జులై 29:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై లాఠీఛార్జికి, హింసకు కారకుడు అమిత్ షా అని, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ చర్య తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఒక మీడియా సమావేశంలో రాహుల్‌మాట్లాడారు. నీట్ పేపర్‌లీకేజీ, సిజెపి ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై జరిగిన దాడి గురించి స్పందించారు. ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. కేంద్ర బలగాలు కూడా హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే >>2


బుధవారం ఉద్యోగాల కల్పనకు ఏర్పాటైన సమీక్షా సమావేశంలో మంత్రి నారా లోకేష్, అధికారులు

## జాబ్ కేలండర్-2లో 3168 ఉద్యోగాల భర్తీ
### సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల
### మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో సమీక్ష

**విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. జాబ్ కేలండర్2026పై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఉద్యోగాల కల్పనకు ఏర్పాటైన మంత్రుల బృందం ఉండవల్లి నివాసంలో సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి మంత్రులు ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో భర్తీ చేయాల్సిన పోస్టుల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జాబ్ కేలండర్26లో విడుదల చేసిన 10,060 ఉద్యోగాలను నాలుగు దశల్లో భర్తీ చేయనున్నారు. ఇప్పటికే మొదటి దశ కింద వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15న నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టుల భర్తీకి ఆగష్టు 15 నోటిఫికేషన్ విడుదల చేయాలని మొదట నిర్ణయించినప్పటికీ రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో వివిధ సాంకేతిక కారణాలు, ఉద్యోగ సంఘాల వినతి మేరకు జాప్యం జరిగింది. దీంతో సెప్టెంబర్ 15న >>2




## బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ,జులై 29:** జాతీయ గేయం వందేమాతరంను ఉద్దేశపూర్వకంగా అవమానించడాన్ని శిక్షార్హ నేరంగా ప్రకటించే జాతీయ గౌరవానికి అవమాన నిరోధక (సవరణ) బిల్లు2026కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణను ఇకపై వందేమాతరానికీ వర్తింపజేయనున్నారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఎగువ సభ దీన్ని ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకురావాలని ప్రతిపక్షసభ్యులు నినాదాలు చేశారు. ఆప్, కాంగ్రెస్, >>2



## మావోయిస్టు అగ్రనేత మిసిర్ బెస్రా అరెస్టు 11
### మరికొందరు అనుచరులను కూడా నిర్బంధించిన జార్ఖండ్ పోలీసులు

## అరుదైన వృక్షజాతి మొక్కకు నామకరణం చేసిన డి.సిఎం పవన్ 3లో



బుధవారం సిఎం చంద్రబాబుతో సమావేశమైన తైవాన్ ప్రతినిధి బృందం

# ఎపిలో తైవాన్ ఎలక్ట్రానిక్స్
### సెమీ కండక్టర్ల తయారీకి సుముఖం, సిఎం చంద్రబాబుతో తైవాన్ ప్రతినిధి బృందం చర్చలు
### తయారీ రంగంలో సాంకేతిక సహకారం బలోపేతం చేయడానికి అంగీకారం

**విజయవాడ, జులై 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహ అధునాతన తయారీ, సాంకేతిక రంగాల్లో ఏపీతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వివిధ అంశాలపై చర్చలు జరిపింది. తైవాన్ కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీటీబీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, నాన్ పావోరెసిన్స్, ఎవర్ క్లియర్ ఎన్విరానమెంటల్ ఇంజనీరింగ్, షెంగ్ హుయ్ టెక్, టెక్ టాప్ ఇంజనీరింగ్, కేఎస్ టెర్మినల్స్, శాండ్ సన్, జిలీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఇంజనీరింగ్, కపెల్లా స్టోర్స్ వంటి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ సంస్థల కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల వంటి పటిష్టమైన లాజిస్టిక్స్ నెట్వర్క్ సహా ఏపీలోని తయారీ రంగ ఎకోసిస్టమ్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు తైవాన్ ప్రతినిధుల బృందానికి వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు >>2

## పులుల సంరక్షణలో ఎపి ఆదర్శం
### నల్లమలలో పులి గర్జనను శాశ్వతం చేస్తాం: డి.సిఎం పవన్


బుధవారం పులుల సంరక్షణపై అధికారులతో సమీక్షిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ.జులై 29,ప్రభాతవార్తప్రతినిధి:** పులి కేవలం మన జాతీయ జంతువు మాత్రమే కాదు, మన దేశ అటవీ సంపదకు, జీవ వైవిధ్యానికి, పర్యావరణ సమతుల్యతకు ప్రతీక అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొణిదెల అన్నారు.పులులను సంరక్షించడం అంటే మన అడవులను, జల వనరులను, వన్యప్రాణులను, భావితరాలకు అందించాల్సిన సహజ వారసత్వాన్ని కాపాడుకోవడవే అన్నారు. డీసీఎంవో నిర్వహించిన సమీక్షలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రపంచ పులుల దినోత్సవం 2010లో పులుల సంరక్షణ కోసం అంతర్జాతీయ సమాజం తీసుకున్న సంకల్పాన్ని మనకు గుర్తు చేస్తుంది. అదే సమయంలో పులుల పరిరక్షణలో మన దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన తీరును గుర్తు చేస్తుంది. 'ప్రాజెక్ట్ టైగర్'వంటి దూరదృష్టితో కూడిన కార్యక్రమా >>2




## తిరుమల బ్రహ్మోత్సవాలకు కొత్త విద్యుత్ బస్సులు

**తిరుమల,జులై 29ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరునికి ఏడాదికోసారి జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ప్రజా రవాణా సంస్థ(పూర్వపు ఆర్టీసి,ప్రస్తుతం పిటిసి)నూతన బస్సులు తిరుమల-తిరుపతి ఘాట్‌రోడ్లపై ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని గత ఐదేళ్ళలో అధికారంలోని వైసిపి ప్రభుత్వం విస్మరించింది. అయితే 2023లో ఆర్టీసి యాజమాన్యం విద్యుత్‌తో నడిచే బస్సులను తొలివిడతగా ప్రవేశపెట్టింది. ఇదే విషయాన్ని ఆర్టీసి ఉద్యోగులు కూడా ఘంటాపథంగా చెబు తున్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రభుత్వం రెండువేలవరకు నూతనంగా విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులను ప్రజలకోసం ప్రవేశపెట్టనుందనేది ఆర్టీసి >>2

## ఎమ్మెల్యే అఖిల ప్రియపై సిఎం అసహనం 3లో


బుధవారం ప్రకాశం జిల్లావ్యాప్తంగా పొగాకు రైతుల రాస్తారోకో దృశ్యం

## పొగాకు రైతుల భారీ రాస్తారోకో
### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ రోడ్డెక్కిన వేలాది మంది రైతులు


**ఒంగోలుకలెక్టరేట్, జులై29, ప్రభాతవార్త:** వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రకాశం జిల్లావ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ముదిగొండ బ్రిడ్జి, టంగుటూరు టోల్‌గేట్, ఒంగోలు సమీపంలోని త్రోవగుంట వద్ద జాతీయ రహదారి-16పై బైక్ ర్యాలీలతో చేరుకున్న రైతులు రాస్తారోకో నిర్వహిం చడంతో ఒంగోలు-విజయవాడ హైవేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహ నదారులు గంటల తరబడి ఇబ్బందులు పడగా, పోలీసులు భారీగా మోహరించి పలువురు రైతు నాయ కులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆవి కృష్ణయ్య మాట్లాడుతూ మూడు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. వెంటనే రూ.1,000 కోట్లు కేటాయించి ఎఫ్‌టీసీ ద్వారా నిల్వ ఉన్న పొగాకును ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం ఏ గ్రేడ్‌కు రూ.240, బీ గ్రేడ్‌కు రూ.190, సీ గ్రేడ్‌కు రూ.110తో పాటు కిలోకు రూ.20 బోనస్ ప్రకటించినా అది రైతులకు ఏమాత్రం మేలు చేయదని, కనీసం సగటున కిలోకు రూ.250 ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత ధరలతో కార్పొరేట్ >>2

## బందరు పోర్టు, మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేయండి
### మచిలీపట్నం- బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించండి
### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర


బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందించిన మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా సమగ్రాభివృద్ధికి, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి అండగా నిలిచే మచిలీపట్నం బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేసారు. ఈ రోడ్డు నిర్మాణంతో మచిలీపట్నం పోర్టు, మంగినపూడి బీచ్‌కు రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుంది. తద్వారా ఈ ప్రాంతంలో పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం అవుతాయి. ప్రధానంగా మచిలీపట్నం పోర్టు అనుసంధానంగా వచ్ ఇండస్ట్రియల్ కారిడార్స్, లాజిస్టిక్స్ పార్క్స్, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ కు సానుకూల వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. సుమారు రూ.150 కోట్ల వ్యయంతో కృష్ణా జిల్లాలోని బందరు పోర్టు నుండి మంగినపూడి బీచ్ మీదుగా బంటుమిల్లి వరకు జాతీయ రహదారి 216కు అనుసంధానించాలని విన్నవించారు. ఈ రోడ్డు >>2

**క్రిటికల్ మినరల్స్ పార్క్, రేర్ ఎర్త్ కారిడార్ కు సహకరించండి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర** 2లో


బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

## ఆగస్టు 1న ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు
### 17 నుంచి కొత్త ఎయిర్‌పోర్ట్‌లో పూర్తిస్థాయి సేవలు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయనగరం, జులై 29 ప్రభాతవార్త:** ఆగస్టు 1వ తేదీన ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంతో ఉత్తరాంధ్ర ప్రజల కలలు సాకారం కానున్నాయని రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభమయ్యే శుభ ఘడియ కోసం ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికార >>2

30-7pg2exHMNWJQE_30-7pg2exHMNWJQE.qxd 30/Jul/26 12:12 AM Page 1





బుధవారం పొగాకు రైతుల ధర్నాలో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

# పొగాకు రైతుల భారీ రాస్తారోకో

>> కంపెనీలు మరింత తక్కువకు కొనుగోళ్లు చేసే అవకాశం ఉందని, గత అనుభవాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 90 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరగ్గా, ఈసారి కేవలం 30 మిలియన్ కిలోలే కొనుగోలు జరిగిందని, కనిగిరి ప్రాంతంలో 62 శాతం వరకు నోబిడ్లు నమోదైనట్లు రైతు నాయకులు తెలిపారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు సాగుకు ఎకరాకు భారీగా పెట్టుబడి పెట్టినా ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ధరలు సాగు వ్యయానికీ సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు గణనీయంగా పెరగడంతో రైతులపై అప్పుల భారం మరింత అధికమైందన్నారు. పొగాకు కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం వల్ల వ్యాపార సంస్థలు రైతులను నష్టపరుస్తున్నాయని ఆరోపించారు. ఎఫ్‌టీసీ ద్వారా ప్రభుత్వ కొనుగోళ్లు చేపడితే రైతులకు న్యాయం జరుగుతుందని, దళారుల ప్రమేయం తగ్గుతుందని పేర్కొన్నారు. పొగాకు ద్వారా ప్రభుత్వాలకు భారీ పన్ను ఆదాయం లభిస్తున్నప్పటికీ రైతుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ముందుకు రావాలని, ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కంటే గిట్టుబాటు ధర కల్పించడమే రైతులకు నిజమైన మేలు చేస్తుందని స్పష్టం చేశారు. ప్రతి బేల్‌కు నాణ్యమైన గ్రేడింగ్ నిర్వహించి రైతులకు అన్యాయం జరగకుండా పర్యవేక్షణ పెంచాలని కోరారు. నిల్వల్లో ఉన్న పొగాకును వెంటనే కొనుగోలు చేయకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతుల ప్రతినిధులతో తక్షణమే సమావేశం నిర్వహించి స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనల కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు చాలా సేపు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సేవల వాహనాలకు మార్గం కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో భారీగా తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. రైతుల డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని పలువురు రైతు సంఘాల నాయకులు కోరారు. పొగాకు రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు హెచ్చరించారు. రైతుల అరెస్టులను ఖండిస్తూ వెంటనే వారిని విడుదల చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ అనంతరం పరిస్థితి అదుపులోకి వచ్చింది. రైతు సంఘాల నేతలు కృష్ణయ్య, చుండూరు రంగారావు, పమిడి వెంకట్రావు తదితరులు నిరసన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.

# క్రిటికల్ మినరల్స్ పార్క్, రేర్ ఎర్త్ కారిడార్ కు సహకరించండి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపారమైన ఖనిజ వనరులు, రేర్ ఎర్త్ మినరల్స్ అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర మైనింగ్ రంగాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి గారిని ఢిల్లీలోని వారి కార్యాలయంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కలిసి విన్నించారు. రాష్ట్రంలో క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, ఆంధ్రాయూనివర్శిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ కెమికల్ ఇంజనీరింగ్ ఏర్పాటు, ఏపీ రేర్ ఎర్త్ కారిడార్ అభివృద్ధిపై ప్రతిపాదనలు అందించారు. రాష్ట్రంలోని ఖనిజాలు, స్ట్రాటజిక్ మినరల్స్‌కు ప్రపంచ స్థాయి వేల్యూ యాడెడ్ పరిశ్రమ ఏర్పాటు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ కెమికల్ ఇంజనీరింగ్ ఏర్పాటు ద్వారా సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. తయారీ, ఎగుమతులను కలుపుతూ సమగ్రమైన రేర్ ఎర్త్ వ్యవస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని కోరారు. దేశ మైనింగ్ అవసరాలు తీర్చేలా స్థానికంగానే అన్ని పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

# పులుల సంరక్షణలో ఏపి ఆదర్శం

>>ల ఫలితంగా నేడు ప్రపంచంలోని పులులలో దాదాపు 75 శాతం మన దేశంలో నివసిస్తున్నాయి. ఇది భారతదేశం సాధించిన అపూర్వ పర్యావరణ విజయానికి నిదర్శనం. దేశంలోనే అతి పెద్ద పులుల సంరక్షణ ప్రాంతమైన నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం మనందరికీ గర్వకారణం. నల్లమల అటవీ ప్రాంతంలో 5,442.83 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ రిజర్వ్ పులులతోపాటు చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి కుక్కలు, శాకాహార జంతువులు మరియు వందలాది వన్యప్రాణులకు సురక్షిత ఆవాసంగా నిలుస్తోంది. తాజా అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌ఎస్‌ఆర్‌టీ -శేషాచలం పరిధిలో 68 పులులు, 11 పులి పిల్లలు నమోదుకావడం సంతోషకర విషయం. ఎన్‌ఎస్‌టీఆర్ టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11 చెక్‌పోస్టులు నెలకు రూ. కోటికి పైగా ఆదాయం సమకూరుస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. తూర్పు కనుమల ప్రాంతంలో పులుల జన్యు వైవిధ్యాన్ని, జనాభాను పెంపొందించేందుకు మహారాష్ట్రలోని చంద్రపూర్ అటవీ పరిధి నుంచి రెండు ఆడ పులులను, మధ్యప్రదేశ్ నుంచి మరో రెండు ఆడ పులులను తీసుకురావడానికి సూత్రప్రాయ అంగీకారం లభించడానికి సహకరించిన కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖమంత్రి భూపేందర్‌యాదవ్ ఈ సందర్భంగా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదే సమయంలో సుమారు 800 మంది గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డి కె శివకుమార్‌కి, మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకి, అప్పటిఅటవీశాఖ మంత్రి, ప్రస్తుత పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. వారి సహకారం, "స్నేహభావం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత పెం చాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర, పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, శాసన సభ విప్ తోయక జగదీశ్వరి, అటవీ పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికా ర్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్‌ఎన్.నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనే జింగ్ డైరెక్టర్‌నందిని సలారియా, విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ.కె.వి.రాజు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి,పార్వతీపురం మన్యం జిల్లా అటవీ అధికారి ప్రసూన పాల్గొన్నారు.


బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మంత్రి కొల్లు రవీంద్ర భేటీ

# అభివృద్ధి చేయండి

>> మార్గం పూర్తైతే.. అంతరాయం లేని కనెక్టివిటీ లభిస్తుంది. ఎంతో వ్యూహాత్మక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రతిపాదిత రోడ్డు మార్గం మొత్తం ప్రభుత్వ భూమి గుండా వెళుతుండడంతో భూసేకరణ సమస్యలు లేకుండా కొత్త రహదారి నిర్మాణం చేయడానికి ఆస్కారం ఉంది. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ జాతీయ మరియు అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా మారబోతోంది. ఈ రోడ్డు పూర్తైతే పోర్ట్ ద్వారా ఎగుమతి దిగుమతులు, కంటైనర్ ట్రాఫిక్, భారీ వాణిజ్య వాహనాలు మరియు లాజిస్టిక్స్ కార్యక లాపాల కదలికలకు సులువు అవుతుంది. ప్రతిపాదిత రోడ్డు మచిలీపట్నం ప్రాంతంలో రాబోయే ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ పార్కు లు, ఎంఎస్‌ఎంఇ క్లస్టర్‌లు, మత్స్య మౌలిక సదుపాయాలు మరి యు అనుబంధ వాణిజ్య సంస్థలకు సమర్థవంతమైన కనెక్టివిటీని అందించగలుగుతుంది. తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువులు రవాణాను సులభతరం చేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తైతే కృష్ణా జిల్లా మరియు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి గణనీయంగా దోహదపడు తుంది. లక్షలాది మంది పర్యాటకులను ఆక ర్షించే మంగినపూడి బీచ్‌కు రోడ్డు సదుపాయం మెరుగవుతుంది.

తద్వారా పర్యాటకం పెరిగి.. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆతిథ్యం, వినోదం మరియు ఇతర పర్యాటక కార్యక లాపాలకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. పారిశ్రా మిక, పర్యాటక అభివృద్ధిని, ఉద్యోగ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర అభివృద్ధికి అండగా నిలిచే ఈ రోడ్డు మార్గానికి వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేసి పూర్తి చేయాలని విన్నవించారు.

# ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**నెల్లూరు క్రైం, జులై 29, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని నిర్మలానగర్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అనూదీప్ సాయి (22) అనే యువకుడు ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనూదీప్ సాయి చిన్నప్పటి నుంచి చదువులో కొద్దిగా వెనుకబడి ఉన్నాడు. ఇటీవల యూనివర్సిటీ పరీక్షల్లో కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ, గురువారం తెల్లవారు జామున ఇంటికి వచ్చిన యువకుడు తన పడక గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. తెల్లవారు జామున నిద్రలేచిన తల్లి ఈ విషయాన్ని గమనించి వెంటనే భర్తకు తెలిపింది. భార్యా భర్తలిద్దరూ కలిసి కిందకు దించి, 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి వచ్చి పరిశీలించి, అప్పటికే యువకుడు మృతి చెందనట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిజిహెచ్ ఆసుపత్రికి తరలించారు.

# అనంతలో తొలి కరోనా కేసు

## గుంతకల్లు వృద్ధురాలికి ఐసోలేషన్ చికిత్స

**అనంతపురం క్రైమ్, జులై 29 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లాకు కూడా కరోనా మహమ్మారి పాకింది. తాజాగా జిల్లాలోని గుంతకల్లు పట్టణానికి చెందిన ఓ 65 ఏళ్ల వృద్ధురాలికి కరోనా పాజిటివ్ గా ధ్రువీకరణ అయ్యింది. గత మూడు రోజులుగా తీవ్ర జ్వరం, దగ్గు, తలనొప్పి, తదితర సమస్యలతో గుంతకల్లులోని ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్ళింది. కరోనా లక్షణాలపై అనుమానం వచ్చిన వైద్యులు కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్ చూసిన వైద్యులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. దీంతో అప్రమత్తం అయిన ఆసుపత్రి వర్గాలు తగిన చర్యలు తీసుకున్నారు. వెంటనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోవిడ్ ఐసోలేషన్ వార్డు కు ఆమెను తరలించారు. కోవిడ్ కు సంబంధించిన వైద్య సేవలు అందిస్తున్నారు. కరోనా లక్షణాలు ఉంటే భయపడకుండా సమీప ప్రభుత్వా సుపత్రికి వెళ్ళి పరీక్షలు చేసుకోవాలని సూచి స్తున్నారు.

# 'పరీక్షల' బిల్లు పాస్

>> భావిస్తోందని, అందుకే ఈ సవరణలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు గత కొన్ని సంవత్సరాల్లో తగ్గుముఖం పట్టాయని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై జితేంద్ర సింగ్ విమర్శలు గుప్పించారు. పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రభుత్వ వ్యవహార తీరుపై ఆయనకు సరైన అవగాహన లేదని ఆరోపించారు. బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన అనంతరం సభను వాయిదా వేశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టిన సమయంలో ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, ఆందోళనల మధ్య తీవ్ర గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకోవడంతో సభలో ఉద్రిక్త వాతావరణం కనిపించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగంతో ప్రధానంగా రాజకీయ దుమారం రేగింది. ఆయన కేంద్ర హోంమంత్రి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు గుప్పించారు. సభలో నిరసనలు వ్యక్తమవడంతో రాహుల్ గాంధీ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని విమర్శించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడానికి ముందు పార్లమెంట్ గౌరవాన్ని కాపాడాలని ఆయన సూచించారు. సభ పలుమార్లు వాయిదా పడిన అనంతరం జితేంద్ర సింగ్ బిల్లును అధికారికంగా సభ ముందుంచారు. అప్పటికీ ప్రతిపక్ష సభ్యులు 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు కొనసాగించారు. గందరగోళం మధ్యే బిల్లును వాయిస్ ఓటుకు పెట్టగా, లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం పరీక్షా పత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన కీలక చట్ట సవరణగా పేర్కొంటోంది. పేపర్ లీక్ నేరాలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టంచేసింది. కొత్త సవరణ బిల్లులో ఈ నేరాలకు మరింత ఎక్కువకాలం జైలుశిక్షలు, భారీ ఆర్థిక జరిమానాలు విధించేలా నిబంధనలు తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉభయసభలు ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదిస్తే చట్టరూపంలోకి ఈ కొత్తబిల్లు రానున్నది.

# రాజ్యసభ ఆమోదం

>> సిపిఎం సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇరు పక్షాల సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ, 1971లో జాతీయ చిహ్నాల పరిరక్షణ కోసం ఈ చట్టాన్ని తీసుకొ చ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే రక్షణను వందేమాతరానికీ విస్తరిస్తున్నామని చెప్పారు. బంకించంద్ర చటర్జీ 1875లో ఈ గీతాన్ని రచించారని, 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారని వివరించారు.

# అమిత్‌షాకు తెలియదా?

>> పని చేస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో వారంతా కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోనే పని చేస్తారు. ఢిల్లీలో నిరసన చేసిన యువత, విద్యార్థులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ బ్యాటన్స్, మేకులున్న లాఠీలు ప్రయోగించారు. పెల్లెట్ గాయాలు, లాఠీ గాయాలున్న విద్యార్థుల్ని చూశాను. విద్యార్థులపై పోలీసులు, భద్రతా బలగాల దాడికి ఆదేశాలిచ్చింది హోం మంత్రి అమిత్ షానే. ఒకవేళ ఈ విషయం అమిత్ షాకు తెలియకుంటే ఆయన ఈ పదవిలో కొనసాగడానికి అనర్హుడు. ఒకవేళ ఈ దాడికి అమిత్ షా ఆదేశించి ఉంటే ప్రధాన నిందితుడు కూడా ఆయనే. విద్యార్థులపై జరిగిన ఈ దారుణ ఘటనలకు బాధ్యుడైన అమిత్ షాను మంత్రివర్గం నుంచి తప్పించాలి. ఈ విషయంలో ప్రధాని మోడీకి కూడా నేను సలహా ఇస్తున్నా అంటూ రాహుల్ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం తనను మాట్లాడనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను మాట్లాడేందుకు వీలుగా ఆర్డర్ ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. కానీ, అనుమతి ఇవ్వలేదు. అమిత్ షాపై ఆరోపణలు చేసినందుకు నన్ను అనుమతించడం లేదని, క్షమాపణలు చెప్పాలి అంటున్నారు. క్షమాపణలు చెబితేనే అనుమతిస్తాం అంటున్నారు. నేను బిజెపికి కానీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు కానీ, ఏ ఒక్క వ్యక్తికి కానీ క్షమాపణ చెప్పబోను అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. సిజెపి నిరసనల సందర్భంగా మైనర్లపై కూడా పోలీసులు దాడిచేశారని రాహుల్ ఆరోపించారు. విద్యార్థులపై అద నపు బలగాల్ని ఉపయోగించడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు.

# మాజీ మంత్రి కారుమూరికి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ

**విజయవాడ,జులై 29,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఏపీ మద్యం రవాణా కుంభకోణానికి సంబంధించి ముందస్తు బెయిల్ కోరుతూ కారుమూరి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం ఇవాళ కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సమర్థించింది. ఈ స్కామ్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని, పిటిషనర్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కారుమూరి తరఫు న్యాయవాది సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం మద్యం స్కామ్‌లో రూ.350 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు దర్యాప్తులో కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితుడి విచారణ అవసరమని న్యాయస్థానం అభిప్రాయపడింది. కస్టోడియల్ దర్యాప్తు లేకుండా పూర్తిస్థాయిలో నిజాలను వెలికితీయడం కష్టమని పేర్కొంది.

# బిజెపి బలోపేతానికి ప్రత్యేక కమిటీ: రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

**విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేసింది. పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల నిర్వహణ, సమన్వయం, వ్యూహరచన కోసం రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను నాలుగు జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి కార్యాచరణ, అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణులతో నిరంతర సమన్వయం వంటి అంశాలను కమిటీ పర్యవేక్షించనుంది. ప్రత్యేక కమిటీలో రాష్ట్ర ఆరోగ్య మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నా యుడు, ఎమ్మెల్యేలు ఈశ్వర్‌రావు, ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, డాక్టరు పీవీ పార్థసారథి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడారి ఆనంద్ కుమార్. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణలను నియమించారు.

# ఆగస్టు 1న ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

>> సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం భోగాపురం ఎయిర్‌పోర్ట్ వద్ద పాత్రికే యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రమాన్ని ప్రారంభిస్తారని, 17వ తేదీ నుంచి ఇక్కడ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 16 వ తేదీ రాత్రి సింగపూర్ నుంచి విమానం వచ్చి, 17వ తేదీ తెల్లవారుజామున ఇక్కడినుంచి బయలుదేరుతుందని వివరించారు. హూద్ హూద్ తుఫానును ఎదుర్కొనే సమయంలోనే ఈ ప్రాంతంలో విమానాశ్రయాన్ని నిర్మించాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబుకి వచ్చిందని, ఆయన దూరదృష్టి, పరిపాలనా దక్షత కారణంగా, ఈ ఆలోచన సాకారం అయ్యిందని అన్నారు. అలాగే ఆగస్టు 13 న పోలవరం ఎడమ కాలువ నుంచి నీరు విడుదల చేసి, మరో స్వప్నాన్ని సాకారం చేయనున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కేవలం 24 నెలల్లోనే ఉత్తరాంధ్రలో ఎన్నో అద్భుత కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం రైల్వే జోన్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్ తదితర ప్రాజెక్టులను సాధించడమే కాకుండా, స్టీల్ ప్లాంట్ మూతపడకుండా ఎన్నో చర్యలను తీసుకున్నామని వివరించారు. అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులకు అన్నివిధాలా న్యాయం చేస్తామని, వారికి విమాన ప్రయాణ యోగాన్ని కల్పించి గౌరవిస్తామని తెలిపారు. డీఎస్సీ పరీక్షలు అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా జరిగాయని, దీనిపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను అచ్చెన్నాయుడు కొట్టి పడేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు.

# మహిళా కోర్టుని ఆశ్రయించిన జోగి రమేశ్ ఫ్యామిలీ

**విజయవాడ.జులై29,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ సభ్యులు విజయవాడ మహిళా కోర్టును ఆశ్రయించారు. తమను ఈ కేసులో అరెస్ట్ చేయొద్దంటూ వారు కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వరకట్న వేధింపులు, హత్యాయత్నం కేసు నమోదు కావడంతో వీరు ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఇబ్రహీంపట్నం పోలీసులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 4కు కోర్టు వాయిదా వేసింది. జోగి రమేష కుమారుడు జోగి రాజీవ్ సతీమణి ఇబ్రహింపట్టణం పోలీసు స్టేషన్‌లో ఇటీవల గృహహింస,ఆర్థిక అంశాల్లో వేధింపులకు తనపై భర్త,అత్త మామలు,ఇతర కుటుంబసభ్యులు మొత్తం 11మందిపై ఆమె ఫిర్యాదు చేసారు.

# ఏపిలో తైవాన్ ఎలక్ట్రానిక్స్

>> విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. భారత్ లో తమ దేశానికి చెందిన సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చర్చల సందర్భంగా ఏకగ్రీవంగా అంగీకారం కుదిరింది.

**ఐటీ మంత్రితో తైవాన్ బృందం చర్చలు:** సీఎం చంద్రబాబుతో మాట్లాడిన అనంతరం తైవాన్ ప్రతినిధుల బృందం ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఏపీలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల కల్పన విద్యాపరమైన సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలలోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీకి చెందిన యువతకు తగిన నైపుణ్యం, టెక్నికల్ ట్రైనింగ్ సహా ఉన్నత విద్య భాగస్వామ్యాలపై తైవాన్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిగాయి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, ఇతర హైస్కిల్ రంగాలలో పరస్పర సహకారం అందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడంతో పాటు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థిఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఉద్యోగసన్నద్ధత కార్యక్రమాలపై కూడా చర్చలు జరిగాయి. తైవాన్ ఏపీ మధ్య ఈ సమావేశం కీలక మైలు రాయిగా నిలవనుంది.

# జాబ్ కేలండర్-2లో 3168 ఉద్యోగాల భర్తీ

>>నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. జాబ్ కేలండర్ లో భాగంగా ఒకేసారి మూడు, నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 15న నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. మూడో దశలో 2,388, నాలుగో దశలో 2,981 పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ విభాగాల్లోని ఖాళీలను డిపార్ట్ మెంట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భర్తీ చేయాలని సీఎం గారు నిర్దేశించారని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలోని 2,388 ఉద్యోగాల్లో 2,225 పోస్టులు హోంశాఖలో భర్తీ చేయనున్నారు. గ్రూప్1లో ఇప్పటికే సూచించిన ఉద్యోగాల కంటే మరికొన్ని ఉద్యోగాలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రుల బృందం అభిప్రాయపడింది. మొత్తంగా 10,060 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సకాలంలో పోస్టులు భర్తీ చేసి ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేయాలని ఆదేశించారు. జాబ్ కేలండర్2026 పూర్తి ఖాళీల వివరాలను ఆరో తేదీన జరిగే కేబినెట్ ముందు ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రవి సుభాష్, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ పాల్గొన్నారు.

# కొత్త విద్యుత్ బస్సులు

>> వర్గాల సమాచారం. రానున్న సెప్టెంబర్‌లో తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వందవరకు నూతన విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులు తిరుపతి జిల్లాకు రానున్నాయనేది సమాచారం. ఈ బస్సులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రహ్మోత్సవాలకు తిరుమల పర్యటనరోజు లాంఛనంగా ప్రారంభించేందుకు తిరుపతి జిల్లా ఆర్టీసి అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బ్రహ్మోత్సవాలనాటికి తిరుమల-తిరుపతి మధ్య ఘాట్‌రోడ్డులో కొత్తబస్సులు తీసుకురావాలనేది నిర్ణయం. ప్రస్తుతం 50వరకు తిరుమల ఘాట్‌రోడ్డులో తిరుపతి,అలిపిరి,మంగళం డిపోలకు చెందిన విద్యుత్ ఆర్టీసి బస్సులు నడుస్తున్నాయి. ప్రతిరోజూ యాత్రికులను సురక్షితంగా తిరుమలకు తీసుకువచ్చి తిరిగి తిరుపతికి చేరవేస్తున్నాయి. ఈ బస్సులు యాత్రికులకు మరింతగా సేవలందిస్తుండటంతో పూర్తిస్థాయిలో ఘాట్‌లో పర్యావరణ హిత బస్సులు నడపాలనేది అటు టిటిడి ఇటు ఆర్టీసి అధికారుల ఉద్దేశ్యం. తిరుమలకు నడుపుతున్న ఆర్టీసి డీజిల్ బస్సుల ఛార్జీ 90 రూపాయలుకాగా విద్యుత్‌తో నడిచే బస్సుల్లో 110రూపాయలుగా వసూలుచేస్తున్నారు. ఛార్జీల్లో తేడాను కూడా యాత్రికులు పెద్దగా పట్టించుకోవడంలేదు. శేషాచలంకొండల్లోని తిరుమలపుణ్యక్షేత్రంపై పర్యావరణాన్ని కాపాడేందుకు టిటిడి కూడా విద్యుత్‌తో నడిచే వాహనాల వినియోగంపై దృష్టిసారించింది. ఇప్పటికే దాదాపు టిటిడిలో విభాగాధిపతులు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను వినియోగిస్తున్నారు. దీనివల్ల ఘాట్‌లో కాలుష్యం శాతం పూర్తిగా తగ్గింది. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధంతోబాటు డీజిల్‌తో నడిచే వాహనాలను క్రమేణా నిషేధించి విద్యుత్‌తో నడిచే వాహనాలను ఘాట్‌లో తిరిగేలా మరింతగా ప్రోత్సహించాలని భావిస్తున్నారు. తిరుపతి రీజియన్‌కు మరో నెలరోజుల్లో వందకుపైగా విద్యుత్ బస్సులు వస్తున్నాయని తెలుస్తోంది.

## వారం - వర్జ్యం

30-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పుష్యమి కార్తె
పాడ్యమి రా.9.28
శ్రవణ సా.5.41
వర్జ్యం : రా.9.58-రా.11.41
దు.ఉ.10.05-ఉ.10.57,
2) మ.3.14-సా.4.06
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** అందివచ్చే అవకాశములను నేర్పుతో మీకు అనుకూలంగా మార్చుకోండి. ఆర్థిక అభివృద్ధి చెందుతుంది.

**వృషభం:** దూరప్రాంతంలోని సన్నిహిత వర్గం ద్వారా మాట సహాయం పొందుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మిథునం:** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుని ముందుకు సాగుతారు. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు.

**కర్కాటకం:** జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**సింహం:** భూ వివాదాలు తీరి లబ్ది పొందుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కలసి వస్తాయి. ప్రయత్నాలు నిదానంగా పూర్తిచేస్తారు.

**కన్య :** ఇతరుల విషయాలలో అతి జోక్యం వల్ల అభాసుపాలవుతారు. సంఘంలో గౌరవం పొందుతారు. బంధువుల కలయిక.

**తుల:** ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు. సమస్యల పరిష్కారాన్ని కాలానికి వదిలివేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** కార్యాలయంలోని నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. మీ కృషిని పట్టుదలను అందరూ మెచ్చుకుంటారు.

**ధనుస్సు:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్య విషయాలలో మెలుకువ పాటించండి. మీ ఆలోచన విధానంలో మంచి మార్పువస్తుంది.

**మకరం:** మాటమీద నిలకడ లేని మనుషుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. జాగ్రత్తలు పాటించండి.

**కుంభం:** గృహ సంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

**మీనం:** ముఖ్యమైన పత్రాలకు జతచేయవలసిన వాటిని మర్చిపోయే అవకాశం వుంది. జాగ్రత్తలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

30-7Pg3fG_30-7Pg3fG.qxd 30/Jul/26 12:13 AM Page 1



# రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

## ● నిర్మాణాత్మక సలహాలు ఇస్తే స్వాగతిస్తాం

## ● వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మిత్రపక్షంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా రాజకీయ నాయకుడిగా రైతుల శ్రేయస్సు కోరుకోవడం ప్రధాన లక్షణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు మేలు చేసే సహేతుకమైన, నిర్మాణాత్మకమైన సలహాలను ఏ రాజకీయ పార్టీ నుంచి వచ్చినా ప్రభుత్వం తప్పకుండా స్వాగతిస్తుందని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతుల సమస్యలపై సక్రమంగా స్పందిస్తూ, వారికి అండగా నిలుస్తున్న సమయంలో నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని హితవు పలికారు. పొగాకు రైతులను గతంలోనూ.. ఇప్పుడూ సక్రమంగా ఆదుకున్నది తెదేపా, కూటమి ప్రభుత్వాలేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటుంటే జగన్‌మోహన్ రెడ్డికి ఇవేవీ కనిపించడం లేదా? అని మంత్రి ప్రశ్నించారు. నెగిటివ్ స్టేట్‌మెంట్ల ద్వారా మార్కెట్‌ను ప్రభావితం చేసి, రైతుల్లో ఆందోళన పెంచేలా వ్యవహరించడం వల్ల రైతులకే నష్టం జరుగుతుందని అన్నారు. తన వ్యాఖ్యల వల్ల రైతులు మరింత డిస్ట్రెస్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, కనీసం ఆ విషయమైనా జగన్‌మోహన్ రెడ్డి ఆలోచించాలని సూచించారు. రైతులకు మంచి చేసే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని, అంతే తప్ప రైతులను మరింత ముంచేలా నెగిటివ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు హితవు పలికారు.

# ఎమ్మెల్యే అఖిలప్రియపై సిఎం అసహనం

## ● ఆళ్లగడ్డ రాజకీయాలు, అహోబిలం దేవాలయ టెండర్ల వివాదంపై టిడిపి అధిష్టానం మండిపాటు

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆళ్లగడ్డ నియోజకవర్గ రాజకీయాలు, అహోబిలం దేవాలయ టెండర్ల వివాదంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీవ్రంగా మండిపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి, ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గ వ్యవహారాల్లో ఆమె భర్త భార్గవ్ రామ్ జోక్యం చేసుకోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పల్లా స్పష్టం చేసినట్లు తెలిసింది. అహోబిలం ఆలయంలో తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో అఖిలప్రియ జోక్యం చేసుకోవడం, ఆమె భర్త కారణంగా స్థానికంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులతో విభేదాలు తలెత్తడం వంటి అంశాలపై అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేగా కేవలం అఖిలప్రియ మాత్రమే బాధ్యతలు చూడాలని, ఆమె భర్త జోక్యం ఎంతమాత్రం ఉండటానికి వీల్లేదని పల్లా కరాఖండిగా చెప్పారు. పార్టీ క్రమశిక్షణను దాటితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా, భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల రాజకీయ స్థాయికి తగినట్లుగా పనిచేయాలని, వారి పేరు నిలబెట్టాలని అఖిలప్రియకు పల్లా సూచించారు. పార్టీ సూచనలు తప్పక పాటిస్తానని అఖిలప్రియ హామీ ఇచ్చారు. అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటే పార్టీ పూర్తి అండగా ఉంటుందని పల్లా భరోసా ఇచ్చారు.

భేటీ అనంతరం అఖిలప్రియ మాట్లాడుతూ.. ఆళ్లగడ్డలో ఏ చిన్న సంఘటన జరిగినా దానిని పెద్ద సెన్సేషన్‌గా మారుస్తున్నారని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో అనవసరంగా హైప్ క్రియేట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని వివాదాలు, సమస్యలపై పార్టీ అధ్యక్షుడికి పూర్తి స్పష్టత ఇచ్చానని, పార్టీ శ్రేణుల్లో ఎలాంటి అయోమయం ఉండకూడదనే ఉద్దేశంతోనే ఆయన్ను కలిశానని వివరించారు.

# ముగిసిన అమరావతి ఛాంపియన్‌షిప్



**తిరుపతి (క్రీడ), జులై 29 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం తిరుపతి జిల్లాలో విజయవంతంగా ముగిశాయి. తిరుపతి, చంద్రగిరి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి మరియు సత్యవేడు నియోజకవర్గాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో సుమారు 616 మంది బాలురు, 273 మంది బాలికలు పాల్గొన్నారు. వీరితో పాటు కోచ్‌లు, పిడిలు, పిఇటిలు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులు, క్రీడాభిమానులు కలిపి సుమారు 10,000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. విజేతలుగా ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు.

# పార్టీలు వేరైతే... నేతలు కలవడం కూడదా?

## ● మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో తన పక్కన కూర్చున్నందుకు టిడిపి నేత బొండా ఉమాకు ఆ పార్టీ అధిష్ఠానం నోటీసులు ఇవ్వడంపై వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. పార్టీలు వేరైనా సామాజికవర్గ కార్యక్రమాల్లో నేతలు కలవడం సహజమన్నారు. అంత మాత్రానికే బొండా ఉమా నుంచి వివరణ కోరడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. "తామిద్దరం పక్కపక్కనే కూర్చోవడం అంత పెద్ద తప్పా అని" అంబటి ప్రశ్నించారు. రాష్ట్రంలో వర్షాల్లేక, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. వాటిపై దృష్టి పెట్టకుండా తన పక్కన బొండా ఉమా కూర్చోవడాన్నే చంద్రబాబు పెద్ద సమస్యగా మార్చారని అంబటి ఎద్దేవా చేశారు.

# డిఎస్సీ నియామకాలు రద్దు చేయాలి

## ● హైకోర్టులో మరో పిల్ వేసిన వైసిపి ఎమ్మెల్సీ

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డిఎస్సీ 2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హైకోర్టులో మరోసారి ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ నియామక ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐతో విచారణ జరిపించాలని కోరారు. దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు వీలుగా డిఎస్సీ నియామకాలకు సంబంధించిన అధికారిక రికార్డులు, అభ్యర్థుల సమాధాన పత్రాలు (ఆన్సర్ షీట్లు), లాగిన్ ఐడిలతో పాటు సంబంధిత డేటానంతటినీ వెంటనే సీజ్ చేసి భద్రపరిచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా ఈ విషయమై పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను ఈనెల 20న ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అయితే, తగిన ఆధారాలు, డాక్యుమెంట్లు జత చేయకుండా చాలా సాధారణంగా పిటిషన్ దాఖలు చేశారంటూ ఆనాడు ధర్మాసనం ఆక్షేపించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది క్షమాపణలు కోరడంతో, సదరు పిటిషన్ ఉపసంహరణకు అనుమతిస్తూనే అన్ని ఆధారాలతో తాజాగా మరొక పిటిషన్ వేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చింది. కోర్టు ఇచ్చిన ఆ ఆదేశాల మేరకు చంద్రశేఖర్‌రెడ్డి తాజాగా ఈ పిల్‌ను దాఖలు చేశారు.

# అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం

## ● 'క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్' అని పేరు పెట్టిన డి.సిఎం పవన్ కల్యాణ్

## ● తూర్పు కనుమల్లోని ఉబ్బలమడుగు జలపాతం ప్రాంతంలో గుర్తించిన కొత్త వృక్ష జాతి



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నామకరణం చేశారు. యూఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి 'క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్' పేరు పెట్టారు. ఉబ్బల మడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కల్యాణ్ ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్‌తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు.

ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బల మడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.

# వైకాపాది గొడ్డలి పార్టీ.. కూటమిది అభివృద్ధి పార్టీ

## ● తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్



**ఆదోని, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా పాలన గొడ్డలి సంస్కృతికి నిదర్శనమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎన్డీయే కూటమి అభివృద్ధికి చిరునామా అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విమర్శించారు. ఆదోనిలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదోని నియోజకవర్గంలోని మైనారిటీలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.

**కార్యకర్తలకు హెచ్చరిక:** "ఆదోనిలో గెలుపైనా, ఓటమైనా 5050గానే ఉంటుంది. నేను చంద్రబాబు గారి అంత మంచోడిని కాదు. ఒక్కసారి, రెండుసార్లు చెప్తాను.. ఆ తర్వాత నా ఇష్టం" అంటూ కార్యకర్తల పనితీరుపై కఠినంగా ఉంటానని స్పష్టం చేశారు.

**రాయలసీమ అభివృద్ధి:** రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా (తోటబడి పంటల కేంద్రంగా) తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

**కోటి మంది సభ్యత్వంతో రికార్డు:** ప్రతి కార్యకర్తే అధినేతగా భావించే ఏకైక పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. దేశంలోనే కోటి మంది సభ్యత్వం కలిగిన ఘనత ఒక్క టీడీపీకే దక్కుతుందన్నారు.

**సంక్షేమంపై ఇంటింటికీ నిఘా:** ఆదోనిలోని పార్టీ కార్యకర్తలు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును కలసిన మంత్రి శ్రీనివాస్



**విజయనగరం, జులై 29 ప్రభాతవార్త:** గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అరగంటకు పైగా ఇష్టాగోష్టి నిర్వహించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన మీరు పునాది వేసిన భోగాపురం ఎయిర్‌పోర్ట్ తమరి కల మరో రెండు రోజులలో సాకారం కావడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విమానయాన రంగంలో జీఎంఆర్ సంస్థకు మంచి అనుభవం ఉందని, త్వరితగతిన పూర్తి చేసిన జీఎంఆర్ సంస్థకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారు అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికి ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు నామకరణం చేయటం శుభ పరిణామం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించడం బాగున్నదన్నారు. పరిశ్రమలు, రవాణా వ్యవస్థ బాగుంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని గవర్నర్ సూచించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్సీపై మాట్లాడే హక్కు వైసిపికి లేదు: ప్రశాంతిరెడ్డి



**బుచ్చి (నెల్లూరు), జులై 29 ప్రభాతవార్త:** మెగా డిఎస్సీ మాట్లాడే హక్కు ప్రతిపక్షాలకు లేదని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని రామచంద్రాపురంలో నిర్వహించిన ఇంటింట ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు గత ప్రభుత్వ హయాంలో డిఎస్సీని విమర్శించి ఇప్పుడు మెగా డిఎస్సీపై విమర్శలు చేయడం సిగ్గు చేటు అని ఆమె విమర్శించారు. నెల్లూరులో డిఎస్సీలో అక్రమాలంటు ర్యాలీలు నిర్వహించే ముందు వైసిపి నేతలు గత ఐదేళ్ళలో ఎందుకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 16 వేల కుటుంబాలు బాగుపడడం ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని ఆమె కొనియాడారు. ఎన్నిలకు ముందు ఇచ్చిన ప్రతి హామి నెరవేరుస్తు ప్రజల మనన్నలు పొందుతుందని అన్నారు.



# ప్రధాని పర్యటనలో ఉత్సాహంతో పనిచేయాలి

**విజయనగరం, జులై 29 ప్రభాతవార్త:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరూ ఉత్సాహంతో పనిచేయాలని బుధవారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ ఐజీ కే.శ్రీకాంత్, విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, గ్రేహౌండ్స్ డీఐజీ అట్టాడ బాపూజీ, వెల్ఫేర్ డీఐజీ అన్బురాజన్, బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్ రెడ్డి, విజయవాడ డీసీపీ కృష్ణకాంత్ పటేల్ తో కలసి ప్రధాని సభకు బస్సులో ప్రజలు వచ్చే మార్గాలను పరిశీలించారు. నిర్మాణ పనులు అవుతున్నందున ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు నిర్మించాలని, ర్యాంపులు నిర్మించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడి విధులను అంకిత భావంతోను, క్రమశిక్షణతో నిర్వహించాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు విధులు నిర్వహించేందుకు కేటాయించిన ప్రాంతాలను విడిచి పెట్టవద్దని జిల్లా ఎస్పీ ఆదేశించారు. బందోబస్తు నిమిత్తం భోగాపురం వచ్చిన పోలీసు సిబ్బందికి వసతులను, భోజనాలను జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసింది. సభ నిర్వహించే ప్రాంతాలను, ఎయిర్‌పోర్ట్ ఆవరణంలో పలు ప్రాంతాలను డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

# జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే

## ● దేశభక్తి, వందేమాతరం విశిష్టతపై రాజ్యసభలో ఎంపి చింతకాయల విజయ్



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** నేషనల్ ఆనర్ అమెండ్‌మెంట్ బిల్లుపై తెలుగు దేశం పార్టీ ఎంపి చింతకాయల విజయ్ రాజ్య సభలో మాట్లాడుతూ, ఈ బిల్లుపై తన అభిప్రాయాలను పంచుకునే అవకాశం లభించినందుకు అత్యంత వినమ్రతతో, బాధ్యతాయుత మైన భావనతో సభ ముందు నిలబడ్డానని తెలిపారు. ఈ క్షణం కేవలం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, ప్రజల నమ్మకానికి ప్రతీక అని, మన ప్రజాస్వామ్య శక్తికి మరియు జాతీయ ఆత్మ అయిన 'వందేమాతరం' స్వరానికి ప్రతీక అని పేర్కొన్నారు. భారతదేశం కేవలం ఒక భౌగోళిక ప్రాంతం లేదా మట్టి ముక్క కాదని, ఇది ఒక సజీవమైన సాంస్కృతిక వారసత్వమని వర్ణించారు. ఇది వందన, అభినందన, అర్పణ, తర్పణ భూమి అని ఉద్ఘాటించారు. దేశంలో పారే ప్రతి నది గంగతో సమానమని, ప్రతి రాయి శంకరునితో సమానమని పేర్కొంటూ, "మనం జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే చివరికి మన అస్థికలు గంగాజలంలో కొట్టుకుపోతున్నప్పుడు ఎవరు చెవిపెట్టి విన్నా భారత్ మాతాకీ జై., వందేమాతరం అనే శబ్దాలే వినిపిస్తాయి" అని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం తెచ్చిన స్ఫూర్తిని, త్యాగాలను ఈ సందర్భంగా ఎంపి విజయ్ గుర్తుచేశారు. తన స్వస్థలమైన నర్సీపట్నం ప్రాంతానికి చెందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం అల్లూరిని చెట్టుకు కట్టేసి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపినప్పుడు ఆయన నోటి నుండి వచ్చిన చివరి మాట 'వందేమాతరం' అని గుర్తుచేశారు. ఈ విప్లవ వీరుని త్యాగానికి గౌరవంగా ఇటీవల ప్రధాని మోడీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అల్లూరి సీతారామరాజుకు శిరస్సు వంచి ప్రణామాలు అర్పించారని కొనియాడారు. 'వందేమాతరం'లో మిగిలిన రెండు చరణాలకు సముచిత స్థానం కల్పించి, గౌరవాన్ని పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

# అప్పలరాజును పరామర్శించడానికి జైలుకెళ్లి సమాజానికి ఏం సందేశమిస్తారు?

## ● జగన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపాటు

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సిఎం జగన్ సిదిరి అప్పలరాజు పరామర్శించడానికి జైలుకు వెళ్ళడం ద్వారా సామాజానికి ఏమీ సందేశం ఇస్తారని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఒక గొర్రెల కాపరిని దారుణంగా ప్రమాదం చేసి చంపిన సిదిరి అప్పలరాజు కుమారుడిని రక్షించడానికి దుర్మార్గంగాసాక్ష్యాలు మార్చారన్నారు. సిసి కెమెరా ఫుటేజీ ఈ వాస్తవాన్ని వెల్లడిచేసిందన్నారు. అటువంటి అరాచక ఆలోచనా విధానం ఉన్న వ్యక్తిని జగన్ పరామర్శించమేమిటని ప్రశ్నించారు. వ్యవస్థలు నిర్మాణం చేసేవాళ్లు, చట్టాలను గౌరవిస్తూ న్యాయనికి లోబడి నడుచుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ నేతలకు చట్టాలంటే గౌరవం లేదని సిఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. వ్యవస్థలు నిర్మాణం చేద్దామనే సంకల్పంతో ఎవరైనా రాజకీయాల్లోకి వస్తారని, కానీ గొడ్డలి పార్టీ నేతలు అందుకు భిన్నమని సిఎం అభిప్రాయపడ్డారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న నేతలతో సిఎం సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ క్రమంలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్సీ అధినేత తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సిసిటివి ఆధారాలు అన్నీ బయటపెట్టే సరికి తోకముడిచారని వ్యాఖ్యానించారు. నేరప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి ఎదుటివారిపై రుద్దాలని చూస్తారన్న చంద్రబాబు, ఆలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారని ఆరోపించారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్థుల్ని పరామర్శించటమే పనిగా గొడ్డలి పార్టీ ఉందని సిఎం చంద్రబాబు దుయ్యబట్టారు.

# మాజీ ప్రధాని దేవెగౌడకు సిఎం పరామర్శ

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ సతీమణి చెన్నమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయన్ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోనులో పరామర్శించారు. చెన్నమ్మ మృతి పట్ల సిఎం సంతాపం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. చెన్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకుని మనోధైర్యంతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా దేవెగౌడ సహా ఆయన కుటుంబంతో మూడు దశాబ్దాలుగా తనకున్న అనుబంధాన్ని సిఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

# పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు ఆమోదం.. డి.సిఎం పవన్ హర్షం

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026 ఆమోదం పొందిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ చరిత్రాత్మక చట్టం లక్షలాది మంది విద్యార్థుల కలలు, ఆకాంక్షలను పరిరక్షి ంచడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే దేశ పరీక్షా వ్యవస్థ సమగ్రతపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇది ముఖ్యమైన ముందడుగు అని అభిప్రా యపడ్డారు. పరీక్షా వ్యవస్థలో దీర్ఘకాలిక సంస్కరణల అవసరాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీతో పాటు దేశ పరీక్షా వ్యవస్థలో సమగ్ర మార్పులకు శ్రీకారం చుట్టిందని పవన్ కల్యాణ్ తెలిపారు. విద్యార్థుల కలలను కాపాడటం, విద్యాసంస్థల విశ్వసనీయతను నిలబెట్టడం, ప్రతిభ, నిజాయతీ, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇచ్చే వ్యవస్థను నిర్మించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భారత భవిష్యత్తును అరాచక శక్తులు కాదు, పట్టుదల, క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో జ్ఞానాన్ని అన్వేషించే యువ మేధావులే తీర్చిదిద్దుతారని, వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి విద్యార్థికి సాధికారత

# తాటిపూడి ఎపిఆర్‌జెసి కళాశాలలో 51 మంది విద్యార్థులకు అస్వస్థత

**విజయనగరం, జులై 29 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా గంట్యాడ మండలం తాటిపూడి ఏపీఆర్జేసీ బాలికల కళాశాలలో 51 మంది విద్యార్థులకు అస్వస్థత. బుధవారం ఐదుగురు విద్యార్థులకు ఒళ్ళు నొప్పులు ఫీవర్ కళ్ళు మంటలు రావడంతో వెంటనే వారికి వైద్య పరీక్షలు నిర్వహించమని కళాశాల ప్రిన్సిపాల్ శారదాంబ తెలియజేశారు. అనంతరం ఆ సంఖ్య 51 చేరడంతో కళాశాలలో ఏరియా ఆసుపత్రి డాక్టర్లు వైద్య శిబిరం ఏర్పాటుచేసి వైద్యం నిర్వహిస్తున్నారు. ఏడుగురు విద్యార్థులకు తీవ్రంగా ఉండడంతో వారిని ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం నిర్వహిస్తున్నారు వారికి ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. వీళ్ళందరికీ ఒళ్ళు నొప్పులు ఫీవర్ కళ్ళు మంటలు రావడంతో తోటి విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. ఏం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శాకంబరి ఉత్సవాలకు వేదోక్తంగా మహాపూర్ణాహుతి



**ఇంద్రకీలాద్రి, జులై 29 ప్రభాతవార్త:** శాకంబరి మాతగా అనుగ్రహించిన దుర్గమ్మ ఆలయంలో బుధవారం పూర్ణాహుతి నిర్వహించారు. చండీసప్తశతీ పారాయణం, మహావిద్యా పారాయణం, హోమం, శాంతి పౌష్టిక హోమములు, మండపపూజ, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనము, ప్రసాద వితరణము జరిపారు. సకలలోకాలను పాలించే ఆదిదంపతులు అధిరోహించిన రథంతో భక్తులు వెంటనడుస్తుండగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణం వైభవంగా జరిగింది. సంప్రదాయ తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళాబృందాల కళా ప్రదర్శనలు, మంగళ వాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణలో భక్తులకు కుంకుమ, ప్రసాదం అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పరిశ్రమల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.CCEP-11021/12/2026-DD-COCEP తేదీ: 28.07.2026
15.08.2026 తేదీన విజయవాడ/అమరావతిలో జరుగు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పరిశ్రమల శాఖ శకటం రూపకల్పన మరియు అభివృద్ధి చేయడం/ఏర్పాటు చేయడం గురించి బిడ్డర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ దాఖలు చివరి తేదీ: 05.08.2026 ఉ.10.40గం.ల వరకు. ఇతర వివరాలను https://tender.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్: 7893752255.
సం/-. సంయుక్త సంచాలకులు (వాణిజ్య మరియు ఎగుమతుల అభివృద్ధి).
DIPR.NO. 21056/CL/ADVT/1/1/2022-23 తేదీ: 29.07.2026

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.టి.ఓ/16 నుండి 17/2026-27 తేది: 24.07.2026
గ్రా.నీ.స & పారిశుధ్య విభాగము, నరసరావుపేట, పల్నాడు జిల్లా పరిధిలోని డి.ఎం.ఎఫ్ గ్రాంట్ నందు మంజూరైన 1 పనికి మరియు యజ్.బి.యం(జి) గ్రాంట్ క్రింద మంజూరైన 1 పనికి అంచనా విలువ : రూ.25.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు తేది: 01.08.2026 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య విభాగము, నరసరావుపేట.
DIPR.NO. 21048/CL/ADVT/1/1/2022-23 తేదీ: 29.07.2026

30-7pg4_30-7pg4.qxd 29/Jul/26 10:28 PM Page 1






వార్త

నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో,
విజయం అంత అధికంగా లభిస్తుంది.

- న- రోజర్

# ఉపాధి ఊరట ఎంతదాకా?

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ఏమాత్రం లొంగిరాని ఎల్‌నినో దెబ్బకు వ్యవసాయ కూలీలకు పనిలేకుండా పోయింది. దాంతో కూలీలు 'జి రాంజీ' ఉపాధి పనులపై దృష్టి పెట్టక తప్పడం లేదు. 'ఎల్‌నినో'తో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల గందరగోళంలో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. రెండుమూడు రోజుల పాటు వర్షాలు కురిసినా 'వరి' సాగు సజావుగా సాగుతుందన్న నమ్మకం లేదు. ఈ నేపథ్యంలోనే 'వరి' సాగుకు ప్రత్యామ్నాయంగా వేర్వేరు పంటలసాగు లాభసాటియని ఊదరగొడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ముమ్మర ప్రచారం చేపట్టారు. వారి సూచనలకు బాసటగాభారతీయ వాతావరణ సంస్థ కూడా రైతాంగానికి హెచ్చరికలు జారీ చేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమేఆలంబన. కానీ సాగు సాగాలంటే వర్షపాతం బాగా తక్కువగా ఉన్నందున మరో చుక్క వర్షం ఎప్పుడు పడుతుందో ఎలా పడుతుందో అర్థంకాని పరిస్థితులలో వ్యవసాయం మీద 'రిస్క్' చేసి పెట్టుబడి పెట్టేందుకు రైతాంగం జంకుతోంది. వ్యవసాయ కూలీలుగా అలవాటుపడిన వారు కూలిపనిగ్యారంటీ లేక పొలం పనులకు వెళ్లడం తగ్గించారు. స్థానికంగా అమలవుతున్న విబి జీ రాం జీ పనులపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో కూలీకి వంద రోజుల నుంచి 125 పనిదినాలకు పెంపు ఉపాధి లభిస్తుంది. వ్యవసాయ పనులు సీజన్‌ల వారీగానే ఉన్నా అనిశ్చితి సమయంలో ఆ పనుల మీద దృష్టి పెట్టి వేరే ప్రభుత్వ పథకాలను వదులుకుంటే ఆ మాత్రం ఉపాధి కూడా దొరకదనే ఆలోచనలతో వ్యవసాయ పనులనే వదులుకుంటున్నారు. సాగు పనులకు అత్యంత కీలకంగా భావించే జులై నెల మరో 2,3 రోజుల్లో ముగియనుంది. తెలంగాణలో గత 2రోజుల్నుంచే వర్షం కురుస్తోంది. మరో పదిరోజుల పాటు కురుస్తుందన్న గ్యారంటీ లేదు. కాగా మంగళవారం ఒక్క రోజే ఈ రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 10వేల 592 మంది కూలీలు ఉపాధి కోసం జీ రాంజీ పథకాన్ని ఆశ్రయించారు. దాదాపు తెలంగాణలోని ప్రతి జిల్లా నుంచి లక్షమంది వ్యవసాయకూలీలు ఉపాధి కూలీలుగా మారారు. నల్గొండ జిల్లాలో మాత్రం 1 లక్షా 72వేల 402మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. వీరందరిలో ఎవరికీ వ్యవసాయ పనుల ఒత్తిడి కూడాలేదు. గత యేడాది వానాకాలం సీజన్‌లో నెలకు 5 లక్షల నుంచి 8లక్షల మంది వ్యవసాయ పనుల్లోనే జీవనోపాధి పొందే వారు. గతంలో ఉపాధి పనులకు ఎంతో రద్దీ ఉండేది. గత అనుభవాల దృష్ట్యా వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు వెళ్లిపోవడంతో రైతులంతా వ్యవసాయ యంత్ర పరికరాల ద్వారా వ్యవసాయ కార్యాచరణ చేపట్టేవారు. కూలీల అవసరం తగ్గింది. ఏడాదిలో అధిక కాలం పొలం పనుల ద్వారా జీవనోపాధి కల్పించుకునే వారు సైతం ఇప్పుడు రోడ్ మీద పడ్డారు. అప్పట్లో వ్యవసాయ కూలీలు ఉపాధి కూలీ పనులకు మొగ్గుచూపేరు. కొంతకాలం వ్యవసాయదారుల కూలీల మధ్య సంబంధాలు కూడా మారిపోయాయి. ప్రభుత్వ ఉపాధి పథకాలలో నిర్దిష్ట వేతనం, నిర్ణీత పనివేళలో, కొంతవరకు పనిలో భౌతిక ఒత్తిడి తక్కువగా ఉండటం వల్ల కూలీలు ఉపాధి కూలి పనులకే వెళ్లేవారు. వ్యవసాయ పనులే మర్చిపోయి ఉంటారులే, అని అనిపించేది. ఉపాధి హామీ కూలీల పథకం వచ్చాక రైతు కాస్త కుదేలయ్యాడు. మానవ వనరులు సకాలంలో దొరికేవి కాదు. ఈసారి పరిస్థితులు చక్కబడినవనుకుంటే మళ్లీ సమస్యలు నెత్తిన కూర్చొన్నాయి. సాగు పనిలేని రోజుల్లో కుటుంబ పోషణ కోసం ప్రత్యామ్నాయ ఉపాధి అవసరం. గతంలో ఎంజిఎన్‌రెగా పథకంగా ఉన్న ఈపథకాన్ని తాజాగా విబి జీ రాం జీ పథకంగా మార్చి కొన్ని మార్పులు చేశారు. పంటల సీజన్‌లో రైతులకు అవసరమైన కూలీలు అందుబాటులో ఉంటే మంచిది. వ్యవసాయేతర కాలంలో ఉపాధి పనులను సమన్వయంగా చేసుకుంటే రైతు కూలీలకు నిరంతర ఉపాధి దొరుకుతుంది. ఇప్పుడు వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి కూలీలకు వెళ్లిపోతున్నారు. పల్లెల్లో పనిలేక కొందరు కూలీలు బెంగళూరు, చెన్నై,వంటి ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్లిపోతున్నారు.ఇలా కూలి పనుల తీరు మారడం కొన్ని రోజులు మాత్రమే ఉపాధి లభించడంతో పిల్లల చదువుల మీద దెబ్బతగులుతుంది. గ్రామీణ సమాజంలో సామాజిక ఆర్థికమార్పు కనపడుతున్న రోజుల్లో 'ఎల్‌నినో' ప్రభావం ఎన్నో జీవితాల్లో స్థిరత్వాన్ని మాయం చేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రేపెపుడో కరువు పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ఉన్నఊళ్లోనే చేతికందిన ఉపాధిని దక్కించుకోవడం వారికి తప్పనిసరి అయింది. ఒకవేళ పంటలు విఫలమైతే ఆదాయం ఉండదని చిన్నకారు, సన్నకారు రైతుల్లో కొందరు కూడా ఉపాధికోసం వెతుక్కోవడమే ఉపాధి వలసలకు కారణం. చెరువుల పూడికతీత,రహదారులనిర్మాణం, భవనాలు, నివాస గృహాల నిర్మాణంలో కూలీల నైపుణ్యాన్ని, మరోమార్గంలోకి మళ్లించాల్సి వస్తోంది. గ్రామీణాభివృద్ధికి వారి కృషి ఉపయోగపడుతుంది. కాగా మరోపక్క 'ఎల్‌నినో' ప్రభావం పంటలు పండకపోవడం, లేదా నాట్లు కుళ్లిపోవడం,చివరి ఎకరానికి నీళ్ల దొరక్కపోవడం పంటలు ఎండిపోవడం వంటి చర్యలవల్లన ఆహార భద్రతకే లోపమేర్పడ్తోంది.ఇప్పుడు ముంచుకొస్తున్న ఎల్‌నినో కానీ, సూపర్ ఎల్‌నినో పరిస్థితులు కానీ గ్రామీణ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేస్తున్న తరుణంలో వ్యవసాయ కూలీలకు ప్రత్యామ్నాయం జీ రాంజీ ఉపాధి లభించినా, మరెంతో మంది ఉపాధికి కటకటలాడే పరిస్థితులు దాపురించబోతున్నాయి. వాటి ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు ముందుకొచ్చి 'క్లైమేట్ స్మార్ట్ ఉపాధి'కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. లేకుంటే లక్షలాది మంది కూలీలు దుర్భర దారిద్ర్యంలోకి వెళ్లిపోయే పరిస్థితులను అంచనా వేసుకోవాలి. 'ఎల్‌నినో' పరోక్షంగా ఎంత మంది జీవితాలను అతలాకుతలం చేస్తుందో, వారినెలా ఆదుకోవాలో ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం అవసరం.



సంబంధి కాకపోయినప్పటికీ ఎవరు మిత్రభావంతో మసలుతున్నాడో అతడే బంధువు, అతడే మిత్రుడు, అతడే గతి, అతడే ఆశ్రయం.

- గోల్డ్‌స్మిత్



సమస్యను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

- స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### న్యాయమూర్తులు ఇలా ఉండాలి

సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ గారు మొన్న మంచి స్టేట్మెంట్ ఇచ్చారు. గంగానది మీద మాంసాహారం తినడం నేరమని, అపవిత్రం అని ఏ రాజ్యాంగంలో ఉందో చెప్పమని సూటిగా ప్రశ్నించాడు. అలాగే రిటైర్ అయిన న్యాయమూర్తులు రాజకీయాలలో ప్రవేశించడం, రాజకీయ పరమైన పోస్టులు తీసుకోవటం కూడా రాజ్యాంగ వ్యతిరేకం అని స్పష్టంగా చెప్పాడు. ఎందుకంటే ఈమధ్య కొన్ని కేసులలో కేంద్రప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు చెప్పినవారికి గవర్నర్ పోస్టులు, ఇతర రాజకీయ పరమైన పోస్టులు వచ్చాయని ( రాజ్యసభ సభ్యులుగా) ప్రజలు భావిస్తున్నారు. న్యాయ వ్యవస్థ మీద ఎలాంటి ప్రలోభాలు ఒత్తిళ్లు ఉండకూడదు. ఉన్నట్లయితే న్యాయం సరిగా జరగదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

నేటి సమాజంలో ఆహార కల్తీ ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. కొందరువ్యాపారులు అధిక లాభాల కోసం తక్కువ ధరకు లభించే నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇలాంటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్రజలు అనేకరకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలునిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొందరు వ్యాపారులలో మాత్రంమార్పు కనిపించడంలేదు. ప్రతిఒక్కవ్యాపారి నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి స్వచ్ఛమైన ఆహారాన్ని అందించడం తన బాధ్యతగా గుర్తించాలి. అలాగే ప్రజలు కూడా ఆహారపదార్థాలను కొనుగోలుచేసే సమయంలో నాణ్యత, పరిశుభ్రతపై శ్రద్ధవహించాలి. ప్రజల అప్రమత్తత,వ్యాపారుల బాధ్యత,అధికారుల నిరంతరపర్యవేక్షణతోనే ఆహార కల్తీనిఅరికట్టిఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### హక్కులను ఉపయోగించుకోవాలి

మానవ జీవితంలో రాజ్యాంగం కల్పించిన ప్రతి హక్కులను అవసరమైన చోట పూర్తిగా వినియోగించుకోవాలి. ఎక్కడ ఎవరికి కూడా భయపడాల్సిన అవసరం లేదు. నీ హక్కులను పూర్తిగా వినియోగించుకున్నపుడే సాధికారితతో కూడిన జీవితం గడపవచ్చు. మన హక్కులను కాల రాయకుండా వినియోగించుకుందాం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### దుస్తుల కాలుష్యం

మనదేశంలో అనేక రకాల కాలుష్యాలతో పాటు మనం ధరించే దుస్తుల వల్ల కూడా చెత్త ప్రోగు అవటమే కాకుండా ప్రకృతికి కూడా విపరీతమైన నష్టం జరుగుతోంది. దీనికంతకూ కారణం మనం ధరించే దుస్తుల్లో అధిక శాతం ప్లాస్టిక్‌తో తయారయ్యే పాలియిస్టర్ దుస్తులు. ఇదేకాక ఫ్యాషన్ పేరుతో పార్టీలకనీ, టూర్లకు అనీ అవసరం లేకపోయినా దుస్తులు ఇబ్బడి ముబ్బడిగా కొనుగోలుచేయటం. పూర్వం మనదేశంలో పత్తి నూలుతో తయారయ్యే దుస్తులే ఉండేవి. సాంకేతికత పేరుతో పత్తి నూలుతోపాటు పాలియిస్టర్ నూలు మిళితమైన దుస్తులు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయి. పత్తి నూలుతో తయారయ్యే దుస్తులు సులభంగా భూమిలో కలిసిపోతాయి. కొందరైతే దుస్తులు ఒకటి రెండు సార్లు వేసుకుని మూలన పడేస్తున్నారు. వాడేసిన దుస్తులు చెత్తకుప్పలకు చేరుతున్నాయి. పాలియిస్టర్‌దారం మిళిత దుస్తులు భూమిలో కలిసిపోక కాలుష్యకారకం అవుతున్నాయి. ఈకాలుష్యం పెరగకుండా ఉండాలంటే అవసరమైన మేరకే దుస్తులుకొనుగోలు చేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### వెంటనే స్పందించాలి

వైద్యవిద్యార్థులకు భారతదేశవ్యాప్తంగా ఉమ్మడిగా నిర్వహించే 'నీట్' పరీక్ష లీక్ కావడం ఎంతో చర్చనీయాంశం అయింది. మొదటగా నీట్ పరీక్ష నిర్వహించి లీక్ అయిన విషయం తెలిసినాక ఆ పరీక్షరద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించి ఫలితాలు వచ్చిన తర్వాత మళ్లీ లీక్ అయిందని విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులుప్రధాని ఇంటి వద్దనిరసన,ముట్టడి తెలిపినందుకు పోలీసుల ద్వారా గాయాలు అయ్యేదాకా ప్రధాని నోటి మాట రాలేందంటే స్పందన లేదంటే ప్రజాస్వామ్యస్ఫూర్తి ఎటుపోతుందో అర్థంకావడం లేదు. ఇప్పటికైనా ప్రధాని ప్రజాస్వామ్యస్ఫూర్తిని నిలబెట్టి రక్షించాలి.

- బెజుగాం నరేష్, సిద్దిపేట జిల్లా

### షీ టీమ్ తరహాలో వికలాంగుల టీం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం, వారిని వేధింపుల కోసం రక్షి ంచడం కోసం షీటీం ఏర్పాటు చేయడం సంతోషకరం. అదేతరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విక లాంగులకు కూడా రక్షణకల్పించాలి. వారిపై హేళనలు. ఈస డింపులు,దాడులు,దౌర్జన్యాలు,దూషణలు, సూటిపోటీ మాట లు, వైకల్యాలను సూచిస్తూ హేళన చేయడం సమాజంలో జరుగుతుంది వికలాంగుల రక్షణ కోసం రక్షణ కవచంగా కొన్ని టీములు ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి — ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఆశ నిరాశల మధ్య ఆదివాసీల ఊగిసలాట!

**ఆదివాసిల సంక్షేమం అంటే కేవలం పింఛన్లు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షి ంచడం, ఉపాధి అవకాశాలను కాపాడడం, భూమిని రక్షి ంచ డం, వారి సంస్కృతిని గౌరవించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పలుమార్లు ప్రకటించింది. అదే స్ఫూర్తితో ఆదివాసీల న్యాయమైన ఆందోళనలను కూడా సానుకూలంగా పరిశీలించి, వారి హక్కులు, అవకాశాలు, భవిష్యత్తు దెబ్బతినకుండా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సమాజం ఆశిస్తోంది. ఆదివాసీలు కోరేది ప్రత్యేక హక్కులు కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ మాత్రమే. అభివృద్ధి పేరిట హక్కులు కోల్పోకుండా, హక్కుల పరిరక్షణతోపాటు అభివృద్ధి కూడా అందేలా ప్రభుత్వం ముందుకు సాగితేనే ఆదివాసి సమాజానికి నిజమైన సామాజిక న్యాయం అందించినట్లవుతుంది.**



ఎస్. సీతారామయ్య

భారత రాజ్యాంగం దేశంలోని బలహీన వర్గాలకు సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక రక్షణలను కల్పించింది. ఆ రక్షణల్లో ముఖ్యమైనవి ఆదివాసీల హక్కులు అడవిని, భూమిని, ప్రకృతి వనరులను నమ్ముకుని జీవించే ఆదివాసీల జీవన విధానాన్ని, సంస్కృతిని, ఉపాధిని కాపాడేందుకు అనేక ప్రత్యేకచట్టాలు, విధానాలు అమలులోకి వచ్చాయి. అయితే నేడు చట్టం కల్పించిన హక్కులకు భంగం వాటిలే పరిస్థితి ఏర్పడుతోంది. న్యాయపరంగా ఏర్పడిన కొన్ని అంశాలు ఆధారంగా గిరిజనేతరులు వ్యవహరిస్తున్న తీరు ఆదివాసి సమాజం తీవ్ర అన్యాయానికి గురవుతోంది. ఆదివాసీలు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి పోరుబాట పట్టవలసిన దుస్థితి ఏర్పడింది. ఆదివాసి ప్రాంతాలను పాలన కోసం ప్రత్యేకంగా రాజ్యాంగం 5వ షెడ్యూల్‌లో నియమాలు, నిబంధనలు పొందుపరిచారు. అందులో భాగంగా షెడ్యూల్డ్ ప్రాంత స్థానిక ఆదివాసి అభ్యర్థులతోనే ఉద్యోగాలు భర్తీ చేసేందుకు వీలుగా 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 3ను తీసుకొచ్చి ఉద్యోగ నియామకాల్లో 100శాతం ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ వచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ చెబ్రోలు లీలా ప్రసాద్ అనే వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించి దాఖలు చేసిన కేసులో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 2020లో జిఓ నెం.3రద్దు, చేసింది. దాంతో నిరుద్యోగ ఆదివాసీలకు జీవనోపాధితెలుగు రాష్ట్రాలలో ప్రశ్నార్థకంగా మారింది. సుప్రీంకోర్టు తన తీర్పులో రాజ్యాంగ మౌలిక సమాన హక్కులకు విరుద్ధంగా జీవో 3 ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, నూరు శాతంషెడ్యూల్డ్ ప్రాంత స్థానిక గిరిజన అభ్యర్థులతో పోస్టులు భర్తీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అందువల్ల చెల్లనేరవని అన్నది. అలాగే ఆర్టికల్ 309 కింద జారీ అయిన ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ నియామకాల నియమాలను సవరించే అధికారం ఐదవ షెడ్యూల్ పేరా 5(1)కింద గవర్నరుకు లేదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సాధారణ ఎన్నికలు 2024 ప్రచారంలో భాగంగా అరకు సభలో నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి కూటమి ప్రభుత్వం వస్తే మళ్ళీ ఆదివాసీలకు ఉద్యోగ నియామకాల్లో 100 శాతం ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 2సంవత్సరాలు పూర్తయినా అది అమలుకాలేదు. ఆదివాసి సమాజం దానికోసం ఎదురు చూస్తూ ఉంది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మీద నేటికీ కట్టుబడి ఉన్నారు. అయితే న్యాయపరంగా రాబోయే రోజుల్లో ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఆదివాసీలకున్యాయం చేయడం తన బాధ్యతగా ప్రతిసారి వ్యక్తపరుస్తూ అధికారులను ఆదేశిస్తున్నారు. కానీ కార్యరూపం దాల్చడం లేదు. దానికోసం ఆదివాసి సమాజం వేయికళ్లతోఎదురుచుస్తున్నది. అలాగే అటవీ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల పరిరక్షణ



కొరకు ప్రత్యేక చట్టాలను తెచ్చారు. అటువంటి చట్టమే షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70 ఇది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసి భూముల పరిరక్షణకు బలమైన కవచంగా నిలిచి ఉన్నది. నేడు చట్టాని నిర్వీర్యం చేయాలని గిరిజనేతరులు జిఓ నెం.3 మీద ఏవిధంగా అయితే సుప్రీంకోర్టుకి వెళ్లి రద్దు చేయించారో అదే విధంగా 1/70 యాక్ట్‌ని రద్దు చేయించాలని తెలంగాణకు చెందిన ఇతర పిటిషనర్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామాలు, మండల కేంద్రాలలో గిరిజనేతరులు అధిక సంఖ్యలో ఉన్నారని వాదిస్తున్నారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద గిరిజనేతరులకు భూములు కొనుగోలు చేయడానికి లేదా కౌలుకు తీసుకోవడానికి అవకాశం లేకుండాపోయిందని వారు పేర్కొంటూ సుప్రీం కోర్టు ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ చట్టం న్యాయ పరిశీలనను ఎదుర్కొంటోంది. దీనితో ఆదివాసి ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. సుప్రీంకోర్టు కనుక ఈ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం చేస్తే మా భవిష్యత్ ఏమిటి అని తీవ్ర ఆందోళనలకు దిగుతున్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాను కొత్తగా ఏర్పడిన జోనల్‌లో ఎప్పటి నుండో జోన్ 1లో ఉంది. దానిని తీసుకోనివెళ్లి జోన్ 2లో కలిపారు. దీనివల్ల విద్య, ఉపాధి అవకాశాలలో మరింత వెనుకబడిపోతాం అని ఆదివాసిలో ఆందోళన గురవుతున్నారు. ఈ విధంగా ఆదివాసి సమాజంలో అశాంతి ఏర్పడి కొన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి నేడు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. ఆదివాసీలు ప్రస్తుతం ఆదివాసీలు కోరుకునేది జి.ఓ నెం.3 బదులుగా రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి 'షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం' రూపొందించాలని లేక 5వ షెడ్యూల్ క్లాస్2 ప్రకారం ఆదివాసీ ప్రాంతంలో 100శాతం రిజర్వేషన్‌తో ప్రత్యేకఆర్డినెన్స్ ఇచ్చి రాష్ట్రపతి ద్వారా ఆమోదం పొందేలా చేయాలని ఆదివాసీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70చట్టం రద్దు కోరుతూ సుప్రీం కోర్టులో ఉన్న కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుచేసి చట్టపరిరక్షణ బాధ్యతను స్వీకరించాలని,అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్1లోనే కొనసాగింపు చేయాలని డిమాండ్‌చేస్తూ ఆందోళనలు తీవ్రతరం చేస్తున్నారు. ఈ విషయాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్‌లోనే కొనసాగింపు చేసేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. జి.ఓనెం.3 బదులుగా ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి అన్ని మార్గాలను అన్వేషించి వారికి ఉద్యోగ నియామకాలలో పూర్తిన్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు మరోసారి ఆదేశించారు. దీనితో ఆదివాసిసమాజంలో ముఖ్యమంత్రిపై గౌరవం పెరిగింది అయితే కార్యరూపం కోసం ఆదివాసి సమాజం కూటమిప్రభుత్వంపై కోటిఆశలతో ఎదురుచూస్తోంది. ఆదివాసిల సంక్షేమం అంటే కేవలం పింఛన్లు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షి ంచడం, ఉపాధి అవకాశాలను కాపాడడం, భూమిని రక్షి ంచడం,వారి సంస్కృతిని గౌరవిం చడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పలుమార్లు ప్రకటించింది. అదేస్ఫూర్తితో ఆదివాసీల న్యాయమైన ఆందోళ నలను కూడా సానుకూలంగా పరిశీలించి, వారి హక్కులు, అవకాశాలు, భవిష్యత్తు దెబ్బతినకుండా చట్టబద్ధమైన చర్య లు తీసుకోవాలని గిరిజన సమాజం ఆశిస్తోంది. ఆదివాసీలు కోరేది ప్రత్యేక హక్కులుకాదు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ మాత్రమే. అభివృద్ధి పేరిట హక్కులు కోల్పోకుండా,హక్కుల పరిరక్షణతోపాటు అభివృద్ధి కూడా అందేలా ప్రభుత్వం ముందుకుసాగితేనే ఆదివాసి సమాజానికి నిజ

# యువశక్తి 'భద్రత'కు ప్రామాణికాలు పాటించాలి

జానకి

ఉక్కు నరాలు, ఇనుప కండరాల వజ్ర సంకల్ప మనస్సు గల ఓ వందమంది యువతను నాకివ్వండి. ఈ దేశ తలరాతను, స్వరూప స్వభావాల్నే మార్చేస్తాను' అని స్వామి వివేకానంద అంటారు. అంటే యువత తలచుకుంటే దేన్నైనా సాధించగలదనే నమ్మకంతో ఆయన చెప్పిన మాటలవి. ప్రపంచ జనాభాలో 30 ఏళ్ల వయసు కంటే తక్కువ గలవారు సగానికి పైగా ఉన్నారు. యువశక్తి అపారం. శక్తివంతమైన మానవ వనరు. అలాంటియువశక్తి నేడు నిర్వీర్యమైపోతున్నది. ఒకప్పుడు యువత అంటే 15-25 సంవత్సరాల వయస్సుగలవారు. కానీ నేడు 15-35 యేండ్ల వయస్సు గల వారిని యువతగా పేర్కొంటారు. ఎందుకంటే, ఒకప్పటిలా బాల్య వివాహాలు జరగడం లేదు కాబట్టి. ఇంకా మనిషి జీవన ప్రమాణ స్థాయి పెరిగింది కూడా. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. నేటి యువత మద్యపానం,ధూమపానం, గుట్కా,తంబాకు, గంజాయి, మాదకద్రవ్యాలు, మొదలగు దుర్వ్యసనాలకు బానిసలై శారీరక ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా స్మార్ట్‌ఫోన్ వినియోగించడంతో నిద్రలేమితో అనారోగ్యం పాలవుతున్నారు. ప్లాస్టిక్ కలసిన ప్యాకేజ్ ఫుడ్స్, వివిధ రసాయనాలు కలగలిపిన జంక్‌ఫుడ్స్ కి ఆకర్షితులై ఎక్కువగా తినడం వల్ల అనేక జబ్బులకు గురవుతున్నారు. ఈ తిండి కూడా వేళాపాళా ఉండటం లేదు. ఏ అర్ధరాత్రి వేళకో! రాత్రి తిండి తింటే ఆరోగ్యంగాఎలా ఉండగలదు? ఇంకా ఇంటి తిండి వదిలేసి, బయట తిండికై అర్రులు చాస్తున్నారు. ఏ పూటలో ఏ ఆహారం తీసుకోవాలి? అన్న ఇంగితం లేక, ఏది పడితే అది తినటం వల్ల అనారోగ్యాన్ని కోరి తెచ్చుకుంటున్నారు. ఇవేకాక పేదరికం వల్ల సరైన పోషకాహారం అందక కూడా యువతీ యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయడం వల్ల కూడా వారి పునరుత్పత్తి ఆరోగ్యానికి చేటు కలుగుతుంది. మరో ప్రధాన కారణం యువతలో శారీరక శ్రమ, నిర్దిష్ట వ్యాయామం లేకపోవడం. వీటన్నింటివల్ల చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, ఊపిరితిత్తుల, జీర్ణకోశ, కాలేయ, మూత్రాశయ, నరాల, సుఖ వ్యాధులకులోనై ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రతిరోజూ మందులు వేసుకుంటే గాని బ్రతకలేని పరిస్థితిని కొని తెచ్చుకుంటున్నారు. ఇంకా కేన్సర్, ఎయిడ్స్, హెపటైటిస్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడి అకాల మరణం పొందుతున్నారు. 'కండ కలవాడేను మనిషోయ్ అని మహాకవి గురజాడ అంటారు. నిజానికి కండ కలవాడంటే ఊబకాయం కలవాడు కాదు. ఎటువంటి క్రొవ్వు పేరుకుపోని కండ కలవాడని అర్థం. కానీ దీనికి విరుద్ధంగా నేడు యువత ఊబకాయంతో బాధపడుతున్నారు. వీటన్నింటికీ కారణం తినే పదార్థాలు, చేసే వ్యవహారాలు సరిగ్గా లేకపోవడమే. క్రమశిక్షణ లేని జీవితం మనిషిని పెడత్రోవకు నెడుతోంది. ఇది మనిషి శారీరక, మానసిక ఆరోగ్యం మీద కూడా ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఈపరిస్థితి నేటి యువతలో ఎక్కువ శాతం కనిపిస్తోంది. అలాగే చదువు కోసం, ఉపాధికోసం జరిగే వెతుకులాటలో యువతపై తీవ్ర ఒత్తిడిపడుతున్నది. వీరు ఈ ఒత్తిడిని సాధారణంగా తల్లిదండ్రుల నుంచి తోటి సమాజం నుంచి ఎదుర్కొంటున్నారు. దీనివల్ల వీరి మానసిక ఆరోగ్యం క్షీ ణిస్తున్నది. ఇంకా అతివేగంగా వాహనాలను నడిపి, తమ ప్రాణాలను పణంగా పెడుతున్నది. ఆడ్రైవింగ్ లోనూ రోడ్డు భద్రత నియమాలు పాటించక ప్రమాదాలు కొనితెచ్చుకొని, చివరికి అంగవైకల్యంతోబాధపడుతున్నారు. ఈపరిస్థితి దేనికి సంకేతం? ఇది ఎటు దారితీస్తుంది? అనా రోగ్యంతో నీరసించిన యువలోకం దేశాభివృద్ధికి ఏవిధంగా తోడ్పడుతుంది? ఈవిషయమై ప్రభుత్వాలే ప్రధానబాధ్యత వహించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ యువత ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందువల్ల ఈసంస్థ సూచించే ఆరోగ్య ప్రామాణికాలను ప్రజలకు ఎరుకపరచాలి. ఇవన్నీ దేశంలో పెరుగుతున్న అంటువ్యా ధులు, ప్రమాదాలు,

# పర్యావరణ పరిరక్షణకై 'చెత్త'పై పోరాటం

పాపని నాగరాజు

మహారాష్ట్రలోని మోషి వేస్ట్‌టు ఎనర్జీ ప్రాజెక్టు వద్ద భారీ వర్షాలకు ఏళ్ల తరబడి పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల కొండ విరిగిపడి పరిపాలనా భవనాన్ని సజీవ సమాధిచేసిన ఘటన దేశాన్ని కుదిపేసింది. ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. పలువురు గాయపడ్డారు. కానీ ఈ దుర్ఘటనను కేవలం ప్రకృతి వైపరీత్యంగా చూడడం వాస్తవాన్ని కప్పిపుచ్చడమే అవుతుంది. ప్రకృతి చెత్త కొండలను నిర్మించదు. పాలనా నిర్లక్ష ్యం, కార్పొరేట్ లాభాల రాజకీయాలు, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను నిర్లక్ష ్యం చేసిన ప్రభుత్వాలే వాటిని నిర్మిస్తాయి. మోషిలో కూలింది చెత్త కొండ కాదు, ప్రజల భద్రత కంటే లాభాలను ముందుపెట్టిన పట్టణ అభివృద్ధి నమూనా. ఈ హెచ్చరిక మహారాష్ట్రకే పరిమితం కాదు. హైదరాబాద్‌కు ఇది మరింత దగ్గరగా వినిపించాలి. ఎందుకంటే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ సుమారు 8,000 టన్నుల మున్సిపల్ ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని జీహెచ్‌ఎంసీ స్వయంగా అంగీకరించింది. అంతేకాదు,ఈవ్యర్థాలను ప్రధా నంగా జవహర్‌నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ కేంద్రం పైనే ఆధారపడి నిర్వహించడం ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016కు అనుగుణం కాదని కూడా అధికారికంగా పేర్కొంది. అంటే ప్రమాదం గురించి ప్రజలకు మాత్రమే కాదు, ప్రభుత్వానికి కూడా తెలుసు. అయినప్పటికీ పరిస్థితి ఎందుకు మారడం లేదు? కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2016 స్పష్టంగా చెబుతున్నాయి. చెత్తను మూలం వద్దనే తడి-పొడి-ప్రమాదకర వ్యర్థాలుగా వేరు చేయాలి. నగరాలన్నీ వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. శాస్త్రీయ ల్యాండ్‌ఫిల్ చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండాలి. భారీ చెత్త కొండలను సృష్టించడం ఈ నియమాల ఆత్మకు విరుద్ధం. అయినప్పటికీ హైదరాబాద్‌లో నగరమంతా ఉత్పత్తి చేసే వ్యర్థాలను జవహర్‌నగర్‌కు తరలించే కేంద్రీకృత నమూనా కొనసాగుతూనే ఉంది. ఇదే మోషి వంటి ప్రమాదాలకు పునాది. జవహర్ నగర్ కథ కొత్తది కాదు. ఒకప్పుడు మన్సూరాబాద్‌లో ప్రజలు చెత్త కాలుష్యాన్ని అనుభవించారు. తర్వాత సమస్యను అక్కడి నుంచి తరలించి జవహర్‌నగర్‌కు చేర్చారు. నగరం పెరిగే కొద్దీ ఆటోనగర్, సనత్‌నగర్, ఇమ్లీబన్ వంటి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు ఏర్పడ్డాయి. కానీ మూల సమస్యమాత్రం అలాగే ఉంది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి తెలంగాణ నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. ఒక ప్రదేశం నిండిపోతే మరో ప్రదేశం వెతకడం తప్ప, చెత్త ఉత్పత్తి విధానాన్ని, నిర్వహణ నమూనాను మార్చే ప్రయత్నం కనిపించడం లేదు. ఇక్కడే 'చెత్త రాజకీయం' ప్రారంభమవుతుంది. ప్రతి ఎన్నికల సమయంలో జవహర్‌నగర్ ప్రజలకు హామీలు ఇవ్వని రాజకీయ పార్టీఉండదు. డంపింగ్ యార్డు తరలిస్తామని, కాలుష్యాన్ని నివారిస్తామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామని చెబు



తారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే మౌనం. ఎందుకు? దీనికి సమాధానం కేవలం రాజకీయాల్లో కాదు, రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఉంది. ఒకప్పుడు మున్సిపల్ పారిశుద్ధ్య పనిగా ఉన్న వ్యర్థాల నిర్వహణ ఇప్పుడు వేల కోట్ల రూపాయల ఆర్థిక రంగంగా మారింది. చెత్త సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, లీచేట్ శుద్ధి, ల్యాండ్‌ఫిల్ నిర్వహణ, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ప్రతిదశలో భారీ కాంట్రాక్టులున్నాయి. జవహర్‌నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులో రామ్కీ ఎన్విరో ఇంజనీర్స్ (ప్రస్తుతం రీ సస్టైనబిలిటీ గ్రూప్‌లో భాగం) దీర్ఘకాలంగా భాగస్వామిగా ఉంది. జీహెచ్‌ఎంసి రాంకీ భాగస్వామ్యం 2009లో కుదిరిన కన్సెషన్ ఒప్పందం కింద అమలవుతోందని ప్రభుత్వ పత్రాలే చెబుతున్నాయి. ఇక్కడ ఒక ప్రశ్న వేయడం ప్రజాస్వామ్య హక్కు. వేల కోట్ల ప్రజాధనం, దశాబ్దాల ఒప్పందాలు, కార్పొరేట్ భాగస్వామ్యాలు ఉన్న ఈరంగంలో ప్రజారోగ్యం, పర్యావరణ భద్రతకు ప్రాధాన్యం దక్కుతోందా? లేక కాంట్రాక్టుల నిరంతరత్వానికా? ఈ ప్రశ్నను మరింత తీవ్రతరం చేసింది కాగ్ నివేదిక. ప్రాసెస్ చేయని వ్యర్థాలకు కూడా భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయని, పర్యవేక్షణలో తీవ్రమైన లోపాలున్నాయని, నియంత్రణ వ్యవస్థ బలహీనంగా ఉందని అది పేర్కొంది. అంతటితో ఆగలేదు. జవహర్‌నగర్‌లో తాజా వ్యర్థాల డంపింగ్‌పై ఎన్‌జిటి ఇచ్చిన ఆదేశాల అమలులో లోపాలపై జిహెచ్‌ఎంసి, రాంకీ రెండింటినీ సంయుక్తంగా బాధ్యులుగా పేర్కొంటూ జరిమానా కూడా విధించింది. ఇది కేవలం పరిపాలనా లోపం కాదని, బాధ్యత ప్రశ్నను తప్పించలేమని సూచించే పరిణామం. ఇక్కడితో సమస్య ముగియదు. ఈమొత్తం వ్యవస్థను పర్యవేక్షి ంచాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పాత్ర మరింత ఆం దోళన కలిగిస్తోంది. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు2016 అమలును నిర్ధారించడం స్థానిక సంస్థలతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి టిజిపిసిబిబాధ్యత కూడా. లీచేట్ శుద్ధి, భూగర్భ జలాల నాణ్యత, ల్యాండ్‌ఫిల్ గ్యాస్ నియంత్రణ, గాలి కాలుష్య ప్రమాణాలు, పర్యావరణ అనుమతుల అమలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ జరగాలి. కానీ జవహర్‌నగర్ చుట్టుపక్కల ప్రజలు ఏళ్లుగా దుర్వాసన, కలుషిత నీరు, పొగ,ఈగలు, దోమలు, ఆరోగ్య సమస్యలపై ఆందోళనలు వ్యక్తంచేస్తున్నప్పటికీ,వాటికి తగిన స్థాయిలో శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. చెత్తలోని రసాయనాలు, లోహాలు, విషపదార్థాలు కలిసిన ఈ కలుషిత ద్రవం వర్షాల సమయంలో భూమిలోకి ఇంకితే భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. పర్యావరణ నిపుణులు సంవత్సరాలుగా ఇదే హెచ్చరిక చేస్తున్నారు. పైకి కనిపించేది చెత్త కొండ మాత్రమే. కానీ కింద నిశ్శబ్దంగా కలుషితమవుతున్నది నేల, నీరు, చివరకు ప్రజల ఆరోగ్యం. ఈ కాలుష్యానికి అత్యధిక మూల్యం చెల్లిస్తున్న వారు ఎవరు? నగర సంపదను నిర్మించే శ్రమజీవులే. డంపింగ్ యార్డులు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు ఎక్కు వగా దళితులు, బీసీలు, గిరిజనులు, ముస్లింలు, వలస కార్మికులు, అసంఘటిత రంగ శ్రామికులు నివసించే ప్రాం తాలకే చేరువలో ఉన్నాయి. అదే నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలనే ఆలోచనే ఎందుకు రాదు? వ్యాధులు, చర్మసమస్యలు, కలుషిత నీటి ప్రభావాలు అణగారిన వర్గాలకా? ఇదే నేటి చెత్త రాజకీయం. ఈ రాజకీయాన్ని మార్చకుండా డంపింగ్ యార్డులు మారినా, ప్రభుత్వాలు మారినా, ప్రమాదాలు మాత్రం మారవు. అందుకే చెత్తపై పోరాటం పారిశుద్ధం కోసం మాత్రమే కాదు, ప్రజల

30MN 5 PG-GNT_30MN 5 PG-GNT.qxd 30-07-2026 AM 12:02 Page 1



# ఉద్యమానికి మాజీ వీసి సంఘీభావం

## - కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల డిమాండ్‌లు సమ్మతమే

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై29, ప్రభాతవార్త: ఏఎన్‌యు వద్ద శాంతియుత నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు ఏఎన్‌యు మాజీ వీసి ఆచార్య పట్టేటి రాజశేఖర్ బుధవారం సంఘీభావం తెలిపారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు న్యాయమైన డిమాండ్‌ల సాధనకు 12 రోజులుగా నిరసన కార్యక్రమాలను వర్సిటీ వద్ద నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా




ఆయన మాట్లాడుతూ నేడు వర్సిటీలలో బోధన, పరిశోధనలు ఆటంకాలు లేకుండా జరుగుతున్నాయంటే దానికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల సేవలు ఎంతో కీలకంగా ఉన్నాయన్నారు. ఏఎన్‌యును పరిగణలోకి తీసుకుంటే వారు అనేక రకాలుగా విధులు నిర్వహించారని గుర్తుచేశారు. ముఖ్యంగా న్యాక్ గ్రేడు, ఎన్ఐఆర్ఎఫ్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఇండియా టుడే వంటి అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ర్యాంకులు ఇచ్చాయన్నారు. వారి న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్న రాష్ట్రంలోని ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు శాంతియుత ఆందోళన నిర్వహిస్తున్నారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి.. యూజిసి పే స్కేల్స్ అమలు చేయాలి..రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఓ ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని కోరుతున్నారు. బుధవారం డాక్టర్ పి.యుగంధర్ రెడ్డి, డాక్టర్ కె.ఎస్.రాజశేకర్, డాక్టర్ వై.సునీత, డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి, డాక్టర్ జి.గిరిధర్, పి.నరేంద్ర మోహన్‌లు దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి ఇతర అధ్యాపకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవలు క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు వర్సిటీలో నిరంతరం సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మా సేవలను గుర్తించాలని విన్నవించారు. అకడమిక్ ఆడిట్‌లు, పరిశోధనలు వంటి అనేక విద్యావిషయక సంబంధ విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వర్సిటీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించే ముందు రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని జీ.ఓ ఎంఎస్ నెం.114ను తక్షణమే అమలు చేయాలన్నారు. తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మాకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

# ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులకు చిత్రాలకు ప్రశంస

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై29, ప్రభాతవార్త: ఏఎన్‌యులోని ఫైన్‌ఆర్ట్స్ విభాగం విద్యార్థులకు ప్రత్యేక ప్రశంసలు లభించాయి. గ్లోబల్ టైగర్స్ డే (ప్రపంచ పులుల దినోత్సవం) సందర్భంగా ఏఎన్‌యులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యు విద్యార్థులు వివిధ రకాల ఆకృతుల్లో



పులుల చిత్రాలను గీశారు. వీరు గీసిన చిత్రాలకు కార్యక్రమంలో పాల్గొన్న వీసి ఆచార్య కె.గంగాధరరావు, ఎఫ్‌ట్రానిక్స్ సంస్థ అధినేత దాసరి రామకృష్ణ, ఇతర అధికారులు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో ఉత్తమ ఆర్టిస్టులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో విభాగం అధ్యాపకులు దేవకాంత్, జాన్‌రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజుకి ఘన సత్కారం

గుంటూరు విద్య, జూలై 29 ప్రభాతవార్త : గురు పౌర్ణమి సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు ని ఘనంగా సత్కరించుకోవడం జరిగింది. తదుపరి భారతీయ జనతా పార్టీ మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా చే ఏర్పాటు చేయబడిన నీట్ ఆందోళనలోని నిజ నిజాలపై యువతకు అవగాహన పోస్టర్ను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూపూడి రంగరాజు మాట్లాడుతూ కొంతమంది తమ స్వార్థ స్వప్రయోజనాల కోసం దేశం అభివృద్ధి బాటలో పయనించడం ఇష్టం లేక స్వార్థ రాజకీయాలతో నీట్ లీకేజ్ అనే ఉద్యమం పేరుతో విద్యార్థులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని, నిజంగా వీరికి విద్యార్థుల మీద ప్రేమే ఉంటే పంజాబ్ కేరళ మరియు కర్ణాటకలో జరిగిన పేపర్ లీకేజీలపై ఎందుకు మాట్లాడటం లేదని, అలాగే పేపర్ లీకేజ్ పై ఉద్యమం అంటూ దేశ వ్యతిరేక నినాదాలు, భారత జవానులకు వ్యతిరేకంగా నినాదాలు, హిందూ ధర్మాన్ని కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ విషయాల పైన నేటి యువత ఆలోచింప చేసేలా బిజెపి మూడో



మండల అధ్యక్షురాలు ఒక పోస్టర్ను రూపొందించారని ఆ పోస్టర్ను ఈరోజు విడుదల చేయడం జరిగిందని. అలాగే యువత ప్రతిదానికి తొందరపడకుండా నిజ నిజాలు తెలుసుకోవాలని, స్వార్థపరుల చేతుల్లో పావులుగా మారి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకురాలు జూపూడి హైమావతి, బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు , స్పైసెస్ బోర్డ్ జాతీయ డైరెక్టర్ కొత్తూరి వెంకట సుబ్బారావు , బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ , బిజెపి రాష్ట్ర లిటరేచర్ కమిటీ చైర్మన్ పాలపాటి రవికుమార్ , బిజెపి మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా , మహిళా మోర్చా జిల్లా కోశాధికారి డాక్టర్ స్రవంతి , మూడవ మండల ధార్మిక సెల్ కన్వీనర్ జంధ్యాల పవన్ కుమార్ , మూడో మండల బిజెపి కార్యదర్శి అన్న బాలరంగయ్య , మూడవ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# సుమేధ హైస్కూల్‌లో విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య అవగాహనకు మైండ్ ఓవర్ స్ట్రెస్

గుంటూరు విద్య,జూలై 29 ప్రభాతవార్త : విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, పరీక్షల భయం వంటి మానసిక సవాళ్లను అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు రోటరీ జిల్లా 3150 మెంటల్ హెల్త్ అవేర్నెస్ వింగ్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటెనియల్, గుంటూరు సెంటెనియల్ కలాం ఇంటరాక్ట్ క్లబ్ మరియు సుమేధ హై స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో మైండ్ ఓవర్ స్ట్రెస్ ఎంపవరింగ్ యంగ్ మైండ్స్ ఫర్ సక్సెస్ అండ్ వెల్ బీయింగ్ అవగాహన కార్యక్రమం సుమేధ హైస్కూల్లో బుధవారం జరిగింది. విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో న్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ లైఫ్ కోచ్ డా. వీరా




ఆతుకూరి ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనే మార్గాలు, భావోద్వేగ నియంత్రణ, సమయ నిర్వహణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, లక్ష్య సాధనలో సానుకూల ఆలోచనల పాత్ర వంటి అంశాలపై ప్రేరణాత్మకంగా వివరించారు. ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న పరీక్షల ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావం, పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సరైన దృక్పథం, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన భావాలను కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా స్నేహితులతో పంచుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. "ప్రతి సవాలు ఒక అవకాశమే. దృఢమైన మనస్సు ఒత్తిడిని విజయంగా మార్చగలదు. మన ఆలోచనలే మన భవిష్యత్తును నిర్మిస్తాయి" అని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, రోటేరియన్లు, ఇంటరాక్టర్లు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# గుంటూరు వార్త

# కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు,ట్రాఫిక్ నియంత్రణపై సమీక్ష

గుంటూరు క్రైమ్,జులై29,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధ్యక్షతన బుధవారం అర్ధ వార్షిక క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించబడింది. జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ అధికారులు,సీఐలు,ఎస్ఐలు,ప్రత్యేక విభాగాల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో గత ఆరు నెలల నేరాల పరిస్థితి,కేసుల దర్యాప్తు పురోగతి,శాంతిభద్రతలు,ట్రాఫిక్ నిర్వహణ,మహిళలు,చిన్నారుల భద్రత,సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,పెండింగ్ కేసుల పరిష్కారం వంటి అంశాలపై జిల్లా ఎస్పీ సమగ్రంగా సమీక్ష



నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి పోలీసు అధికారి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి,వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలన్నారు.చిన్న చిన్న వివాదాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి కేసుకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలను ఈసాక్ష్య యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని,సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు నాణ్యతను పెంచి కోర్టుల్లో శిక్షలు పడేలా బలమైన కేసులు రూపొందించాలని సూచించారు.ఆస్తి సంబంధిత కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రతి స్టేషన్ పరిధిలో రోజువారీ విజిబుల్ పోలీసింగ్,వాహనాల తనిఖీలు,గ్రామ సందర్శనలు,నేరాల నివారణ చర్యలు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు.రాత్రి గస్తీ సిబ్బంది లాఠీలు,టార్చ్‌లైట్లు,విజిల్స్‌తో పూర్తి సన్నద్ధతతో విధులు నిర్వహించాలని,అనుమానాస్పద వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్/లైవ్ స్కానర్ ద్వారా పరిశీలించి వారి నేర చరిత్రను వెంటనే గుర్తించాలని సూచించారు. రక్షక్ వాహనాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో పట్టణ ప్రాంతాల్లో 10 నిమిషాల్లో,గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకొని ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు.హైవే పెట్రోలింగ్ వాహనాలు ప్రమాద ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, అనధికారిక పార్కింగ్‌ను నివారించాలని,హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు.మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.హత్య,అత్యాచారం,దోపిడీ,ఎక్స్‌టార్షన్ వంటి తీవ్రమైన నేరాల్లో పాల్గొనే నేరస్థులపై అవసరమైన చోట రౌడీషీట్లు,సస్పెక్ట్ షీట్లు తెరవాలని,శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. నార్త్, తెనాలి, తుళ్లూరు సబ్‌డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసుల్లో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.కోర్టు విచారణలో ఉన్న కేసులను నిరంతరం పర్యవేక్షిస్తూ సాక్షులను సమర్థంగా హాజరు పరచి నిందితులకు శిక్షలు పడేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.స్టేషన్లలో దీర్ఘకాలంగా ఉన్న వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించి, నిరుపయోగంగా ఉన్న వాహనాలను నిబంధనల ప్రకారం వేలం ద్వారా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశం అనంతరం గత ఆరు నెలల కాలంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన క్రైమ్ ఎస్పీ(ఎన్.సి) సుప్రజ,సౌత్ డీఎస్పీ జి. పూర్ణచంద్రరావు,మహిళల పీస్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు,ఎస్ఐలు,ఐటీ కోర్ సిబ్బంది,కోర్టు స్టాఫ్,స్పెషల్ బ్రాంచ్,టాస్క్ ఫోర్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసించి రివార్డులు అందజేశారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు క్రైమ్,జులై29,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శంకర ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో పోలీసు సిబ్బంది,వారి కుటుంబ సభ్యుల కోసం బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షణలో వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ బాబు,ఆర్ ఐ శ్రీహరి రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది.శంకర ఐ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సృష్టి (ఎం.ఎస్. ఆప్తాల్మాలజీ),వారి వైద్య బృందం పోలీసు సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి



అవసరమైన వైద్య సూచనలు అందించారు.పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి పరీక్షలు నిర్వహించిన శంకర ఐ హాస్పిటల్ నిర్వాహకులకు,డాక్టర్ సృష్టి,వారి వైద్య సిబ్బందికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తరఫున వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ బాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పాఠశాలల్లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

గుంటూరు విద్య, జూలై 29, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష గుంటూరు పరిధిలోని పాత గుంటూరులో గల యాదవ హైస్కూలు తనిఖీ చేసి అక్కడ పదో తరగతి విద్యార్థులకు ఇప్పటినుండే అమలవుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు . కెవిపి కాలనీలోని కె ఎస్ ఆర్ టి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, ఎస్ఎం కే టి ఎస్ పి కే హెచ్ గవర్నమెంట్ హై స్కూల్, రవీంద్ర నగర్ లోని పి ఎం సి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలను



తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను, చూచిరాత పుస్తకాలను తనిఖీ చేశారు విద్యార్థులు ఇప్పటినుండే పోటీ తత్వంతో మంచి ర్యాంకులు సాధించే విధంగా, ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని,ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సమిష్టిగా తోడ్పాటు అందించాలని,పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాన్ని 100 విద్యార్థులు భుజించే విధంగా చేయాలని, భోజన నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అన్నారు ఆయా పాఠశాలల్లో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుపై సాధ్య సాధ్యాలను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏ ఎల్ బిఈడి కళాశాలలో ఘనంగా ప్రథమ మనో విజ్ఞాన దినోత్సవ వేడుకలు

గుంటూరు విద్య జులై 29 ప్రభాతవార్త : భారత ప్రభుత్వం వ్యాస పూర్ణిమను (గురు పూర్ణిమను) భారతీయ మనోవిజ్ఞాత దినోత్సవం గా (ఇండియన్ సైకాలజీ డే గా) ప్రకటించిన సందర్భంగా స్థానిక ఆంధ్ర లూథరన్ కళాశాలలో కళాశాల సైకాలజీ డిపార్ట్మెంట్, అడ్వాన్స్డ్ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా (ఏ పీ ఏ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ మనో విజ్ఞాన దినోత్సవ వేడుకలు జరిగాయి .కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ మధురవాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశ్రాంత మనోవిజ్ఞాన ఆచార్యులు, మానసిక వైద్యులు డాక్టర్ కోటా సురేష్ మాట్లాడుతూ వేద వ్యాసుడు వ్రాసిన మహాభారతం అందలి పాత్రలు సంఘర్షణలు వ్యూహ ప్రతి వ్యూహాలు మనోవిజ్ఞాన పూరితమైన వని తెలిపారు. అవి ఆధునిక మనోవిజ్ఞానానికి వారధిలా పనిచేస్తున్నాయని ప్రస్తుతించారు .కార్యక్రమ అధ్యక్షులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ మధురవాణి మాట్లాడుతూ భారత దేశ విశ్వవిద్యాలయాలలో సైకాలజీ కోర్సు ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల సైకాలజీ ల్యాబ్లో ప్రముఖ భారతీయ మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల చిత్రపటాలను ముఖ్య అతిథుల




చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ క్రీస్తు రత్నం ,డాక్టర్ అల్లం ఇ న్నారెడ్డి, డాక్టర్ వి .శేఖర్ బాబు, డాక్టర్ ఎస్ ఏ వెస్లీ, డాక్టర్ వినయ్ కుమార్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 18న అగ్రిసెట్ 2026

గుంటూరు, జూలై 29, ప్రభాతవార్త ప్రతినిధి: వ్యవసాయ, విత్తన సాంకేతిక, సేంద్రియ వ్యవసాయ డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులు అగ్రి బీఎస్సీ (హానర్స్) నాలుగు సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం ఆగస్టు 18న అగ్రిసెట్2026 ప్రవేశపరీక్ష నిర్వహి స్తున్నామని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఎ.మణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆగస్టు 14వ తేదీ నుంచి హాల్ టికెట్లను విశ్వవిద్యాలయం వెబ్సైట్ angrau.ac.in నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వెబ్సైట్ సందర్శించాలని సూచించారు.

# రేవేంద్రపాడులో ఘనంగా గురు పౌర్ణమి మహోత్సవం

మంగళగిరి, జూలై 29, ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గ రేవేంద్రపాడు గ్రామంలో ఉన్నటువంటి శ్రీ షిరిడి సాయిబాబా వారి మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాలు అంగరంగ



వైభవంగా ఏర్పాటు చేశారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఆప్కో, మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానము ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాద ఇతరులను చేశారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ... పర్వదినం గురు పౌర్ణమి నాడు రేవేంద్రపాడులోని శ్రీ షిరిడి సాయిబాబా వారి మందిరంలో బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కమిటీ వారి ఆహ్వానం మేరకు ప్రత్యేకంగా వచ్చి స్వామివారి పూజ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు.

# ఇథనల్ ఈ 20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం

గుంటూరు విద్య, జులై 29 ప్రభాతవార్త: పౌరుల మోటారు వెహికల్ లకు తీవ్రంగా నష్టం వస్తున్న ఇతనాల్ ఈ 20 పెట్రోల్ తయారీ కంపెనీ లు నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ ఘత్కరీ రాజీనామా చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి. కృష్ణ స్వరూప్ ,జాతీయ చీఫ్ అడ్వైసర్ డాక్టర్ . వి.ఎల్. రాజు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ ప్రసాద్ మాదిగ, మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జె. ఎన్. రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాయప్ప లు డిమాండ్ చేసారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశం లో వారూ మాట్లాడుతూ పర్యావరణ.మోటారు వాహన రంగానికి విఘాతం జరిగే ఈ 20



పెట్రోల్ వాడకం వలన ఇంజన్లు చెడిపోతాయనీ, మైలేజీ 20 శాతం తగ్గిపోతున్నదని తెలిపారు. జనరల్ పెట్రోల్ విక్రయించకుండ ఇథనల్ కలిపిన పెట్రోల్ ను మార్కెట్ లో తీసుకొచ్చి పెద్ద ఎత్తున అమ్ముడుపోవడం ద్వారా తమ మార్కెట్ ను పెంచికోవడం కోసం బీజేపీ కేంద్ర మోడీ సర్కార్ లో తమ విధానాలు మార్పులను కేంద్ర మంత్రి నితిన్ ఘాట్కరి వత్తిడి తీసికొని వచ్చి కుటుంబ వ్యాపారాలు కోసం ప్రజల వాహనాలకు నష్టం చేస్తున్నారని కృష్ణ స్వరూప్ ఆరోపణలు చేసారు. ఇదనాల్ ఈ 20 కలిపిన పెట్రోలు ను తప్పనిసరిగా కొనుగోలు చేయాలనీ కేంద్ర సర్కార్ భారత వాహన మోటారు దారులకు అల్టిమేట్ జారీ చేసిందన్నారు. ఇతనాలు కల్పిన పెట్రోల్ విక్రయాలు ను నిషేదించాలని, మంత్రి నితిన్ ఘాట్కారీ రాజీనామా చేయాలనీ మోడీషా ఎన్ డి ఏ సర్కార్ ను డిమాండ్ చేస్తూ ఆగస్టు 1 న కేజ్రివల్ ఇ 20 జనతా పార్టీ ఆధ్వర్యంలో సంయుక్తం గా ఢిల్లీలో నిర్వహించే జాతీయ సదస్సు లో తమ పార్టీ తరుపున పాల్గొంటామన్నారు.

# నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాల ఎదుట నల్లబాడ్జీలతో అధ్యాపకుల నిరసన

గుంటూరు విద్య, జులై 29, ప్రభాతవార్త: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు కెరీర్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ కింద వెంటనే పదోన్నతలను కల్పించాలనే పలు డిమాండ్లతో నల్లపాడు ఎం బి టి ఎస్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం జరిపినట్లు అధ్యాపకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ 2019 సంవత్సరం నుంచి అమలులోకి వచ్చిన పీఆర్సీ బకాయిలను చెల్లించాల్సి ఉంద న్నారు. ఈ విషయమై పలు మార్లు మంత్రులు, ఉన్నతాధికారులకు విన్నవించి నట్లు పేర్కొన్నారు. గత ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వం



సీపీఎస్ నోటిఫికేషన్ జారీ చేయకపోవ డంతో అర్హులైన అధ్యాపకులు పదోన్నతి అవకా శాలు కొల్పోతూ తీవ్ర నిరాశకు గురువుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. అధ్యాపకులకు అన్ని సమస్యలున్నా విద్యార్థుల విద్యకు ఆటంకం కలుగకుండా తమ బోధన, పరిపాలన విధులను యథావిధిగా నిర్వహిస్తున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వ దృష్టి సారించేందుకు నల్లబాడ్జిలు ధరించి శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశామన్నారు. కార్యక్రమంలో అధ్యాప కులు, పాల్గొన్నారు.

# నలుగురు నిందితుల అరెస్ట్

గుంటూరు క్రైమ్,జులై29,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాను డ్రగ్స్,గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డ్రగ్స్,గంజాయి అక్రమ రవాణా,విక్రయాలు,వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.ఈ క్రమంలో కొత్తపేట ఎస్సై పి. సుబ్బారావుకి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం ఆదేశాలతో కొత్తపేట సీఐ ఎం. వీరయ్య పర్యవేక్షణలో ఎస్సై మధ్యవర్తులు, పోలీసు సిబ్బందితో కలిసి కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుగ్లర్ ఆసుపత్రి కాంపౌండ్ వద్ద తనిఖీలు



నిర్వహించారు. అక్కడ అనుమానా స్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి మొత్తం 1 కిలో 270 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ముద్దాయి జున్నుకూటి చంటి పాత గుంటూరు విశాఖపట్నం పరిసర ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి గుంటూరుకు తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి తన స్నేహితులైన దుర్గాప్రసాద్, మన్సూర్‌వలి,మరొక వ్యక్తి ద్వారా విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. జున్నుకూటి చంటి ఇటీవల విశాఖపట్నం ప్రాంతానికి వెళ్లి గంజాయి కొనుగోలు చేసి గుంటూరుకు తీసుకువచ్చి, అందులో కొంత వినియోగించి,మిగిలిన గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించి నలుగురిని పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసిముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టు లో హాజరు పరిచారు. గంజాయి, డ్రగ్స్,ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయం,వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ,డయల్ 112 ద్వారా గానీ,డ్రగ్స్ సంబంధిత హెల్ప్‌లైన్ 1930 ద్వారా గానీ సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని గుంటూరు ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం తెలిపారు. గంజాయి పట్టుకొనుటలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ దేగల కోటేశ్వరావు చుట్ల శ్రీనివాసరావు,జానీ భాష అనిల్ కుమార్,పవన్ కుమార్ లను డీఎస్పీ అభినందించారు.

**ఓరిజినల్ దస్తావేజులు పోయినవి**

గుంటూరు జిల్లా పొన్నూరు (మ) ఇటికంపాడు గ్రామ కాపురస్తుడు దూళ్ళ గాంధీ గారి కుమారుడు వెంకటశివరావు తన మేనమామ ద్వారా వ్రాయించి రిజిస్టర్ చేసి ఇచ్చిన రిజిస్టర్ దాఖలు దస్తావేజు నెం.107/2003 రీత్యా సర్వేనెం. 441/8 లో 157.3 చ॥గ॥ స్థలంలో నిర్మించిన బిల్డింగుకు సంబందించిన ఓరిజినల్ దస్తావేజులు పొన్నూరులో జిరాక్స్ తీసుకొని వస్తుండగా పోయినవి. దొరికిన వారు ఈ సెల్ నెం. 9963294846 సంప్రదించగలరు.

## గొడ్డలిపార్టీని నమ్ముకుంటే రాజకీయ జీవితం అంధకారమే: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 29, ప్రభాతవార్త: విధ్వంస, విషప్రచారాల్ని నమ్ముకున్న గొడ్డలిపార్టీని నమ్ముకున్న వారి రాజకీయ భవిష్యత్ ఎప్పటికైనా అంధకారమేనని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో 21వ వార్డుకు చెందిన 50 కుటుంబాలు ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ తీర...ం పుచ్చుకున్నారు. వైసీపీ కార్యకర్తల్ని



సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ప్రత్తిపాటి వారిని ఉద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలపై వైసీపీ రగలిపోతుంటే.. ప్రజల్లో మాత్రం గతంలో ఎన్నడూ లేని విధంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు సమర్థత, అనుభవంతో రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని, మంత్రి లోకేశ్ పనితనంతో జగన్ కు నిద్రకరువైందని ప్రత్తిపాటి ఎద్దేవాచేశారు. డీఎస్సీ పై చర్చకు రమ్మని లోకేశ్ సవాల్ విసిరితే.. జగన్ ప్యాలెస్ లో ఉండి, పార్టీ శ్రేణుల్ని రోడ్లెక్కించి సొంతడబ్బా కొట్టుకుంటున్నాడని ప్రత్తిపాటి విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఇంటింటి ప్రచారంతో జగన్ వైసీపీ దుకాణం క్లోజే: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 29, ప్రభాతవార్త: రెండేళ్లలో చంద్రబాబు నాయకత్వంలో కూటమిప్రభుత్వం సాధించిన అద్భుత విజయాలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేదుకు, జగన్..వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టేందుకే టీడీపీ ఇంటింటి ప్రచారం చేపట్టిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆయన పట్టణంలోని 10, 19 వార్డుల్లో టీడీపీ డోర్ టూ డోర్



ప్రచారం చేపట్టారు. కూటమి నాయకులతో కలిసి ప్రజల ఇళ్లకు వెళ్లిన ప్రత్తిపాటి..ప్రజా ప్రభుత్వ విజయాలను ఏకరువు పెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కష్టం, ముందుచూపు, అనుభవానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ల అసమాన పాలనా సంస్కరణలు తోడవడం నిజంగా రాష్ట్రానికి, ప్రజలకు గొప్ప వరమని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు అమర రమాదేవి ముల్లా కరిముల్లా, మండవ వెంకట రావు, సయ్యద్ రఫీ, షేక్ అజారుద్దీన్, షేక్ అబ్దుల్లా భాష, షేక్ అబ్దుల్ మజీద్, మజారుద్దీన్, జానీ భాష, ధరియవలి, కరిముల్లా, యేసుదాసు, రమేష్, శివయ్య, అబ్దుల్ రెహమాన్, బాజీ, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోపాలం భానుప్రసాద్ కన్నుమూత



చిలకలూరిపేట, జూలై 29, ప్రభాతవార్త: పట్టణ ప్రముఖులు గోపాలం భాను ప్రసాద్ రావు బుధవారం తెల్లవారు ఝామున శివైక్యం చెందినారు.. వారి భౌతిక కాయాన్ని పండరీపురం 8 వ లైన్ లోని ఆయన స్వగృహానికి సాయంత్రం 4 గంటలకు తీసుకురానున్నారు. గురువారం అంత్యక్రియలు జరుపుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలియ చేశారు..

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది...

చిలకలూరిపేట, జూలై 29, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని పసుమర్రు మరియు మరియు చిన్న పసుమర్రు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ సరిత,డి ఏ ఏ టి టి సి కోఆర్డినేటర్ మరియు ప్రధాన శాస్త్రవేత్త అయిన డా. ఎమ్.నగేష్ గారు పాల్గొని రైతులకు నూతన వంగడాల సాగుపై పలు సూచనలు చేశారు. ప్రధాన శాస్త్రవేత్త నగేష్ , ఏఈఓ లు ప్రతాప్,ప్రసన్న పసుమర్రు మరియు చిన్న పసుమర్రు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో పార్టీలకు అతీతతంగా ప్రజారోగ్య రక్షణకు ప్రాధాన్యత : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, జూలై 29, ప్రభాతవార్త: గత ప్రభుత్వం ప్రజల్ని పార్టీలు, ప్రాంతాలు, కులాలు, మతాలుగా విభజించి సంక్షేమాన్ని అమలు చేసిక, కోలుకోలేని విధంగా దెబ్బతిన్నదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. బుధవారం ఆయన తన నివాసంలో 50 మంది లబ్ధిదారులకు రూ.17.85 లక్షల విలువైన సీఎం. ఆర్.ఎఫ్ చెక్కుల్ని స్వయంగా అందచేశారు. తీవ్ర అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ప్రతిపక్ష పార్టీ నాయకుడైన విష్ణు నాయక్ కు రూ.1,34,346ల విలువైన ఎల్.ఓ.సీ అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండలల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నేతలు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, అమర రమాదేవి, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దత్త సాయి సన్నిధిలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

చిలకలూరిపేట, జూలై 29, ప్రభాతవార్త: చిలకలూరిపేట ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం మరియు జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేంచేసి ఉన్న శ్రీ



దత్త సాయి సన్నిధిలో గురు పౌర్ణమి సందర్బంగా ప్రత్యేకంగా బాబా కి వేదమంత్రాలతో అభిషేక అర్చన పూజా కార్యక్రమం జరిగింది అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే సద్గురు కార్యసిద్ధి పూజలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పుల్లారావు ,పట్టణంలో ప్రముఖ గైనకాలజిస్ట్ లావు సుష్మా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు, టస్ట్ చైర్మన్ డాక్టర్ పూసపాటి బాలాజీ, తోపాటు వేద పండితులు మేడూరి ఉమామహేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలన్నీ నిర్వహించారు, ట్రస్ట్ సెక్రెటరీ అరవపల్లి సత్యనారాయణ గుప్తా, మానేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రత్తిపాటిని కలిసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చందోలు

చిలకలూరిపేట, జూలై 29, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు చందోలు సూర్యప్రకాశరావు ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుని మర్యాదపూర్వకంగా కలవటానికి



వచ్చినారు. ఈసందర్బంగా చందోలును శాలువాతో సత్కరించి ఎమ్మెల్యే అభినందించినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నిది మెంబర్ గుర్రం సాంబశివరావు, అయినవోలు రాదా ,అమరా రమాదేవి, కూనల ప్రమీల ,అరవపల్లి వీరాంజనేయులు, డాక్టర్ సురేష్ .,వెల్లంపల్లి రవిశంకర్, నాగమల్లి ,అమరా మణి ,తవ్వ చలపతి తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## సమాజంలో గురు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు

చిలకలూరిపేట, జూలై 29,ప్రభాతవార్త: ఏ సమాజంలోనైనా గురుస్థానం అత్యంత విశిష్ఠం, ఎవరూ భర్తీ చేయలేనిదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.అజ్ఞానపు చీకట్ల నుంచి విజ్ఞానపు వెలుగుల్లోకి నడిపించే మహోన్నత వ్యక్తి గురువు అని



కొనియాడారు. పురుషోత్తపట్నంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం, సుబ్బయతోట లోని జయజయ సాయి ట్రస్ట్ ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవం నిర్వహించారు. అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, గుడి చైర్మన్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తినేని శ్రీనివాసరావు, టీడీపీ నేతలు గట్టినేని రమేష్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, ధరణి శ్రీ గోసంరక్షణ సమితి నిర్వాహకులు తెల్లపోలు రామూర్తి, భైర శ్రీనివాసరావు, భైర సుబ్బారావు, భైర లక్ష్మి నారాయణ, కునపరెడ్డి నాగభూషణం, భైర నరేంద్ర, తోట నాగబాబు, గురుస్వామి మురికిపూడి లక్ష్మీనారాయణచార్యులు మరియు కమిటీ సభ్యులు, జయ జయ సాయి ట్రస్ట్ డైరెక్టర్ పూసపాటి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## బి.ఎల్.ఏ ల విస్తృతస్థాయి సమావేశం..

రెంటచింతల జులై 29 ప్రభాతవార్త: ఉన్న ఓట్లను తొలగించకుండా నిజమైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా ఓటును వినియోగించుకోవటానికి అవకాశం కల్పించిన టీడీపీకి చెందిన బీ ఎల్ ఏ(బూత్ లెవల్ ఏజెంట్స్)లు చేసిన కృషి ప్రశంసనీయమని పార్టీకి వారే పునాదులని టీడీపీ మండల అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి అన్నారు.. బుధవారం మండలకేంద్రమైన రెంటచింతలలోని మానస నర్సరీలో మండల స్థాయి బీఎల్ఎల విస్తృత స్థాయి సమావేశంలో అబ్బిరెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో ఇదే ఉత్సాహం, ఊపుతో ముందుకెళ్లాలని కోరారు. గత స్థానిక ఎన్నికల్లో టీడీపీ నేతలను నామినేషన్ వేయకుండా అడ్డుకుని అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేశారని తత్ఫలితంగా ఒక్క గ్రామ పంచాయతీ కూడా టీడీపీకి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్టానానికి అన్నీ తెలుసన్నారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ఏ ఏ గ్రామాల్లో ఏ విధంగా నిర్వహించాలి 11 గ్రామాల్లో ఎప్పుడెప్పుడు నిర్వహించాలనే దానిపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో సుమంత్ రెడ్డి, బోడపాటి రామకృష్ణ,మర్రి రాజ్ కుమార్ (బాబు), తదితరులు పాల్గొన్నారు

## వెల్దుర్తిలో ఘనంగా కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రచారం

వెల్దుర్తి:జులై 29 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు వెల్దుర్తి మండల కేంద్రంలో శుక్రవారం టీడీపీ నేతలు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. మండల

# పల్నాడు జిల్లా వార్త



## వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

సత్తెనపల్లి, జూలై 29, ప్రభాతవార్త: ఫిరోజీ ఋషింద్రుల వారి మఠం లో అంగరంగ వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అంగరంగ వైభవంగా ఫిరోజీ



ఋషింద్రుల వారి మఠంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు అనంతరం ప్రతి పౌర్ణమికి నిర్వహించే సత్యనారాయణ స్వామి వ్రతం చండీ హోమం ఘనంగా నిర్వహించారు అనంతరం భక్తులకి అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. మానవ జీవితం తరించాలంటే శ్రీ గురుని యొక్క అనుగ్రహం పరిపూర్ణంగా పొందాలని అలాంటి శ్రీ గురుని రూపం లో మన దగ్గర లో ఉన్నటువంటి ఫిరోజీ ఋషింద్రుల అనుగ్రహం అందరికీ కలగాలని కోరుకుంటు న్నాం అని ప్రస్తుత పీఠాధిపతి భాను ప్రసాద్ ఉత్తరాధికారి ఫిరోజీ బాబు తెలిపారు

## సత్తెనపల్లిలో సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి, జూలై 29, ప్రభాతవార్త: పెండింగ్ కేసులను రాజీ మార్గంలోపరిష్కరించుకునేందుకు మరొక మంచి అవకాశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ,అమరావతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 12, 2026 (రెండవ శనివారం) నాడు సత్తెనపల్లి మండల న్యాయసేవా కమిటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవా కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయకుమార్ రెడ్డి తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్లో సివిల్ తగాదాలు, బ్యాంకు కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రెవెన్యూ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు తదితర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.కోర్టు ల్లో పెండింగ్లో ఉన్న కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.అలాగే, కోర్టును ఆశ్రయించకముందే పరిష్కరించదగిన ప్రీలిటిగేషన్ కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని మండల న్యాయసేవా కమిటీ ఛైర్మన్,సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి. విజయకుమార్ రెడ్డి తెలిపారు.

## భీమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది

సత్తెనపల్లి, జూలై 29, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి, భీమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలోని రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో ప్రత్తి, మిరప,కంది మరియు వరి పంటలపై బీమా పొందేందుకు వ్యవసాయ శాఖ నిర్దేశించిన గడువులోగా రైతులు వాటా ప్రీమియం గా చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, గ్రామ ఉద్యాన సహాయకులు షేక్ ఆరీఫ్ గారు, భీమవరం గ్రామ నాయకులు బలుసుపాటి వెంకటసుబ్బయ్య గారు మరియు రైతులు పాల్గొన్నారు

## సత్తెనపల్లిలో దోపిడీ దొంగల హల్చల్

సత్తెనపల్లి, జూలై 29, ప్రభాతవార్త: రఘురాం నగర్,శివాలయం దగ్గర రెండు ఇళ్ళల్లో చోరీకి పాల్పడ్డ దొంగలురెండు ఇళ్లల్లో తాళాలు పగలగొట్టి దోపిడీకి పాల్పడిన దుండగులుపది లక్షల విలువ చేసే బంగారం,1 లక్ష.35 వేలు నగదు అపహరణ.పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.కేసు నమోదుచేశారు.

## గురు పౌర్ణమి వేడుకలు



సత్తెనపల్లి, జూలై 29, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా సత్తెనపల్లి శరభయ్య హై స్కూల్ క్రీడా ప్రాంగణం పెద్ద సాయి బాబా గుడి వద్ద బుధవారం మధ్యాహ్నం "గురు పౌర్ణమి" వేడుకలు.. ఈ సందర్బంగా వివిధ సేవా తత్పరులు, నాయకులతో పాటు లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ అన్న సంతర్పణ లో పాల్గొని భక్తులకు అన్న వడ్డించి భోజనం చేశారు.

## ఘనంగా గురు పౌర్ణమి

కారంపూడి ,జూలై 29, ప్రభాతవార్త: సాయి మందిరాలలో గురుపౌర్ణ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుండి భక్తులు సాయి మందిరాలకు వెళ్లి అర్చనలు, అభిషేకాలు చేశారు. మండల కేంద్రమైన కారంపూడి లోని దేవాలయాల వీధిలో ఉన్న శిరిడి సాయి మందిరం, ఆర్యవైశ్య వీధిలోని సత్యసాయి మందిరం, ఎంప్పీ కాలనీలోని బాలనాగ సాయి మందిరం, గాదెవారిపల్లె గ్రామంలోని శిరిడి సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

## అమరావతి ఛాంపియన్షిప్ టోర్నమెంట్లో ఓక్ బ్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ

మాచర్ల టౌన్ జూలై 29 ప్రభాతవార్త: అమరావతి ఛాంపియన్షిప్ టోర్నమెంట్లో భాగంగా పల్నాడు జిల్లా,కారంపూడిలోని బ్రహ్మనాయుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ




స్థాయి క్రీడా పోటీల్లో మాచర్లకు చెందిన ఓక్ బ్రిడ్జ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఫ్రాంక్లిన్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని విశేష ప్రతిభను చాటారు.ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు తేజస్విని,ప్రవళిక అత్యుత్తమ ప్రదర్శనతో నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఫ్రాంక్లిన్ తెలిపారు

## ఘనంగా గురుపౌర్ణమి

రెంటచింతల జులై 29 ప్రభాతవార్త: పవిత్ర కృష్ణానదీ తీరాన కొలువైవున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం లో వివిధ కూరగాయలు,ఆకుకూరలు,పండ్లతో శాకాంబరీదేవి గా భ్రమరాంబికా దేవి భక్తులకు దర్శనమిస్తూ విశేషంగా నిలిచింది.ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకొని రెంటచింతల మండలంలోని వివిధ దేవాలయాలలో అత్యంత వైభవంగా అమ్మవార్లను శాకాంబరిగా అలరింపజేసి భక్తులకు వేకువజాము నుంచే దర్శనం కల్పించారు

## ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాల సమాచారం చేరాలి : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి జులై 29 ప్రభాతవార్త: ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా చేరేలా మాచర్ల నియోజకవర్గంలో ఖిఇంటింటికి సుపరిపాలనఖి కార్యక్రమాన్ని విజయవంతంగా మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి



బ్రహ్మానందరెడ్డి పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు వివరించారు.దుర్గి, ఓబులేసుని పల్లెలో ప్రచారంలో భాగంగా బుధవారం దుర్గి గ్రామంలో ఖిఇంటింటికీ తెలుగుదేశంఖి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే జూలకంటికి ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రాచీన శివాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. అదేవిధంగా దుర్గి గ్రామం, ఓబులేసుని పల్లెలో కూటమి నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రెండేళ్ల కూటమి పాలనలో అందించిన సంక్షేమాన్ని, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి డోర్ టు డోర్ వివరించారు. దుర్గి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మునుగోటి సత్యనారాయణ, ఎంపీపీ ఏచూరి సాయి సునీత, లింగ రమేష్ , టిడిపి టౌన్ అధ్యక్షుడు మారుగొండ్ల వేణుగోపాల్ , చిరుమామిళ్ల కిష్టయ్య, దుర్గి మిర్చి యార్డు చైర్మన్ లింగ బ్రహ్మయ్య ,కపలవాయి శ్రీనివాసరావు (టెంపర్), జనసేన నాయకుడు రుద్రాల రవి, వెలిదండి శీను, శెట్టిపల్లి నరసింహారావు, సింగు నాగేశ్వరరావు ,సురా రామారావు, పగడాల చెన్నకేశవరావు తదితరులు కూటమి నాయకులు , బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు. కరపత్రాలు అందుకున్న ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

---

కేంద్రంలోని ఎస్సీ కాలనీ నుంచి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన జూలకంటి శోభారాణి, స్థానిక నాయకులు ప్రతి ఇంటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలనలో సాధించిన పురోగతిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు.

## ముప్పాళ్ల మండలంలో ఘోరరోడ్డుప్రమాదం

ముప్పాళ్ల, జూలై 29, ప్రభాతవార్త:డ పల్నాడు జిల్లాలోని ముప్పాళ్ళ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముప్పాళ్ళ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత రాష్ట్ర రహదారి-322పై లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన ట్రాలీ ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎర్రసాని జోసఫ్ కుమార్, ఎర్రసాని ఏబోజు అనే ఇద్దరు అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఇద్దరికీ కాళ్లు విరిగాయి. సమాచారం అందుకున్న 108



అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (నిలీగి) ప్రసన్నకుమార్ ఘటనాస్థలికి చేరుకుని వెంటనే ప్రథమ చికిత్స అందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్ను నియంత్రించి, కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## ఎల్ నినో దృష్ట్యా రైతాంగం సాగులో నూతన విధానాలు చేపట్టాలి: ప్రత్తిపాటి

యడ్లపాడు, జులై 29, ప్రభాతవార్త : ఎల్నినో ప్రభావం దృష్ట్యా రైతులు తక్కువ నీటితో ఎక్కువ ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని, కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాల్ని



సద్వినియోగం చేసుకోవాలని, డ్రిప్.. స్ప్రింక్లర్ విధానం వైపు మొగ్గ చూపాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. బుధవారం ఆయన యడ్లపాడు మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో ఒక రైతు పొందిన ట్రాక్టర్ ను ప్రారంభించి, దానిపై ముందుకు సాగుతూ ప్రజలకు అభివాదం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనతో ఎల్నినో ప్రభావంపై అధికార యంత్రాంగం రైతుల్ని చైతన్యవంతం చేయాలని, సరికొత్త సాగు విధానాలపై వారిని సన్నద్ధం చేయడానికి ఇదే మంచి సమయమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు, ముద్దన నాగేశ్వరరావు, పోపూరి రాఘవయ్య, మద్దినేని సుబ్బారావు, పోపూరి రామారావు, వెంకయ్య, కాకుమాను చంటి, రామయ్య, ప్రభుదాస్, బందేల శ్రీనివాసరావు, బలరాం, కొండలు, అంజేశ్వరరావు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యంత్రాల అద్దె సేవలు అందుబాటులోకి యడ్లపాడులో కస్టమ్ హైరింగ్ సెంటర్ ప్రారంభం

యడ్లపాడు, జూలై 29, ప్రభాతవార్త : యడ్లపాడు మండల రైతు ఉత్పత్తిదారుల సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ యంత్రాలను అద్దెకు అందించే కస్టమ్ హైరింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించి, ట్రాక్టర్ను స్వయంగా కొంతదూరం నడిపి రైతులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా అధికారులు



మాట్లాడుతూ రైతులు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని, తేదీల వారీగా వ్యవసాయ పనిముట్లను అద్దెకు పొందవచ్చని తెలిపారు. మండల నాయకులు కామినేని సాయిబాబు, పోపూరి నాగేశ్వరరావు, పోపూరి రాఘవయ్య, ముఖన నాగేశ్వరరావు, జాలాది రఘురామయ్య, వీరారెడ్డి, పోతురాజు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ విజయశ్రీ, కె రవీంద్రకుమార్, ముంజరరావు, అధ్యక్షురాలు పోపూరి నాగమల్లేశ్వరి, కీర్తి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ పెద్దయ్య, నాగేశ్వరరావు, ద్రాక్షాయణి, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎడ్లపాడు ఆర్ఎస్కేలో ఎపిఎస్ఎసి వైస్ ఛైర్మన్ సూర్యతేజ పర్యటన

యడ్లపాడు, జూలై 29, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎపిఎస్ఎసి) వైస్ ఛైర్మన్ మల్లవరపు సూర్యతేజ ఐఎస్ బుధవారం యడ్లపాడు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి



రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎపిఎఐఎమ్ఎస్ 2.0 అమలు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎపిఎఐఎమ్ఎస్ 2.0లో కృత్రిమ మేధస్సు (ఎఐ), రిమోట్ సెన్సింగ్, జిఐఎస్, ఉపగ్రహ చిత్రాలు, వాతావరణ విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతికతలను సమన్వయం చేసి పంటల ఆరోగ్యం, పంటల పెరుగుదల, వాతావరణ పరిస్థితులను శాస్త్రీయంగా పర్యవేక్షి స్తూ రైతులకు సకాలంలో సూచనలు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు, నరసరావుపేట సహాయన సంచాలకులు కెవి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాద్, ఎఇఓ జీవన్, గ్రామ వ్యవసాయ సహాయకులు బిలాల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## గ్రామాల సమస్యలపై అర్జీ : సామాజిక శంఖారావం సభ్యులు

యడ్లపాడు, జులై 29, ప్రభాతవార్త : మండల పరిధిలోని జగ్గాపురం, కారుచోల, లింగారావుపాలెం, సొలస గ్రామాలలో సీపిఎం సామాజిక శంఖారావం సభ్యులు పర్యటించి అక్కడి సమస్యలపై స్థానిక విఆర్వోలకు అర్జీలను అందజేయటం జరిగిందని సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు



వివరిస్తూ ప్రధానంగా డ్రైనేజ్ సమస్యలు, రీ సర్వేలో వచ్చిన సమస్యలపై, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, కమ్యూనిటీ లోన్సు, నివేశన స్థలాలకు సంబంధించి ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి మాధవి, కారుచోల రోశయ్య, జరుగుల శంకరరావు, కొండెపోగు నరసయ్య, రమణయ్య, దావల యేసు తదితరులు పాల్గొన్నారు.

## మాచర్లలో సైరన్ మోత.....

### నిబంధనలు బేఖాతరా? అధికారుల పర్యవేక్షణఏదీ ?
### సైరన్లు ఎవరు వినియోగించాలి?
### ఎవరికి అనుమతి ఉంటుంది?అనుమతులు ఎవరు ఇస్తారు?

మాచర్ల క్రైమ్ జూలై 29 ప్రభాతవార్త:మాచర్ల పట్టణంలో ఇటీవల నాలుగు చక్రాల వాహనాలకు సైరన్లు అమర్చుకుని యథేచ్ఛగా వినియోగిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అత్యవసర పరిస్థితులు లేకపోయినా,ట్రాఫిక్ అంతరాయం లేకున్నా కొందరు సైరన్లు మోగిస్తూ రహదారులపై సంచరిస్తుండటం ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.అసలు ఈ సైరన్లు ఎవరు వినియోగించాలి? ఎవరికి అనుమతి ఉంటుంది? అనుమతులు ఎవరు ఇస్తారు? అనే ప్రశ్నలకు సమాధానం కోరుతున్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సెంట్రల్ మోటర్ వెహికల్స్, 1989 మరియు మోటారు వాహనాల చట్టం,1988 ప్రకారం అత్యవసర సేవలకు సంబంధించిన నిర్దిష్ట వాహనాలకే సైరన్లు, ప్రత్యేక హెచ్చరిక పరికరాలను వినియోగించే అవకాశం ఉంటుంది. సాధారణంగా అంబులెన్స్లు,పోలీసు వాహనాలు, అగ్నిమాపక శాఖ వాహనాలు వంటి అత్యవసర సేవల వాహనాలకే ఈ సౌకర్యం వర్తిస్తుంది. ఇతరులు అనుమతి లేకుండా సైరన్ వినియోగించడం చట్టవిరుద్ధమవుతుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఇదే కాకుండా భారత సుప్రీంకోర్టు



ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎరుపు, నీలం బీకాన్ లైట్ల వినియోగాన్ని కూడా అత్యంత పరిమిత వర్గాలకు మాత్రమే అనుమతించింది.వీఐపీ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో సామాన్య వాహనాలపై ప్రత్యేక హెచ్చరిక పరికరాల వినియోగాన్ని నియంత్రించింది.అయితే మాచర్లలో కొంతమంది వ్యక్తులు ప్రైవేట్ నాలుగు చక్రాల వాహనాలకు సైరన్లు అమర్చుకుని అధికార వాహనాల మాదిరిగా సంచరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వాహనాలకు అధికారిక అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎన్ని వాహనాలకు ఉన్నాయి? ఏ శాఖ మంజూరు చేసింది? అనే అంశాలపై అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు, జిల్లా పోలీసు యంత్రాంగం సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయా? అనుమతి లేని సైరన్లను తొలగిస్తున్నారా? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు, కేసులు నమోదు చేస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సైరన్లు వినియోగించడం వల్ల అత్యవసర సేవల వాహనాల గుర్తింపుపై ప్రభావం పడటమే కాకుండా,ప్రజల్లో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ లేదా పోలీసు వాహనానికి ప్రజలు వెంటనే దారి ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది.అయితే అనధికారికంగా సైరన్లు వినియోగించే వాహనాల సంఖ్య పెరిగితే, నిజమైన అత్యవసర సేవలకే ఆటంకం కలిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.మాచర్ల పట్టణంలో ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ,అత్యవసర సేవల వాహనాలకు మాత్రమే చట్టబద్ధంగా సైరన్ వినియోగానికి అనుమతి ఉంది? ఎన్ని ప్రైవేట్ వాహనాలు సైరన్లతో తిరుగుతున్నాయి? వాటిలో ఎన్ని చట్టబద్ధమైనవి? అనే అంశాలపై జిల్లా యంత్రాంగం సమగ్ర పరిశీలన చేపట్టి ప్రజలకు వివరాలు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ సైరన్లు వినియోగిస్తున్న వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుని,అనధికారిక సైరన్లను తొలగించాలని,అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.చట్టం అందరికీ సమానమేనని నిరూపించేలా సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై స్పందించిన మాచర్ల టౌన్ సీఐ మహమ్మద్ నజీర్ బేగ్ మాట్లాడుతూ, తమ పరిధిలో అనుమతి లేకుండా సైరన్లు వినియోగిస్తున్న వాహనాలపై సమాచారం అందిన వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమైన సైరన్ సౌకర్యాన్ని దుర్వినియోగం చేసే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

30MN 7PG-GNT_30MN 7PG-GNT.qxd 30-07-2026 AM 01:11 Page 1



## వర్షాభావ పరిస్థితులను బట్టి పంటల సాగు చేపట్టాలి

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తదుపరి ప్రధాన పంటల సాగుకు ఇప్పటి నుంచే ప్రణాళికలను రూపొందించుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి రాజకుమారి సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో రైతులు (పిఎండిఎస్) పథకం ద్వారా సాగుచేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను బుధవారం ఆమె సందర్శించి పరిశీలించారు. విత్తనాల మొలక శాతం ఆశాజనకంగా ఉండడంతో రైతులను అభినందించారు. ప్రధాన పంటలతో పాటు మినుము, కంది, పెసర, అలసంద వంటి పప్పు ధాన్యాలను అంతర పంటలుగా సమీకరించడం ద్వారా నేల సారవంతత పెరుగుతుందన్నారు.



తద్వారా నత్రజని స్థిరీకరణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పంటల దిగుబడి పెరుగుదల, రైతులకు అదనపు ఆదాయం లభిసు ందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పిఎండిఎస్ విధానం, జీవ వైవిధ్య ఆధారిత పంటల సాగు , నేల ఆరోగ్య పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్‌ల వినియోగం ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్‌ల వినియోగం రైతులకు వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని అందిస్తాయని ఆమె చెప్పారు. రైతు వి.సురేష్‌తోపాటు సందర్శించిన ఆమె పలు సూచనలు చేశారు.

## టైప్ రైటింగ్ విద్య చారిత్రాత్మకం-ప్రభుత్వ ప్రోత్సాహం పూజ్యం

**-రాష్ట్రంలో శని,ఆదివారాలలో టైప్ పరీక్షలు**

**-2000 సంవత్సరం నుండి భర్తీచేయని టైపిస్టు పోస్టులు**

**రేపల్లె-ప్రభాతవార్త**

శతాబ్దాల చరిత్ర కలిగిన టైప్ రైటింగ్ విద్యకు ప్రభుత్వ ప్రోత్సా హం కొరవడింది.కంప్యూటర్ల రాకతో టైప్ రైటర్ కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.సాంకేతికత వేగంగా మారుతున్నా టైప్ రైటింగ్ నైపుణ్యం విలువ తగ్గకుండా ఆంధ్రప్రదేశ్ టైపు రైటింగ్,షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ ప్రయత్నిస్తోంది.పరీక్షల నిర్వహణాధికారులతో సత్సంబంధాలు కలిగి ఫైళ్ళు,పరీక్షల వ్యవహారంలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా అసోసియేషన్ అడుగులు వేస్తోంది.ప్రపంచంలో టైప్ రైటర్ ఆలోచన 1714 సంవత్సరంలో ప్రారంభమైంది.హెన్రీ మిల్ అనే ఇంజనీర్ తొలి పేటెంట్ తీసుకున్నా ఆచరణలోకి రాలేదు.1868లో షోల్స్ రూపొందించిన షోల్స్ గ్లిడెన్





టైపు రైటర్ వాణిజ్యపరంగా విజయం సాధించిన మోడల్‌గా గుర్తింపు పొందింది.దీనిని లిటరీ పియానో అని పిలుస్తుండేవారు.'కీ'లు నొక్కడం పియానో వాయించడం లాంటిదే కావడంతో క్యూవెర్టీ కీ బోర్డు లేఅవుట్ కూడా అప్పుడే రూపుదిద్దుకుంది.ఒకదానికొకటి కీలు తగిలి జామ్ అవ్వకుండా ఉండేందుకు షోల్స్ ఈ అమరికను రూపొందించారు.ప్రస్తుతం వినియోగిస్తున్న ల్యాప్‌టాప్‌లో వాడుతున్న కీ బోర్డు కూడా క్యూవెర్టీ లేఅవుట్‌నే అనుసరిస్తోంది.150 ఏళ్ళ క్రితం రూపొందించిన డిజైన్ ఇప్పటికీ మనుగడలో ఉంది.1968 జూన్ 23న అమెరికాకు చెందిన క్రిస్టోఫర్ లాథమ్ షోల్స్,కార్లోస్ గ్లిడెన్,శామ్యూల్ సౌల్ తొలి ఆధునిక టైపురైటర్‌కు పేటెంట్ పొందారు.మానవ నాగరికతలో కమ్యూనికేషన్,ఉద్యోగ అవకాశాలు,స్త్రీ సాధికారత ఏ విధంగా మారాయో చెప్పే చారిత్రక సందర్భంగా టైప్ రైటర్ నిలిచింది.

**కంప్యూటర్ ప్రవేశించడానికి ముందు..**

కంప్యూటర్,ప్రింటర్ రాక ముందు ప్రపంచాన్ని నడిపించిన యంత్రం టైపు రైటర్.న్యాయస్థానం నుండి ప్రభుత్వ కార్యాలయాల వరకు,పత్రికా రంగం నుండి సాహిత్యం వరకు ప్రతి చోటా టక్-టక్-టక్ అనే శబ్దం వినిపించేది.ఆ శబ్దం అక్షరాల ముద్ర మాత్రమే కాదు.లక్షల మంది ఆశల ముద్ర అని చెప్పాలి.టైపు రైటర్ రాకతో సమాజ నిర్మాణమే మారింది.అంతకు ముందు చేతి రాత పని,క్లర్కు ఉద్యోగాలు అధిక భాగం పురుషులకే దక్కేవి.టైపు రైటర్ ఆవిర్భావంతో 'టైపిస్ట్' అనే వృత్తి ప్రారంభమైంది.చేతి వేళ్ళ చురుకుదనం,శుభ్రమైన వ్రాత అవసరమైనందున లక్షలాది మంది మహిళలు టైపు రైటర్ రంగంలోకి వచ్చారు.19వ శతాబ్దం చివరి నాటికి అమెరికాలోనే 4 లక్షల మంది మహిళా టైపిస్టులు రంగప్రవేశం చేశారు.ఇది స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన తొలి పెద్ద అడుగు అని చెప్పాలి.టైపిస్ట్ గర్ల్ అనే పదం స్వావలంబనకు చిహ్నంగా మారింది.భారతదేశంలో సైతం 20వ శతాబ్దం తొలినాళ్లలో టైపురైటింగ్ కోర్సులు మహిళా విద్యకు ఊతమిచ్చాయి.ప్రభుత్వ కార్యాలయాలలో పని విధానం మారింది.చేతితో వ్రాసే ఉత్తర్వులు బదులు టైప్ చేసిన ఉత్తర్వులు, ఫైళ్లు సిద్ధం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి.శుభ్రత,ఏకరూపత,వేగం వంటి గుణాలను టైపురైటర్ అలవాటు చేసింది.ఒక పేజీని 10 కాపీలు తీయాలంటే కార్బన్ పేపర్ ఆధారంగా ఒకేసారి టైప్ చేసేవారు.అది అప్పట్లో జిరాక్స్‌తో సమానమే.ఎందరో ప్రసిద్ధ రచయితలు తమ రచనలను టైపురైటర్‌పైనే పూర్తి చేసేవారు.మార్క్ ట్వైన్ అయితే తన "ది అడ్వెంచర్స్ ఆఫ్ టామ్ సాయర్" నవలను టైపురైటర్‌పై టైప్ చేసిన తొలి రచయితగా చరిత్రలో నిలిచారు.ఆర్నెస్ట్ హెమింగ్వే,ఫిట్జ్‌జెరాల్డ్,జార్జ్ ఆర్వెల్ పుస్తకాలు టైపురైటర్‌తోనే అందుబాటులోకి వచ్చాయి.సినిమా రంగంలో టైపురైటర్ ప్రధాన పాత్ర పోషించింది.సినిమాల్లోనూ టైపురైటర్ ఒక భాగమైంది.ఆల్ ది ప్రెసిడెంట్స్ మెన్,ది షైనింగ్ వంటి సినిమాల్లో టైపిస్ట్ శబ్దం టెన్షన్ క్రియేట్ చేసింది.బాలీవుడ్‌లో చిట్టి పాత్రతో టైపురైటర్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చింది.స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయం,కోర్టుల్లో టైపురైటర్ తప్పనిసరైంది.హిందీ,తెలుగు,ఇంగ్లీషు టైపురైటర్లు అందుబాటులోకి వచ్చాయి.గోద్రెజ్,రెమింగ్టన్ కంపెనీల టైపురైటర్లు దశాబ్దాలపాటు రాజ్యమేలాయి.టైపురైటింగ్, షార్ట్‌హ్యాండ్ కోర్సులు లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాయి.స్టెనోగ్రాఫర్, జూనియర్ అసిస్టెంట్,టైపిస్టు పోస్టులకు టైపురైటింగ్,షార్ట్‌హ్యాండ్ అర్హతగా నిలిచాయి.ఒకప్పుడు ఇంట్లో టైపురైటర్ ఉంటే గౌరవంగా భావించేవారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ ప్రతి 6 నెలలకోసారి టైపురైటింగ్,షార్ట్‌హ్యాండ్ పరీక్షలను నిర్వహిస్తోంది.ఇప్పటికీ గ్రూప్-4,జూనియర్ అసిస్టెంట్,కోర్టు స్టెనో పోస్టులకు టైపు రైటింగ్ అర్హతగా నిర్ణయిస్తున్నారు.టైపు రైటర్ ముందు కూర్చుని కీ నొక్కడం,రిబ్బన్ మార్చడం,క్యారేజ్ రిటర్న్ లివర్ లాగడం,మార్జిన్ సెట్ చేయడం ఒక కళ.టైపురైటర్ రిపేర్ చేసే మెకానిక్‌లకు గుర్తింపు ఉండేది.ప్రస్తుతం ల్యాప్‌టాప్ మెకానిక్‌గా టైపురైటర్ మెకానిక్ మారిపోయారు.టైపు ఇన్‌స్టిట్యూట్స్ నిర్వాహకులే టైపు మిషన్ల రిపేర్లను చూసుకుంటున్నారు.

**మారుతున్న టెక్నాలజీ.** కాలానుగుణంగా మారుతున్న టెక్నాలజీని పరిశీలిస్తే పెన్ స్థానంలో టైపురైటర్ వచ్చింది.దీని స్థానంలో కంప్యూటర్ వచ్చింది.కంప్యూటర్ స్థానంలో ఏఐ వస్తోంది. ఏ యంత్రం వచ్చినా మానవుని చేతి వేళ్ళు,మనసు ప్రమేయం లేకుండా పనిచేయలేవనేది వాస్తవం.సాంకేతికత ఎంత ముందుకు సాగినా మూలాలను మరచిపోకూడదు. ప్రతి విద్యార్థి టైపురైటర్ తాకినప్పుడు కీ బోర్డు మాత్రమే కాదని ఒక చరిత్ర,వారసత్వం అని గుర్తించాలి.నైపుణ్యాన్ని విస్మరించకూడదు.ఇప్పటికీ క్రమంచే ప్రతి టైపిస్టును,గురువును గౌరవించాల్సిందే.

**పాతికేళ్లుగా భర్తీకాని టైపిస్ట్ పోస్టులు..** 2000వ సంవత్సరం నుండి గ్రూప్-4లో భాగమైన టైపిస్ట్ పోస్టులు భర్తీ కాలేదని ఆంధ్రప్రదేశ్ టైపురైటింగ్ షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చావలి విజయమోహన్‌రావు చెప్పారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షా 50 వేల మంది విద్యార్థులు టైపు పరీక్షలకు హాజరయ్యేవారని తెలిపారు.ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 10 వేల మంది,తెలంగాణ రాష్ట్రంలో 10 వేల మంది విద్యార్థులు మాత్రమే పరీక్షలకు హాజరయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.కంప్యూటర్ కోర్సు ఉద్యోగానికి టైపురైటింగ్ హైయ్యర్ ఉత్తీర్ణత ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.తెలుగు రాష్ట్రాలలో 5 వేల టైపు ఇనిస్టిట్యూట్స్‌కు బదులు ప్రస్తుతం 400 టైపు ఇనిస్టిట్యూట్స్ మాత్రమే ఉన్నట్లు ఆయన వివరించారు.టైపు రైటింగ్ విద్యను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన సూచించారు.

## మోసపోయిన 72 మంది హజ్ యాత్ర వాలంటీర్లు

**-ఒక్కొక్కరికీ రూ.60 వేలు నష్టం**

రేపల్లె, జూలై 29, ప్రభాతవార్త:మక్కా,మదీనా ప్రాంతాలలో హజ్ వాలంటీర్లుగా పనిచేసేందుకు రూ.60 వేలు వంతున 72 మంది ఢిల్లీకి చెందిన ఆల్ హుదా టూర్ అండ్ సర్వీస్ ఏజంట్ బ్యాంకు ఖాతాకు జమచేసి నష్టపోయిన ఉదంతం వెలుగుచూసింది.ఈ వ్యవహారం పోలీస్ స్టేషన్ వరకు చేరింది.రేపల్లెలోని ప్రభుత్వ ఖాజీ సయ్యద్ తయ్యబ్ అహ్మద్ స్వచ్ఛంద వాలంటీర్‌గా హజ్ యాత్రలో భాగమైన మక్కా,మదీనా ప్రాంతాలలో సేవ చేసేందుకు కుటుంబ సభ్యులతో సహా వెళ్ళేందుకు ఆల్ హుదా టూర్ అండ్ సర్వీస్ ఏజంట్ ముటాక్ సలోమి,అతని కుమారుడు మొహ్మద్ ఇర్ఫాన్‌తో సంప్రదింపులు జరిపాడు.అవసరమైన ఖర్చును చెల్లించాలని తెలుసుకున్నాడు.తాను వాలంటీర్‌గా వెళ్తున్నట్లు తోటివారితో చెప్పడంతో మరో 71 మంది కూడా అంగీకరించారు.వీరంతా ఏజంట్ సూచించిన విధంగా ఇష్టపూర్వకంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,యూనియన్ బ్యాంక్,కెనరా బ్యాంక్‌లలోని మొహ్మద్ ఇర్ఫాన్ ఖాతాకు నగదు చెల్లింపులు జరిపారు.మక్కాకు తీసుకువెళ్ళాల్సిన సమయానికి ఏజంట్ మోసం చేసినట్లు గుర్తించారు.ఢిల్లీలోని కార్యాలయాన్ని మూసివేసి ఏజంట్ పరారైన విషయాన్ని ధృవీకరించుకున్న ఖాజీ సయ్యద్ తయ్యబ్ అహ్మద్ 94/2026 ప్రకారం రేపల్లె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించారు.

## బాలవికాస కేంద్రం ప్రారంభం

రేపల్లె, జూలై 29, ప్రభాతవార్త:మండలంలోని పోటుమెరక పంచాయతీ జలార్తమ్మ కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో బుధవారం బాలవికాస కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు బాలవికాస కేం ద్రం పనిచేసేలా నిర్ణయించారు.పాఠశాలలో విద్యార్థులకిచ్చిన హోంవర్క్ పూర్తిచేయించడం,ప్రార్ధనా గీతాలు,శ్లోకాలు పఠించడం,నేర్పించడంతో పాటు ఆదివారం క్రీడలు నేర్పించాలని బాలవికాస కేంద్రం నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు.

## దస్తావేజు లేఖర్ల వినూత్న ఆందోళన

రేపల్లె, జూలై 29, ప్రభాతవార్త:ప్రభుత్వ ఉత్తర్వు 396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్ డౌన్ కార్యక్రమం బుధవారం 10వ రోజుకు చేరింది.వేరు శనక్కాయలు,టీ విక్రయిస్తూ దస్తావేజు లేఖర్లు వినూత్న ఆందోళన చేశారు.డాక్యుమెంట్ రైటర్స్ సంక్షేమం కోసం ఎన్నికల వాగ్ధానం చేసిన మంత్రి నారా లోకేష్ స్పందించాలని,సబ్ రిజిస్ట్రేషన్ సేవల్లో ప్రైవేటు సంస్థల జోక్యం తగదని నినాదాలు చేశారు.దస్తావేజు లేఖర్ల ఆందోళనకు పట్టణానికి చెందిన ప్రముఖులు కె.శ్రీనివాసరావు, షేక్ ఖాజావలి,పూర్ణ,వినోద్,రాఘువ,షేక్ ఖాజా తదితరులు మద్దతు ప్రకటించారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: పట్టణంలోని సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని శ్రీ షిరిడి సాయిబాబా మందిరాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. షిరిడిలో శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహం వెనుక ఏ విధంగా బంగారు తాపడం ఉంటుందో అదేవిధంగా ఇక్కడ వెండి రేకుపై బంగారు పూతతో ధగధగ మెరిసే విధంగా తీర్చిదిద్దారు . ఇటీవలే షిరిడిలో ఉన్నట్లుగా ఇక్కడ కూడా శ్రీ షిరిడిసాయిబాబా విగ్రహానికి ముందు నందీశ్వరుని ప్రతిష్టించారు. గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ షిరిడి సాయిబాబావారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ షిరిడి సాయినాథున్ని ప్రత్యేకంగా అలంకరించారు. గురుపౌర్ణమి సందర్భంగా బ్యాంకు లాకర్‌లో ఉన్న సుమారు రూ.కోటి విలువ గల బంగారు కిరీటాన్ని బాబాకు అలంకరింపచేశారు. బంగారు కిరీటంలో సాయిబాబా భక్తులకు దర్శనమివ్వడం ప్రత్యేకాకర్షణగా నిలిచింది. భక్తులు తనివీతీరా శ్రీ షిరిడి సాయి నాథున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ రకాల హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీ షిరిడి సాయి సేవా మండలి ఛైర్మన్ సత్రాజు మధుసూధనరావు పర్యవేక్షణలో సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై శ్రద్ధ పెట్టాలి

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్టిలో ఉంచుకొని వరిపైరుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై శ్రద్ధ పెట్టాలని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు సూచించారు. పొన్నూరు, నిడుబ్రోలు పట్టణాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం కాలువల ద్వారా సాగునీరు రానందున వరిసాగు చేపట్టరాదని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉంటాయన్నారు. ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వరిపైరుకు ఎకరాకు రూ.800ప్రీమియం చెల్లించి రూ.40వేల బీమా పొందవచ్చన్నారు. వరి వెదసాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. వచ్చే నెల 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించేవిధంగా చూడాలన్నారు.80శాతం రాయితీపై అపరాల విత్తనాలు ప్రభుత్వం నుంచి అందించడం జరుగుతుందన్నారు. ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, ఏఈవో టి.దివ్యశ్రీ, ఎంపీఈవోలు షేక్ రేష్మ, సింహాద్రి రమేష్‌బాబు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ జె.కళ్యాణి సుధా, రైతులు పాల్గొన్నారు.




## విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి లక్ష్యాలను చేరుకోవాలని ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మునిసిపల్ ప్రత్యేకాధికారి ధీరావత్ దుర్గాబాయి సూచించారు. స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ప్రణాళికాబద్ధంగా అభ్యసిస్తే పదో తరగతిలో మంచి మార్కులు సాధించవచ్చున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, వారి ద్వారా విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠ్యాంశాలను నేర్చుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణను, ఆటస్థలాన్ని, పక్కనే ఉన్న మినీ స్టేడియాన్ని సందర్శించి పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. స్వయంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యతా ప్రమాణాలతో తయారు చేస్తున్నారా..?లేదా..? అనే విషయాలను పరిశీలించారు. ఆహార పదార్థాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్నభోజనం నిర్వాహకులు రుచి, శుచిగా తయారు చేసి వేడిగా పదార్థాలను విద్యార్థులకు అందించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకాధికారి వెంట ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు విచారపు తులసీరాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు మంద్రు జాన్ విల్సన్, శివరామకృష్ణయ్య, ఉమాదేవి తదితరులున్నారు.




## వైకాపా తీర్థం పుచ్చుకున్న మండవ దంపతులు

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మండవ గౌతమ్, లక్ష్మీనీరజ దంపతులు బుధవారం వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ నేతృత్వంలో తాడేపల్లి వైకాపా కేంద్ర కార్యాయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సమక్షంలో వైకాపాలో చేరారు. జగన్మోహనరెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండవ గౌతమ్ గత కొంత కాలంగా టిడిపికి దూరంగా ఉన్నారు. జగన్మోహనరెడ్డి నాయకత్వం, ఆయన సిద్ధాంతాలు, లక్ష్యాలు, ప్రజల పట్ల నిబద్ధతతో కూడిన రాజకీయ ప్రస్థానం నచ్చి వైకాపాలో చేరినట్లు గౌతమ్ దంపతులు చెప్పారు. వైకాపా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సుదీర్ఘకాలం సొసైటీ అధ్యక్షుడిగా, వ్యవసాయ మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడిగా, బూత్ కమిటి అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉందని, ప్రజలతో ఏ విధంగా నడుచుకోవాలో, పార్టీని ఏ విధంగా బలోపేతం చేయాలో అనే విషయాలపై తమకు పూర్తి అవగాహన ఉందని గౌతమ్ చెప్పారు.




## మరమ్మతులు చేయండి మహా ప్రభో!!

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: పట్టణంలోని సాయినగర్, ఆలపాటి సుబ్బారాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో మునిసిపల్ మంచినీటి పైపులైన్ లీకై నీరంతా వృధాగా పోతుంది. ఈ ప్రాంతంలో మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రతి నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతుంటారు. అయినప్పటికీ మంచినీటి పైపు లీకును అరికట్టాలనే ఆలోచన రాకపోవడం శోచనీయమని పలువురు అంటున్నారు. అసలే వర్షాభావ పరిస్థితులతో నీటికి కరవు వచ్చే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి మంచినీటి పైపులైన్ లీకులను అరికట్టాలని ప్రజానీకం కోరుతున్నారు.



## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: పట్టణంలోని తెలగపాలెం సద్గురు శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబావారికి కాకడ హారతి, పంచామృత అభిషేకము, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిగీతాల ఆలపన జరిగింది. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఓం సాయి...శ్రీ సాయి...జయ జయ సాయి....అనే భక్తుల నినాదాలతో తెలగపాలెం మార్మోగిపోయింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేకాలంకరణలో బాబావారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మందిరం కమిటి అధ్యక్ష, కార్యదర్శులు చక్కా శ్రీనివాసరావు, యరసాని సరిత నేతృత్వంలో సభ్యులు తోట పద్మావతి, డైరెక్టర్ యక్కటి హనుమాన్ ప్రసాద్, కొండపల్లి శ్రీనివాసరావు, పసుపులేటి వేణు, తాళ్ళూరి ఉష, బడే పద్మజ, తోట అంకమ్మరావు, తోట ఆదినారాయణ, శెట్టి లింగేశ్వరరావు, ఆకుల ప్రసాదు, కొత్తమాసు సుధ, షేక్ బాబావలి, బాలాజీకుమార్‌లు ఏర్పాట్లు చేశారు.



## రోడ్డు ప్రమాదంలో ఎల్ఐసి ఏజంట్ దుర్మరణం



రేపల్లె, జూలై 29, ప్రభాతవార్త:రేపల్లె పట్టణం నుంచి కృష్ణా జిల్లాలోని వాడపల్లికి వెళ్తుండగా బుధవారం మచిలీపట్నం వద్ద ఆగి ఉన్న లారీని టెంపో వాహనం ఢీకొనడంతో రేపల్లెకు చెందిన ఆడిటర్,ఎల్ఐసి ఏజంట్ తూనుగుంట్ల వెంకటరమణ మృతి చెందారు.మరో 11 మంది గాయపడ్డారు.వాడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించుకునేందుకు భక్తులు తరలి వెళ్ళారు.అయితే వీరు ప్రయాణిస్తున్న వాహనం మచిలీపట్నం హైవేలో ప్రమాదానికి గురైంది.మచిలీపట్నం వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం ఆయన సోదరుడు అనగాని శివప్రసాద్,తెదేపా నాయకులు పరామర్శించి వచ్చారు.వెంకటరమణ మృతికి సంతాపం ప్రకటించారు.

## పాస్టర్లకు బ్యాగులు కానుకలు అందించిన ఆర్ఈఐ సంస్థ

తెనాలి జులై29(ప్రభాతవార్త): స్థానిక ఐతానగర్ లోని పాడిసన్ పేటలో గల దివంగత బిషప్ గద్దం థామస్ ప్రాంగణంలో ఆర్ఈఐ సంస్థ అధినేత బిషప్ సాదు తామస్ జూనియర్ సేవకుల సమావేశాన్ని నిర్వహించారు. బుధ వారం నిర్వహించిన సమావేశంలో తొలుత దేవుని గీతాలపనలు,వాక్య పరిచర్య,ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సమావేశంలో డిస్టర్బ్ గద్దం సాదు తామస్ జూనియర్ మాట్లాడుతూ ఆర్ఈఐ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేక పట్టణాలు గ్రామాల్లో పలు సమాజహిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్థ కార్యక్రమాలకు సహకరిస్తున్న సేవకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరైన సుమారు 100 మంది పాస్టర్లకు బ్యాగులు ప్రత్యేక కానుకలు సాధు తామస్ జూనియర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ నాయకులు కోళ్లపూడి రాజు పాల్గొనగా సంస్థ సిబ్బంది పట్టణానికి చెందిన పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఏడోరోజుకు చేరిన ఆర్టీసి ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

తెనాలి మున్సిపాలిటీ జులై29(ప్రభాతవార్త): తెనాలి ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు బుధవారం ఏడవ రోజుకు చేరుకున్నాయి. డిపో మేనేజర్ ఉద్యోగులను వేధిస్తున్నారని అకారణంగా పనిష్మెంట్లు విధిస్తూ ఉద్యోగులపై నిరంకుశ ధోరణి చూపిస్తున్నారని ఆరోపిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు గత ఆరు రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షకు బుధవారం పలు సంఘాలు మద్దతు పలికాయి. రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావంగా, ఎమ్మార్పీఎస్ నాయకులు, జై భీమ్ ఫెడరేషన్, బిజేఆర్ కమిటీ నాయకులు ,దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. డిపో మేనేజర్ తన నిరంకుశ తత్వాన్ని వీడి ఉద్యోగులపై తన ప్రవర్తన మార్చుకోవాలని ఉద్యోగులను వేధించటం వారిపై అధిక పని భారం మోపి వారిని మానసికంగా ఇబ్బందులకు గురి చేయటంని మానుకోకపోతే ఉద్యోగ సంఘాల నాయకులు తమ ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కె.సురేష్,ఆర్.చిన్నా, మోహన్ రావు,టి. ప్రసాదరావు,వి. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరాలయంలో వరుణయాగం

తెనాలి మున్సిపాలిటీ జులై29(ప్రభాతవార్త): తెనాలి పట్టణం గంగానమ్మపేటలో వేంచేసిన శ్రీ పర్వత వర్ధని సమేత శ్రీ రామేశ్వర స్వామి దేవస్థానం (పాత శివాలయం)నందు బుధవారం వరుణ యాగం, హోమం,జలాదివాసం నిర్వహించారు.ఆషాడ మాసం వచ్చినా వర్షాలు పడకపోవడం,పంటలకు కావలసినంతగా వర్షాలు కురవక రైతులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా,దేవాదాయశాఖ వారి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా స్థానిక గంగానమ్మపేటలోని పాత శివాలయం నందు పేద పండితుల ఆధ్వర్యంలో వరుణుడి కోసం వరుణ యాగం అలాగే జలాధివాసం హోమాలు ఎంతో వైభవంగా వేదమంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి రమణ కుమారి మాట్లాడుతూ,వర్షాకాలం వచ్చినా వర్షాలు కురవకపోవటంపై దేవాదాయశాఖ వారి ఆదేశాల మేరకు శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామేశ్వర స్వామి వారి దేవస్థానం నందు బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో, వరుణ యాగం,వరుణ హోమం,జలాధివాసం కార్యక్రమాలను ఎంతో నిష్టతో,ఎంతో వైభవంగా నిర్వహించామన్నారు. ప్రజలు రైతులు సుభిక్షంగా ఉండాలంటే వర్షాలు కురవాలని,వర్షాలు కురిస్తేనే ప్రజలు,రైతులు సుఖ సంతోషాలతో జీవిస్తారని, జలం లేనిదే మనుగడ లేదని,పంటలు సమృద్ధిగా పండాలంటే వర్షాలు ఎంతో ముఖ్యమని కావున వర్షాలు పడి ప్రజలు రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రజలందరూ సుభిక్షంగా జీవించాలని కోరుకుంటూ లోక కళ్యాణార్థం ఈ వరుణ యాగాలు,జపాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





## నిత్యనూతన నిరంతర కవి డాక్టర్ సినారె

గుంటూరు కల్చరల్,జూలై 29,ప్రభాతవార్త : ఆధునికాంధ్ర కవుల్లో నిత్యనూతన కవి నిరంతర కవి,సాంప్రదాయాన్ని జీర్ణించుకున్న అభ్యుదయ కవి డాక్టర్ సి నారాయణరెడ్డి అని అవగాహన మనమూ పాడుదాం రండి బృందసభ్యుల ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో కవులు,కళాకారులు,గాయకులు నివాళులర్పించారు.స్థానిక సంస్థ కార్యాలయంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది.కార్యక్రమవలో కళాసౌధ అధ్యక్షుడు బిళ్ళా అశోక్ మాట్లాడుతూ బహుభాషాకోవిదుడు,మహాకవి సాహితీ శిఖరం,తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప పరిశోధకుడు,విమర్శకుడు డాక్టర్ సినారె అన్నారు.ప్రముఖ కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 1988లో దేశంలోనే అత్యున్నత సాహితీ పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డు సినారె విశ్వంభర కావ్యానికి లభించిందన్నారు.కేంద్రప్రభుత్వం పద్మశ్రీ,పద్మభూషణ్ అవార్డులతో గౌరవించిందన్నారు.ఆయన సుమారు 3500సినీగీతాలు సరళ సుందరమైన శైలిలో రాశారన్నారు.జీవితాంతం అనేక రచనలు చేశారని వేలాది సాహితీప్రసంగాల్లో శ్రోతలను అలరించారన్నారు.కార్యక్రమంలో కవి బి.జమదగ్ని గాయనీ గాయకులు కృష్ణప్రసాద్,విజయలక్ష్మి,రాజేశ్వరీదేవి ,రజని తదితరులు గీతాలు ఆలాపించారు.

## జస్టిస్ ఆర్ట్ గేలరీ ప్రారంభం


గుంటూరు కల్చరల్,జూలై 29,ప్రభాతవార్త : స్థానిక బ్రాడిపేటలోని పోలిశెట్టి కాంప్లెక్స్‌లో ఆర్ట్ గేలరీ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవిచే ప్రారంభమైంది.ఈ సందర్భంగా గల్లా మాధవి జస్టిస్ చిత్రించి ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను పరికించి ప్రశంసించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీతకు తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు.ఆర్ట్ గేలరీ ప్రారంభోత్సవానికి కాంప్లెక్స్ అధిపతి పోలిశెట్టి రాంబాబు,డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్,జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు ముద్దు వెంకటస్వామి,మాతంగి సాంబశివరావు,లామ్ వర్ధనరావు,ముద్దు అరుణకుమారి,సుధీర్,మల్లేశ్వరరావు,చిత్రకారులు,కళాకారులు పాల్గొని జస్టిస్ ను ప్రశంసించారు.

## గోవు గౌరవ పిలుపు ఉద్యమం

గుంటూరు కల్చరల్,జూలై 29,ప్రభాతవార్త : స్థానిక నెహ్రూనగర్‌లోని గోసంరక్షణ సంఘంలో నవకార్ మంత్రం,రామకృష్ణుల నామస్మరణ జరిగాయి.గోవులను పూజించి పరేడ్ గ్రౌండ్ నుంచి ర్యాలీతో ప్రారంభమైంది.దీనికి పెద్దసంఖ్యలో గోభక్తులు హాజరయ్యారు.గో భక్తులందరూ సంగీత వాయిద్యాల మధ్య గోవులను కీర్తిస్తూ పాటలు పాడుతూ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు.అక్కడ, గోవుల భక్తులందరూ కలెక్టర్‌ను కలసి 2,27,934మంది భక్తులు సంతకాలు చేసిన ఒక పెన్-డ్రైవ్‌ను (సుమారు 4254పేజలు) సమర్పించి,రాష్ట్రపతి-ప్రధానమంత్రి సహా ఈ లేఖను ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు మరియు ముఖ్యమంత్రికి పంపాల్సిందిగా కలెక్టర్‌ను అభ్యర్థించారు.గో భక్తులందరి అభ్యర్థన ఒక్కటే,భారతదేశం అంతటా గోవధ నిషేద నియమాన్ని అమలు చేయాలని మరియు గోమాతకు జాతిమాత హోదాను ఇవ్వాలని వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు.కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సంఘం స్టేట్ వైస్ చైర్మన్ బి.శివరావు,సీనియర్ న్యాయవాది మరియు సలహాదారులు శ్రీహరిహరరాయల్,గుంటూరు గోసంరక్షణ సంఘం అధ్యక్షులు మహావీర్ చంద్ సాలేచా,ఉపాధ్యక్షుడు శాంతిలాల్ చోప్రా,కోశాధ్యక్షులు చంపాలాల్ భండారి,సహకోశాధ్యక్షులు సందీప్ భండారి,భీకారామ్, కమిటీ సభ్యులు దినేష్‌కుమార్,శైలేష్‌కుమార్,ఆశ్రమం అమ్మగారు,సింఘి కైలాష్‌కుమార్,చగనా రామ్ ప్రజాపత్,విశ్రాంత డిఎస్పీ చలపతిరావు,ఇతర గణమాన్య గోభక్తులు పాల్గొన్నారు.

## సుపరిపాలన అందిస్తున్న ఘనత కూటమిదే

పొన్నూరు, జూలై 29,ప్రభాతవార్త: రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్ అన్నారు. టిడిపి ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 5వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షేక్ బాజిసాహెబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి సూపర్ హిట్‌గా పేరు తెచ్చుకొందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలనే కాక, ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ప్రజలు కూడా మంచి చేసే ప్రభుత్వానికే పట్టం కట్టేవిధంగా ఆలోచన చేయాలని బాజిసాహెబ్ కోరారు. ఈ కార్యక్రమంలో హమీద్, లాయర్ కరీముల్లా, గఫార్ మేస్త్రీ, గౌస్, మాజీ కౌన్సిలర్ షేక్ జానీబాషా, కిరణ్‌కుమార్, నిజాముద్దీన్, షారిపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## కాకాని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన ఉత్తర ప్రదేశ్ చీఫ్ సెక్రటరీ

ప్రత్తిపాడు, జూలై 29, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా, పొన్నూరు నియోజకవర్గం, పెదకాకాని మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రాన్ని ఉత్తర ప్రదేశ్ ట్రాన్స్ఫర్మేషన్ చీఫ్ సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ బృంద సభ్యులు బుధవారం సందర్శించారు. ఏపీఏ ఐఎంయస్ 2.0 యాప్ యొక్క పనితీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడిఏ ఎన్.మోహన్రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ చీఫ్ సెక్రటరీ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులుతో యాప్ యొక్క పనితీరును, దాని వలన ఎన్ని



లాభాలు ఉన్నయో తెలుసుకున్నారు. తర్వాత ఏపీ ఏ ఐఎంఎస్ యాప్లో అన్ని విషయాలను రైతులతో చర్చించారు. ఈ యాప్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకోసం ప్రవేశ పెట్టటం చాలా బాగుందన్నారు. ఈ యాప్ ద్వారా వ్యవసాయ సమాచారం, వాతావరణ పరిస్థితులు తెలుసుకోవచ్చునని, విస్తీర్ణం వారీగా, పంటల వారీగా ఎరువులు తీసుకొనుటకు, రైతులు సైంటిస్టుల ద్వారా వివిధ పంటల చీడపీడల గురించి తగు సూచనలు తెలుసుకోవచ్చునని, మరియు రైతులు వ్యవసాయ పనిముట్లు కూడా బుక్ చేసికొనుటకు ఉపయోగపడుతుంది రైతులు యూపీ సీఎస్ కు వివరించారు. అలాగే ఒక్కొక్క రైతుకి ఎరువులు ఎంత మోతాదులో రైతులు సాగుచేసే విస్తీర్ణంబట్టి ఎరువుల వివరాలు, యూరియా 20 రోజులు తేడాతో 3 దఫాలుగా రైతులకు అందుతుందని తెలియజేశారు. ఉత్తర ప్రదేశ్ చీఫ్ సెక్రటరీ రైతు సేవా కేంద్రం విఏఏ ద్వారా యాప్ గురించి సవివరంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ బ్యాంకు అధికారులు అజిత్, యోగేష్, హెచ్ఓడి రమణ, వస్సార్ లాబ్స్ శర్మ, ఆయుష్ దుబె, ఏపీఏ ఐఎంఎస్ యాప్ ప్రాజెక్ట్ మేనేజర్స్ రూపకుమార్, సజ్జనే మాథ్యూ, రోహిత్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, జెడ్బిఎన్ఎఫ్ స్టాఫ్, ఆదర్శ రైతులు శ్రీకాంత్, శ్రీనివాసరావు, రాజేష్, వేణు, సాంబశివరావులతో పాటు, మండల వ్యవసాయ అధికారి రమణ కుమార్, స్థానిక రైతు సోదరులు పాల్గొన్నారు.

## కష్టాలను అధిగమించి సంకల్ప బలంతో ఉన్నత స్థితికి చేరాలి..

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 29, ప్రభాతవార్త : సమాజంలోని మధ్యతరగతి కుటుంబీకులు కష్టాలను అధిగమించి సంకల్ప బలంతో ఉన్నత స్థితికి చేరాలని థింక్ సభియో ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, ప్రముఖ పారిశ్రామికవేత్త మరియు మెంటార్ సాయిరాం యేరువ పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వివిధ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రైజ్ బియాండ్ లిమిట్స్ ది పవర్ వితిన్ అనే అంశంపై రెండు రోజుల ప్రేరణాత్మక పరస్పర అవగాహన



ముగింపు సదస్సు డాక్టర్ అబ్దుల్ కలాం సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త మరియు మెంటార్ సాయిరామ్ యేరువ హాజరై మాట్లాడుతూ..మధ్య తరగతి కుటుంబాల్లో ఉన్న ప్రతికూల కష్టాలను అధిగమించి సంకల్ప బలంతో ఉన్నత స్థితికి చేరాలన్నారు. ఓటమి అనుభవాలతోనే గెలుపు సాధ్యమని వివరించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గ్రామాన్ని, అక్షర జ్ఞానం నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. విద్యార్థులు తమలో ఉన్న నాయకత్వ లక్షణాలను, అంతర్గత శక్తులను ఏవిధంగా గుర్తించాలో తెలియజేశారు. అధునాతన సాంకేతిక ప్రపంచంలో సరికొత్త అవకాశాలను ఎలా అందుకోవాలో ఉదాహరణలతో వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ..విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా సమాజంలో వర్తించే నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, ఇలాంటి మోటివేషనల్ సదస్సులు మీ భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ..సాంకేతిక విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, పారిశ్రామిక ఆలోచనా దృక్పథం పెంపొందించుకోవడమే నిజమైన విజయానికి మార్గమని, విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, వివిధ శాఖల హెచ్ఓడీలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని చదువుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ చేయూత

అచ్చంపేట జులై 29 (ప్రభాత వార్త): ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోకూడదనే ఉద్దేశంతో స్నేహహస్తాలు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్.వి.ఎన్. ప్రసాద్ అన్నారు. స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన విద్యార్థిని పరిటాల



హేమలతకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రిన్సిపల్ ఆర్.వి.ఎన్. ప్రసాద్ చేతుల మీదుగా ఆమెకు చెక్కును అందించారు. హేమలత గుంటూరులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (ఐటీ) ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమె హాస్టల్ ఫీజు నిమిత్తం ఫౌండేషన్ రూ.20 వేల సహాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించడంతో పాటు, అవసరంలో ఉన్న వారి చదువు ఆపకుండా ఫౌండేషన్ చేయూతనివ్వడం సంతోషకరమన్నారు. సహాయం పొందిన విద్యార్థిని ఉద్యోగం సాధించిన అనంతరం స్నేహహస్తాలు ఫౌండేషన్‌తో కలిసి మరికొందరు పేద విద్యార్థులకు చేయూతనివ్వాలని సూచించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకుడు ఖాసీ నాయక్, కామర్స్ అధ్యాపకుడు పున్నయ్య, స్నేహహస్తాలు ఫౌండేషన్ కోఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

## మినుము, పెసర పంటలనే సాగు చేసుకోవాలి

కాకుమాను జూలై 29 (ప్రభాత వార్త): ప్రస్తుత వర్షా భావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వి. సుధాకర్ రైతులకు తెలియచేశారు. బుధవారం మండలంలోని బోడిపాలెం , కొమ్మపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



రైతులకు వారు మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి పంట వేయకుండా తక్కువ కాలపరిమితి గల మినుము పెసర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు కావలసిన ఎరువులు మండలంలోని ప్రతి ఒక్క రైతు సేవా కేంద్రంలో ఉన్నాయి. మినుము పంటకు పసల బీమా యోజన క్రింద ఎకరాకు 200/కట్టుకోవచ్చని రైతులు తెలియజేశారు. ఈ అవకాశం జూలై 31వ తేదీ వరకు ఉందని తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్ మరియు రైతులు పాల్గొన్నారు

## బీసీ హక్కుల సాధనకై జెన్ జీ తరహా యువజనోద్యమం నిర్మించాలి

మంగళగిరి, జులై 29, ప్రభాతవార్త : నేటి యువత లో కొంత భాగం దురలవాట్లతో నిర్వీర్యమవుతున్న తరుణంలో, వారిని సన్మార్గంలో నడిపించే బాధ్యతను స్వీకరించి, బీసీ హక్కుల సాధనకై జెన్ జీ తరహా యువజనోద్యమ నిర్మాణానికి నడుం బిగించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు యువతకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర యువజన కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఎంపికైన గుంటూరు వాసి దేవళ్ళ వెంకట్ కు నియామక పత్రాన్ని రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ నాయకత్వంలో వారు సమర్పించారు. ఈ



సందర్భంగా కేసన మీడియాతో మాట్లాడుతూ గంజాయి కొకైన్,డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలైన కొందరు యువకులు తమ కుటుంబాలకు సమాజానికి భారమై పోతున్నారన్నారు. దేవళ్ళ నాయకత్వంలోని రాష్ట్ర కమిటీ అన్ని జిల్లాలు నియోజకవర్గాలు మండలాలలో యువజన కమిటీలను ఏర్పరిచి, దురలవాట్లకు వ్యతిరేకంగా యువజనులను చైతన్య పరుస్తూ, గ్రామ గ్రామాన బీసీ జెండాలు ఎగరేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ యువజన విభాగం తమ యువజనుల అవసరాలు ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తూనే, బీసీ 139 కులాల ప్రజలందరి సంక్షేమాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయరాష్ట్ర కమిటీలు పిలుపులను స్వీకరిస్తూ, అన్ని జిల్లాలలో యువజనోద్యమ కార్యాచరణను రూపొందించి పోరాటాలకు సిద్ధపడాలన్నారు. అనంతరం నూతన యువజన కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవళ్ళ వెంకట్ ను ఘనంగా సన్మానించుకున్నారు. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ ,రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్ , రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాలాజీ, ఉద్యోగ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గుంటుపల్లి ఉమామహేశ్వర రావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్, గుంటూరు జిల్లా యువజన నాయకులు ఆలా శివాజీ, తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపర షిర్డినగర్‌లో కనులపండువగా గురుపౌర్ణమి మహోత్సవాలు

షిర్డినగర్ (కొల్లిపర) జూలై 29 ప్రభాతవార్త: మండల కేంద్రం కొల్లిపరలోని షిర్డినగర్‌లో వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి.దీనిలో భాగంగా గురుపౌర్ణమి పర్వదిన సందర్భంగా బుధవారం ఉదయం స్వామివారికి అర్చకులు కొల్లిపర కుమారస్వామి,కొల్లిపర కుటుంబరావు మహాగణపతి పూజ కార్యక్రమం చేపట్టారు.అఖండ సాయినామ ఏకాహం ముగింపు కార్యక్రమం జరిగింది.అఖండ శత ఘటాభిషేకం,శ్రీసాయి సహస్ర నామార్చన



వంటి పూజలు జరిగాయి.శ్రీసాయి సత్య వ్రత కల్పము మహిళలు చేపట్టారు.భక్తులు స్వామి వారి ఊయలసేవలో పాల్గొన్నారు. సుమారు 126 మంది మహిళలు సామూహికంగా వ్రతాన్ని నిర్వహించారు.వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చిన వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు బాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేసారు.అనంతరం ట్రాక్టర్‌పై సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.కార్యక్రమాన్ని ఆలయకమిటీ సభ్యులు గుదిబండి చిన వెంకటరెడ్డి,జొన్నల అమ్మిరెడ్డి,అవుతు కృష్ణారెడ్డి,కూరపాటి రవిశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.దూర ప్రాంతాల నుండి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.భక్తులు పవిత్ర శ్రీ గురు చరిత్ర పారాయణం సప్తహం నిర్వహించారు.ఆలయం విద్యుత్ కాంతులతో దగదగ మెరిసింది.భజన సమాజం వారు శ్రీసాయి నామంతో హోరెత్తించారు.ఇదే విధంగా మండలంలోని వల్లభాపురం మున్నంగి,పిడపర్తిపాలెం, తూములూరు,శిరిపురం గ్రామాల్లోని సాయిబాబా మందిరాలలో గురుపౌర్ణమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

## ప్రభుత్వం కార్మికులను పట్టించుకోకపోవటం శోచనీయం

కొల్లిపర,జూలై 29 ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవటం శోచనీయమని సీఐటీయూ జిల్లా నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు.బుధవారం మండల కేంద్రం కొల్లిపర పంచాయతీ కార్యాలయం ఆవరణలో పంచాయతీ



కార్మికులను పర్మినెంట్ చేయాలని..టెండర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పంచాయతీ కార్మికులతో కలసి ఆయన నిరసన చేసారు.ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా 1 వ తేదీనే జీతాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు అందరూ తమ కోర్కెలు సాధించుకోవటానికి గురువారం కలెక్టర్ కార్యాలయానికి తరలి రావాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఊళ్ళపల్లి రామయ్య,షేక్ అజారుద్దీన్,మల్లెల రమేష్,గోదా ఏసుపాదం,మల్లో కుమారి,సుజాత,కొల్లిపర కోటేశ్వరరావు,ఏ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితిని బట్టి రైతులు పంటలు ఎంచుకోవాలి

చెరుకుపల్లి, జూలై 29, ప్రభాతవార్త : రైతులు ఆగస్టు 15 తర్వాత వాతావరణ పరిస్థితిని బట్టి వరి సాగు చేపట్టాలని బాపట్ల వ్యవసాయ పరిశోధనా అధికారిని కే మృదుల అన్నారు. చెరుకుపల్లి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గూడవల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## ఎండ్రాయిలో వేద పాఠశాల విద్యార్థులు ఇద్దరు మృతి

అమరావతి, జూలై 29, ప్రభాతవార్త : ఎండ్రాయిలోని వేద పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. కారణాలు తెలియరాలేదు.

## ఎల్ యూనివర్సిటీలో మనో మార్గదర్శక్ మానసిక ఆరోగ్య అవగాహన సదస్సు

తాడేపల్లి, జులై 29, ప్రభాతవార్త.ప్రపంచ సైకాలజీ డే సందర్భంగా కెఎల్ యూనివర్సిటీలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఖిమనో మార్గదర్శక్ఖి పేరుతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను గుర్తించడం, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై నిపుణులు వివరించారు. కెఎల్ ఉమెన్ డెవలప్ మెంట్ సెల్ అద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లోని సైకాలజీ విభాగానికి చెందిన ఆచార్యురాలు డాక్టర్ టి. డి. విమల



ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు తమ మానసిక ఆరోగ్యంపైనా సమానంగా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలు మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, స్నేహితులతో తమ భావాలను పంచుకోవడం, అవసరమైతే కౌన్సెలింగ్ సేవలను వినియోగించుకోవడం ఎంతో ఉపయోగకరమని సూచించారు. సదస్సులో విద్యార్థులకు ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం, యోగా, సమయపాలన, సానుకూల ఆలోచనా విధానం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించారు. మానసిక సమస్యలను దాచిపెట్టకుండా ధైర్యంగా సహాయం కోరడం బలహీనత కాదని, అది బాధ్యతాయుతమైన నిర్ణయమని నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆసక్తిగా ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్, ఎఫ్ ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, ప్రిన్సిపల్ డాక్టర్ వి. కృష్ణా రెడ్డి, విద్యార్ధి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

## మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు

పెద్దకూరపాడు, జులై 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని కంభంపాడు గ్రామంలో ఎమ్మెల నాగరాజు ఉషారాణి కి కలిగిన ఇద్దరు కుమార్తెలకు మెదడు సంబంధిత జన్యు పరమైన లోపంతో తీవ్రమైన అనారోగ్యం బాధపడుతున్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ని కలిసి తమ ఆవేదన వారికి వినిపించాలంటూ నాగరాజు కుటుంబం రోదనతో విన్నవించుకుంది.మూడు, నాలుగు సంవత్సరాలుగా వైద్య చికిత్స కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నాగరాజు కుటుంబం తెలిపింది. పిల్లల చికిత్స కోసం ఆస్తులు తాకట్టు పెట్టి, కొంత ఆస్తి విక్రయించామని అప్పుల బాధతో సతమతమవుతున్నామని వారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు ఆ చిన్నారులకు



లేవని అన్నారు. ఇంగ్లీష్ మందులు పనిచేయక ఆయుర్వేదం మందులను ఆశ్రయించాల్సి వచ్చింది అన్నారు. వైద్య ఖర్చులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, నియోజకవర్గ ఎమ్మెల్యే అధికారికంగా మా సమస్యను గుర్తించి లెటర్ ఇస్తే సీఎం ఆఫీసులో కలిసి తమ సమస్యను విన్నవించి సీఎం రిలీఫ్ ఫండ్ లేదా వ్యక్తిగతంగా సహాయం పొందుతామని అందుకు ఎమ్మెల్యేని కలిసేందుకు అవకాశం కల్పించాలని నాగరాజు కుటుంబం విజ్ఞప్తి చేశారు. పిల్లలకు మెరుగైన వైద్యం, పునరావాసం కల్పించాలని కుటుంబ సభ్యులు అభ్యర్థించారు. తమ కుటుంబాన్ని ఆదుకుని పిల్లలకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు. దాతలు, ప్రజాప్రతినిధులు స్పందించి సహాయం చేయాలని గ్రామస్తుల విజ్ఞప్తి చేశారు.

## పెదవడ్లపూడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు

మంగళగిరి, జూలై 29, ప్రభాతవార్త: పెదవడ్లపూడి సత్య శిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుండే శ్రీ సాయి బాబా వారికి పూజలు



ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఎన్నారై లు గోగినేని శివరామకృష్ణ, నాదెండ్ల గంగాధర్, ప్రముఖ సినీ నిర్మాత ఘంటమనేని ఆదిశేషగిరిరావు సతీమణి లలితా ప్రమీల, ఇతర ప్రముఖులు శ్రీ సాయిబాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పాతూరు నాగభూషణం కుటుంబ సభ్యులు, పాతూరు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నే శరత్ బాబు, గడ్డిపాటి సాంబశివరావు, చిల్లపల్లి కిరణ్, ఏళ్ల ప్రవీణ్, ప్రసాద్, మన్నవ అప్పారావు, ఆలయ కార్య నిర్వాహక అధికారి జవ్వాది సుబ్బారావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నగరం, జూలై 29, ప్రభాతవార్త: నేటి విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎండి. నాగుర్ మీరా అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆర్ డి ఎస్ ఎస్ స్కీం క్రింద 33 రేజు లైన్ ఉల్లిపాలెం నుండి నగరం వరకు నూతనముగా లైన్ నిర్మాణం చేయుటం వలన నగరం మండలంలోని నగరం ,సజ్జవారిపాలెం, చిరకాలవారిపాలెం, పమిడిమర్రు, కొలగానివారిపాలెం, వెలమవారిపాలెం, ఏలేటిపాలెం, బెల్లంవారిపాలెం, బోరమాదిగపల్లి, వెనిగళ్లవారిపాలెం, ధూళిపూడి, పీటావారిపాలెం, అద్దంకివారిపాలెం, తోటపల్లి, జిల్లేపల్లి మరియు పెద్దవరం గ్రామాలలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు గమనించవలసిందిగా కోరారు.

## 500 జనాభా కలిగిన గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలి

అచ్చంపేట జూలై 29 (ప్రభాత వార్త): అచ్చంపేట మండల పరిధిలోని కంచుపాడు తండా, జడపల్లి తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా గుర్తించాలని తండావాసులు కోరారు. ఈ మేరకు డీపీఓ నాగేశ్వరరావు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. 500కు పైగా జనాభా కలిగిన గిరిజన



తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా గుర్తించి, తండాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్థానికంగా జరిగే పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్లను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. స్వాతంత్రం వచ్చి దాదాపు 80 ఏళ్లు గడుస్తున్నప్పటికీ తమ తండాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తండాల్లో విద్య, వైద్యం, రవాణా, పారిశుద్ధం తదితర మోలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్యేక గ్రామపంచాయతీలుగా గుర్తించడం ద్వారా తండాల అభివృద్ధికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని తండావాసులు పేర్కొన్నారు.

## టీటీడీ దర్శన టిక్కెట్లు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు


గురజాల, జూలై 29 ప్రభాతవార్త : గురజాల పట్టణానికి చెందిన వంకాయల అక్షయ్‌కుమార్ టీటీడీ శ్రీవారి దర్శన టిక్కెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి కొంత మంది వ్యక్తుల వద్ద నుంచి డబ్బులు తీసుకొని టిక్కెట్లు ఇప్పించకుండా పలుమార్లు తప్పుడు హామీలు ఇస్తూ తప్పించుకొని తిరుగుతూ మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులు రావడంతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ పోలీసులు తెలిపారు. టీటీడీ దర్శన టిక్కెట్లు, ప్రభుత్వ సేవలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి నగదు చెల్లించే ముందే వారి విశ్వసనీయతను నిర్ధారించుకోవాలన్నారు. మోసపూరిత సంఘటనలు ఎదురైతే వెంటనే సమీప పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాలని గురజాల పోలీసులు సూచించారు.

## గురుపౌర్ణమికి పోటెత్తిన భక్తులు

చెరుకుపల్లి, జూలై 29, ప్రభాతవార్త : గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన చెరుకుపల్లి ,గుల్లపల్లి, ఆరంబాక ,గూడవల్లి గ్రామాల్లోని బాబా ఆలయాల్లో తెల్లవారుజామున భక్తులు పాల్గొని బాబాకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు జరిపారు.

## ద్వారకామాయి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు


మంగళగిరి, జూలై 29, ప్రభాతవార్త: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని ద్వారకామాయి సాయిబాబా ఆలయంలో నాగళ్ళ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున శ్రీ సాయిబాబాకు కాకడ హారతి సమర్పించి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని



సాయినాథుని ఆశీస్సులు పొందారు.వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ, గురుపౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుకు అంకితమైన అత్యంత పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. గురువును దైవస్వరూపంగా భావించి ఆరాధించడం భారతీయ సంప్రదాయ గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. సుమారు మూడువేల మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో యేళ్ళ శివరామయ్య, మొద్దుకూరి రమేష్, శివచారని, కమల, హిమజ, సీతారత్నం, కరుణ, తార, శాంతి, డా. కోదండరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖర్ల నిరవధిక నిరసన

పెదకూరపాడు,జూలై 29, ప్రభాతవార్త: జీవో నెంబరు 396ను వెంటనే ఉపసంహకరించుకోవాలని డిమాండ్ చేస్తూ పెదకూరపాడు సబ్ రిజిస్టార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు బుధవారం నిరసన తెలిపారు. దస్తావేజు తయారీ విధానాన్ని రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగించే జీవో నెం. 396ను వెంటనే ఉపసంహరించుకుని, తమ జీవనోపాధిని




కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల క్రయ విక్రయాల్లో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎన్నో ఏళ్లుగా దస్తావేజులేఖర్లుగా జీవనోపాధి పొందుతున్న తమ కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. తమ ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నిరసనలో దస్తావేజు లేఖర్లు మద్దినేని సత్యం, కోట మోహన్, షేక్ జానీ, బత్తుల సాయి, దాసరి తరుణ్, కాకుమాను శ్రీహరి, సుబ్బారావు, లేఖరి సహాయకులు, డీటీపీ ఆపరేటర్లు, స్టాండ్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి యోగాశ్రమం లో ఘనంగా గురుపూజోత్సవ వేడుక.

అమరావతి , జూలై 29, ప్రభాతవార్త: యోగాశ్రమమునందు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కారులు పీసపాటి నాగేశ్వరశర్మ పాల్గొని మాట్లాడుతూ సృష్టి, స్థితి, లయ కారకులైన బ్రహ్మ,



విష్ణు, మహేశ్వరులతో గురువును పోలుస్తూ, ఆ పరబ్రహ్మ స్వరూపమే గురువు అని మన పురాణాలు చెబుతున్నాయి అని అన్నారు. ఈ భూలోకంలో ప్రతి ఒక్కరికి గురువే ప్రత్యక్ష దైవ సమానుడు అని గురు పరంపరను మనం కొనసాగించాలని వక్తలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ శనగవరపు రామమోహన్ శర్మ, వారణాసి వెంకటేశ్వరశర్మ, మాచిరాజు వేణుగోపాల్, బాలనాగు కృష్ణ ప్రసాద్, కోనూరు ప్రఫుల్లారాణి, శిశువిద్యమందిర్ పూర్వ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సోమిశెట్టి శివపార్వతి, యోగా గురువులు గిరి స్వామి పలువురు పెద్దలు పాల్గొన్నారు.

## గోల్డెన్ గ్రాండ్ లాడ్జ్‌లో పట్టుబడ్డ వ్యభిచార ముఠా

మంగళగిరి, జూలై 29, ప్రభాతవార్త : మంగళగిరి పట్టణంలోని గోల్డెన్ గ్రాండ్ లాడ్జ్‌లో సాగుతున్న వ్యభిచార కార్యకలాపాలను మంగళగిరి టౌన్ పోలీసులు అడ్డుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు లాడ్జ్‌పై దాడి నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై మంగళగిరి



పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఐటీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గోల్డెన్ గ్రాండ్ లాడ్జ్‌లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో టౌన్ సీఐ కె.వీరస్వామి నార్త్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సీహెచ్.మురళీకృష్ణ ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది లాడ్జ్‌పై ఆకస్మిక తనిఖీ చేపట్టారు.ఈ తనిఖీలో వ్యభిచారనికి పాల్పడుతున్న ముగ్గురు మహిళలు, లాడ్జ్ యజమానితో పాటు నలుగురు పురుషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పలు సెక్షన్లు, యాక్ట్ ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ ఆదేశాలతో, నార్త్ డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణ పర్యవేక్షణలో మంగళగిరి టౌన్ సీఐ కె.వీరస్వామి ఈ తనిఖీలు చేపట్టారు.

# కేంద్రానికి సుప్రీంకోర్టు షాక్



## పోస్ట్-ఫ్యాక్టో పర్యావరణ అనుమతులకు బ్రేక్

### ఇష్టారాజ్యంగా అనుమతులివ్వడం కుదరదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జులై 29:** పర్యావరణ (పరిరక్షణ) చట్టం, 1986లోని సెక్షన్ 3 కింద జారీ చేసిన చెల్లుబాటు అయ్యే చట్టబద్ధమైన నోటిఫికేషన్ల ద్వారా పనులు పూర్తయిన తర్వాత కూడా పర్యావరణ అనుమతులు (ఇసిలు) మంజూరు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, కేవలం ఒక పరిపాలనా ఆఫీస్ మెమోరాండం ద్వారా అలా చేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టులను ప్రారంభించి, ఆ తర్వాత 'పోస్ట్-ఫ్యాక్టో' అనుమతులు పొందే ధోరణికి సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని సెక్షన్-3 కింద చట్టబద్ధమైన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా పరిమితంగా ప్రాజెక్టులను క్రమబద్ధీకరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, కేవలం ఒక సాధారణ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ మెమోరాండమ్(ఒఎం) ద్వారా ఇష్టారాజ్యంగా అనుమతలు ఇవ్వడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. అయితే, ఈ తీర్పుకు భవిష్యత్ ప్రభావం ఉండేలా చూస్తూ, వివాదాస్పద విధానం కింద ఇప్పటికే మంజూరు చేసిన అనుమతులను కోర్టు పరిరక్షించింది. 2021 నాటి పరిపాలనా ఉత్తర్వు (ఒఎం), చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారా కాకుండా పరిపాలనా ఉత్తర్వు ద్వారా ఇప్పటికే ఉన్న పర్యావరణ అనుమతి చట్రాన్ని మార్చడానికి ప్రయత్నించినందున, అది 1986 నాటి పర్యావరణ (రక్షణ) చట్టానికి అతీతమైనదని ధర్మాసనం పేర్కొంది. "చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారా సవరించనంత వరకు, 2006 నోటిఫికేషన్ ప్రకారం ముందస్తు పర్యావరణ అనుమతి (ఒఎం) విధానం తప్పనిసరి" అని తీర్పు వెలువరించిన సమయంలో జస్టిస్ బాగ్చి అన్నారు. తీర్పు వెలువడిన తర్వాత ఇచ్చే పర్యావరణ అనుమతులపై చట్టపరమైన స్థితిని స్పష్టం చేస్తూ, కామన్ కాజ్, అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ కేసులలో తన మునుపటి తీర్పులు అప్పటికి అమలులో ఉన్న చట్టం నేపథ్యంలోనే ఇవ్వబడ్డాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ తీర్పులు, తగిన సందర్భాలలో పరిమితమైన క్షమాభిక్ష పథకాన్ని రూపొందించే కేంద్ర ప్రభుత్వ అధికారంపై సంపూర్ణ నిషేధాన్ని విధించలేదు. కామన్ కాజ్, అలెంబిక్ కేసులలో, తీర్పు వెలువడిన తర్వాత ఇచ్చే పర్యావరణ అనుమతి అనేది పర్యావరణ న్యాయశాస్త్రానికి "విరుద్ధం" అనే వ్యాఖ్యలను, ముందస్తు పర్యావరణ అనుమతిని తప్పనిసరి చేసిన 2006 పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ) నోటిఫికేషన్ చట్టబద్ధమైన నేపథ్యంలో అర్థం చేసుకోవాలని కోర్టు పేర్కొంది.

## ఎన్‌సిఎస్‌సికి ఆ అధికారం లేదు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 28:** రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) పాత్ర కేవలం సిఫార్సు, సలహా రూపమే తప్ప, తీర్పు చెప్పేది కాదని పేర్కొంటూ, ఆ కమిషన్ కట్టుబడి ఉండే ఆదేశాలు జారీ చేయలేదని లేదా సేవా వివాదాలను పరిష్కరించలేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ముంబై పోర్ట్ అథారిటీ ఒక షెడ్యూల్డ్ కుల ఉద్యోగికి పదోన్నతికి సంబంధించిన ఆదేశాలను అమలు చేయాలని, 30 రోజుల్లోగా బకాయిలు చెల్లించాలని ఎన్‌సిఎస్‌సి ఇచ్చిన ఆదేశాన్ని సమర్థించిన బాంబే హైకోర్టు తీర్పును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎ.జి. మసిహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. షెడ్యూల్డ్ కులాల హక్కులు, రక్షణల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి, సిఫార్సులు చేసే అధికారం ఈ రాజ్యాంగ సంస్థకు ఉన్నప్పటికీ, సేవా విషయాలలో అమలు చేయదగిన ఆదేశాలు జారీ చేయలేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

"ఎన్‌సిఎస్‌సి జారీ చేసిన ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం కల్పించిన అధికారాల పరిధిలోకి వస్తాయని బొంబాయి హైకోర్టు డివిజన్ బెంచ్ పొరపాటు చేసిందని తాము భావిస్తున్నాము," అని జస్టిస్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఆర్టికల్ 338 కమిషన్‌కు పరిమిత అధికారాలను మాత్రమే కల్పిస్తుందని పేర్కొంది.



## అమెరికాలో రష్యాపై ఆంక్షల బిల్లు..

### భారత్‌పై 100 శాతం టారిఫ్‌ల ప్రభావం?

**వాషింగ్టన్, జులై 29:** ఇంధన ఎగుమతులతో రష్యా ఆర్జిస్తోన్న ఆదాయాన్ని కట్టడి చేసేలా అమెరికా మరిన్ని ఆంక్షలకు సిద్ధమైంది. ఆ ఆంక్షల బిల్లును పరిశీలించేందుకు సెనెట్ సభ్యులు అంగీకరించారు. అది చట్టరూపం దాల్చితే రష్యా చమురును దిగుమతి చేసుకుంటున్న భారత్ వంటి దేశాలపై టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ఈ ఆంక్షల బిల్లు ఆమోదానికి సెనెట్‌లో ప్రక్రియ ప్రారంభమైంది. దానిని పరిశీలించేందుకు 86–12 తేడాతో సభ్యులు అంగీకరించారు. సెనెట్‌తోపాటు ప్రతినిధుల సభలోనూ దీనికిఆమోదం లభించాల్సి ఉంది. ఈ దశలు దాటిన తర్వాత అది చట్టరూపం దాల్చుతుంది. అదే జరిగితే.. భారత్, చైనా వంటి దేశాలు 100 శాతం టారిఫ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తోన్న దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ఈ టారిఫ్‌లను విధించే వెసులుబాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభించనుంది. 2022 నుంచి ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధం నడుస్తోంది. ఉక్రెయిన్‌కు ఐరోపా, అమెరికా నుంచి సహాయం అందుతున్నా రష్యాను సైనికంగా, ఆర్థికంగా దెబ్బతీయకపోయాయి. అందుకే ఇంధన ఎగుమతులతో పుతిన్ ప్రభుత్వం ఆర్జిస్తున్న ఆదాయాన్ని టార్గెట్ చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. తాజా ప్రతిపాదనలు కూడా అందులో భాగమే. తమకు మద్దతు ఇవ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికాలో పర్యటించిన నేపథ్యంలో సెనెట్‌లో ఈ ఓటింగ్ జరగడం గమనార్హం. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి పశ్చిమ దేశాల హెచ్చరికలను పట్టించుకోకుండా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే. డిస్కౌంట్ ధరలో భారత రిఫైనరీలకు ముడి చమురు లభిస్తోంది. చైనా, జపాన్‌తోపాటు కొన్నిఐరోపాదేశాలు కూడా ఈ ఇంధనాన్ని కొంటున్నాయి. ఈ బిల్లు ఓకేఅయితే భారత్‌పై పరోక్షంగా టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ప్రస్తుతానికి వాణిజ్య ఒప్పందాల్లో ఎలాంటి మార్పులు లేదు.

## హిందూ మహాసముద్రంలో తేలుతున్న స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్



**వాషింగ్టన్, జులై 29:** ఇటీవల స్పేస్‌ఎక్స్ ప్రయోగించిన ఓ భారీ స్టార్‌షిప్ వ్యోమనౌక హిందూ మహాసముద్రంలో తేలుతోంది. ఈ విషయాన్ని స్పేస్ ఎక్స్ ధ్రువీకరించింది. విశ్లేషణ కోసం దానిని రికవరీ చేయడానికి తమ బృందాలు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపింది. ప్రయోగం తర్వాత నియంత్రణ లేకుండానే అది సముద్రంలో దిగిందని అయినప్పటికీ అందులో ఎలాంటి సమస్య తలెత్తలేదని పేర్కొంది. దానిని తిరిగి తీసుకురావడానికి ఓ నౌకు పంపుతున్నట్లు స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ వెల్లడించారు. స్టార్‌షిప్‌లను పునర్వినియోగించేందుకు వీలుగా తమ సంస్థ చేస్తున్న ప్రయత్నాల్లో ఇదో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రయోగం అనంతరం అంతరిక్షం నుంచి సముద్రంలో దిగడానికి ఎదురైన ఒత్తిళ్లను స్టార్‌షిప్ నిర్మాణం, దాని హీట్ షీల్డ్, ఆన్‌బోర్డు వ్యవస్థలు ఎలా ఎదుర్కొన్నాయనే విషయాన్ని శాస్త్రవేత్తలు పరిశీలించనున్నారు. రికవరీ బృందం స్టార్‌షిప్‌నకు సంబంధించిన చిత్రాలను సేకరిస్తోందని.. కీలక వ్యవస్థల పరిస్థితిని నిర్ధారించడంలో ఇవి సహాయపడతాయని స్పేస్‌ఎక్స్ పేర్కొంది.

**ఏమిటీ స్టార్‌షిప్?:** చంద్రుడు, అంగారకుడు అంతకు మించిన అంతరిక్ష యాత్రల కోసం స్పేస్ ఎక్స్ అభివృద్ధి చేస్తున్న రాకెట్ ఈ స్టార్‌షిప్. దాని సూపర్ హెవీ బూస్టర్‌తో కలిపినప్పుడు ఇది సుమారు 123 మీటర్ల ఎత్తు ఉంటుంది. వ్యోమగాములను చంద్రునిపైకి తీసుకువెళ్లేందుకు నాసా చేపట్టిన ఆర్టెమిస్ కార్యక్రమంలో ఇది కూడా కీలక పాత్ర పోషించనుంది. గతంలో ప్రయోగించిన స్టార్‌షిప్ నమూనాలు పరీక్షల సమయంలోనే ధ్వంసం కాగా ఈ ప్రయోగం అనంతరం కూడా సముద్రంలో యాక్టివ్‌గా ఉండడం గమనార్హం.

## భర్తను నెలవారీ లీజుకు ఇచ్చిన భార్య

### థాయిలాండ్‌లో ఘటన

### సోషల్ మీడియాలో వైరల్

**బ్యాంకాక్, జులై 29:** థాయిలాండ్‌కు చెందిన ఖున్ క్వాంగ్ (31) అనే మహిళ, ఒక పోలీస్ అధికారిని పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి 8 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. చాలా కాలం పాటు వీరి కాపురం ఎంతో సంతోషంగా సాగింది. ఇటీవల భర్త ప్రవర్తనలో మార్పు రావడం, రాత్రివేళల్లో ఆలస్యంగా ఇంటికి రావడం గమనించిన క్వాంగ్‌కు అనుమానం వచ్చింది. ఆరా తీయగా, ఒక అపరిచిత మహిళ సోషల్ మీడియాలో తన భర్తను నిరంతరం ఫాలో అవుతుండటం చూసింది. అసలు నిజం తెలుసుకోవడానికి ఆమె ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమించింది. విచారణలో తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, ఆమెతో కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నట్లు డిటెక్టివ్ ఆధారాలతో సహా బయటపెట్టాడు. దీంతో సదరు భర్త ఇంటికి వచ్చి, 'నాకు ఈ సంసారం వద్దు.. ఇల్లు, కారు, అప్పులు అన్నీ నీకే ఇచ్చేస్తున్నా.. నేను ఆమెతోనే ఉంటా' అంటూ కట్టుబట్టలతో వెళ్ళిపోయాడు. భార్య సదరు ప్రియురాలి ఇంటికెళ్లి, భర్తకు సర్దిచెప్పి ఇంటికి రప్పించింది. అయితే, 'ఆమెను (ప్రియురాలిని) మర్చిపోలేకపోతున్నాను, ఆమె లేకుండా ఉండలేను' అని భార్య ముందే భర్త ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక చేసేదేమీ లేక, ప్రియురాలికి ఫోన్ చేసి, 'నీకు నా భర్త కావాలి, నా భర్తకు నువ్వు కావాలి. కాబట్టి నా భర్తను నీకు అద్దెకు (లీజుకు) ఇస్తాను. కానీ దానికి ప్రతిఫలంగా నెలకు 30,000 థాయ్ బాట్లు (సుమారు రూ.85,000) నాకు చెల్లించాలి. అప్పుడు అతడు నీతోనే ఉండవచ్చు. కానీ నేను చట్టపరంగా విడాకులు మాత్రం ఇవ్వను' అని పేర్కొంది. ఆమె ఆఫర్ విన్న ప్రియురాలు సమ్మతించింది. 'నాకు డబ్బు సమస్య కాదు, అద్దె కట్టడానికి నేను సిద్ధం' అని తెలిపింది. అయితే, సదరు భర్త మాత్రం భార్య అగ్రిమెంట్‌ను నిరాకరించాడు. ప్రస్తుతం ఈ వింత 'హజ్బెండ్ లీజ్ అగ్రిమెంట్' (భర్త అద్దె ఒప్పందం) వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## కోల్ స్కామ్ కేసులో మన్మోహన్‌కు క్లీన్‌చిట్

### 2015లో జారీ చేసిన సమన్లు కొట్టేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 29:** బొగ్గు బ్లాకుల కేటాయింపుల కేసులో దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు బుధవారం అధికారికంగా విముక్తి లభించింది. విచారణను ఎదుర్కోవాలని కోరుతూ 2015లో ప్రత్యేక సిబిఐకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ముగింపు నివేదికలు ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చాయని, వాటిని తిరస్కరించడానికి బలమైన కారణాలు లేవని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం, సింగ్ అప్పీల్‌ను అనుమతించి, సిబిఐ ముగింపు నివేదికలను తిరస్కరించి, అవినీతి నిరోధక చట్టం కింద మాజీ ప్రధానిపై అభియోగాలు మోపిన పాటియాలా హౌస్ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి మార్చి 11, 2015నాటి ఉత్తర్వును రద్దు చేసింది. దశాబ్దానికి పైగా గడిచిన తర్వాత ఆ ముగింపు నివేదికలను అంగీకరించిన సుప్రీంకోర్టు, ఇప్పుడు దివంగత మాజీ ప్రధానిపై ఉన్న క్రిమినల్ విచారణను ముగించింది.



## మళ్లీ పోరాటానికి సిద్ధం

### జంతర్‌మంతర్ అరెస్టులపై కేసులు ఇంకా ఎత్తివేయలేదు: సిజెపి సారవ్‌దాస్

**న్యూఢిల్లీ,జులై 29:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై చేపట్టిన ఉద్యమాన్ని విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మరోసారి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది. శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలను సాకుగా చూపుతూ ప్రభుత్వం హామీల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించింది. నిరసనకారులపై కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, ఇప్పటికే నమోదైన కేసులను కూడా ఉపసంహరిస్తామని ప్రభుత్వం బహిరంగంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కేసు కోర్టు పరిధిలో ఉందని చెబుతూ ఆ హామీ అమలును వాయిదా వేస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు శాంతియుత నిరసనకారులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసిందని సౌరవ్ దాస్ చెప్పారు. నేరచరిత్ర లేని నిర్బంధితులను విడుదల చేయాలని కూడా ఆదేశించిందన్నారు. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లపై దర్యాప్తు కొనసాగించవచ్చని కోర్టు పేర్కొన్న విషయాన్ని ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుంటోందని ఆరోపించారు. మంగళవారంలోగా ఈ విషయంపై కేంద్రం నుంచి లిఖితపూర్వక హామీ వస్తుందని ఆశించామని, కానీ అలాంటి సమాచారం ఇప్పటివరకు అందలేదని సౌరవ్ దాస్ తెలిపారు.

## కేసుల ప్రస్తావన సమయంలో లైవ్‌స్ట్రీమ్ ఆడియో మ్యూట్ చేయాలి

### సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 29:** భారత ప్రధాన న్యాయమూర్తి ఎదుట కొత్త విషయాల ప్రస్తావనల సమయంలో, తన లైవ్ వీడియో ఫీడ్ ఆడియోను మ్యూట్ చేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. దీనివల్ల, అత్యవసరంగా కేసులను విచారణకు తీసుకోవాలని న్యాయవాదులు చేసే అభ్యర్థనలు, కోర్టు ఇచ్చే మౌఖిక సమాధానాలు ప్రజలకు, మీడియాకు వినిపించకుండా నిరోధించవచ్చు. అత్యవసర విషయాల ప్రస్తావన అనేది న్యాయపరమైన ప్రక్రియ కాదని, అది ఒక 'పరిపాలనా' చర్య అని, అందువల్ల దానిని ప్రసారం చేయకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం వెలువడింది. ఈ తాజా ఆదేశం, కొత్త కేసుల ప్రస్తావనల సమయంలో జరిగే చర్చలు ఇకపై కోర్టు లైవ్‌స్ట్రీమ్‌లో వినిపించకుండా చేయనున్నారు. ఈ ఆదేశంతో పాటు కోర్టు వివరణాత్మక బహిరంగ వివరణను జారీ చేయనప్పటికీ, ఇటువంటి పరిపాలనాపరమైన చర్యలను నివేదించదగిన న్యాయపరమైన కార్యకలాపాలుగా పరిగణించకూడదని ప్రధాన న్యాయమూర్తి గతంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే ఈ చర్య తీసుకున్నారు.

## యేడేళ్లు నివసిస్తే చాలు..అమెరికాలో గ్రీన్‌కార్డు..

### కొత్తబిల్లును ప్రవేశపెట్టిన డెమొక్రాట్ సెనేటర్





**వాషింగ్టన్,జులై 29:** అమెరికాలో శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న లక్షలాది మంది వలసదారులకు, ముఖ్యంగా భారతీయులకు ఆశలు రేకెత్తించే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘకాలంగా దేశంలో నివసిస్తున్న వారికి గ్రీన్ కార్డ్ పొందేందుకు వీలు కల్పించే ఒక కొత్త బిల్లును అమెరికా సెనేట్‌లో తిరిగి ప్రవేశపెట్టారు. ఇది చట్టంగా మారితే, ముఖ్యంగా హెచ్1బీ వీసాలపై ఉండి గ్రీన్ కార్డ్ బ్యాక్ లాగ్‌లో చిక్కుకుపోయిన భారతీయ నిపుణులకు భారీ ఊరట లభించే అవకాశం ఉంది.

కాలిఫోర్నియాకు చెందిన డెమొక్రటిక్ సెనేటర్ అలెక్స్ పడిల్లా, రిన్యూయింగ్ ఇమ్మిగ్రేషన్ ప్రొవిజన్స్ ఆఫ్ ది ఇమ్మిగ్రేషన్ యాక్ట్ ఆఫ్ 1929 పేరుతో ఈ బిల్లును మరోసారి సెనేట్ ముందుకు తెచ్చారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 249లో ఉన్న రిజిస్ట్రీ అనే నిబంధనను సవరించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుత చట్టం ప్రకారం 1972 జనవరి 1కు ముందు అమెరికాలోకి ప్రవేశించిన వారు మాత్రమే ఈ నిబంధన కింద గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గత 50ఏళ్లుగా ఈ తేదీ మారకపోవడంతో ఈ మార్గం దాదాపు నిరుపయోగంగా మారింది. తాజా ప్రతిపాదన ప్రకారం ఈ పాత తేదీని తొలగించి, దాని స్థానంలో సరికొత్త నిబంధనను తీసుకువస్తారు. దీని ప్రకారం ఎలాంటి నేరచరిత్ర లేకుండా, చట్టపరమైన ఇతర షరతులను సంతృప్తి పరిచే వలసదారులు, దరఖాస్తు చేసుకునే నాటికి కనీసం ఏడు సంవత్సరాలుగా నిరంతరాయంగా అమెరికాలో నివసిస్తూ ఉంటే గ్రీన్ కార్డ్‌కు అర్హులవుతారు.

## బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించడం దేశ వ్యతిరేక చర్య కాదు

### బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**ముంబై, జులై 29:** అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేతను వ్యతిరేకించడమన్నది 'దేశ వ్యతిరేక చర్య' కిందకు రాదని బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ)కి చెందిన ఇద్దరు సభ్యులపై ముంబై పోలీసులు జారీ చేసిన నగర బహిష్కరణ ఉత్తర్వులను రద్దు చేసింది. కాగా ఎస్‌డిపిఐ కార్యకర్తలు ఫిరోజ్ అబ్దుల్ వహాబ్ ఖాన్, మహమ్మద్ రఫిక్ గులాం రసూల్ అన్సారీలను ఏడాది కాలంపాటు నగరం నుంచి బహిష్కరిస్తూ ముంబై పోలీసులు 2025 డిసెంబర్ 3న ఉత్తర్వులు జారీచేశారు. వక్ఫ్ సవరణ బిల్లు, చెంబూర్ గోవండి ప్రాంతంలోని సిమెంట్ గోడౌన్‌ల వల్ల కలుగుతున్న వాయు కాలుష్యం, బాబ్రీ మసీదు కూల్చివేతకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలకు సంబంధించి 2024, 2025 సంవత్సరాల్లో నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా పోలీసులు ఈ చర్య చేపట్టారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ మాధవ్ జమ్దార్ పోలీసుల చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. 'వారి అభిప్రాయం ప్రకారం, బాబ్రీ మసీదును కూల్చివేసి ఉండకూడదు. అది వారి వ్యక్తిగత అభిప్రాయం. అది దేశవ్యతిరేక చర్య ఎలా అవుతుంది? ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ భిన్నాభిప్రాయాలు కలిగిఉండే హక్కు ఉంది'అని జస్టిస్ జమ్దార్ వ్యాఖ్యానించారు. కేవలం ఊహాజనిత భయాల ఆధారంగా పౌరుల ప్రాథమిక హక్కులను హరించలేమని, నగర బహిష్కరణ అనేది అసాధారణ చర్యఅని, ఇటువంటి సందర్భాల్లో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని న్యాయస్థానం తేల్చిచెప్పింది.

## పేపర్ లీక్‌కేసులో కీలక నిందితుడి అరెస్టు

### పరీక్షకు ముందే రూ.1.2 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడి

**పాట్నా,జులై 29:** బీహార్‌ను కుదిపేసిన బీపీఎస్‌సీ టీచర్ రిక్రూట్‌మెంట్ (టీఆర్‌ఈ3) పేపర్ లీక్ కేసులో ఆర్థిక నేరాల విభాగం (ఈవోయూ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ మనీశ్ కుమార్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. పరీక్షకు ముందే 30 మంది అభ్యర్థులకు ప్రశ్నాపత్రాలు అందించి, సుమారు రూ.1.2 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈవోయూ అధికారుల కథనం ప్రకారం డాక్టర్ మనీశ్ కుమార్ ఎలాంటి ఆనవాళ్లు లేకుండా సీల్డ్ ప్రశ్నాపత్రాల బాక్సులను తెరిచి, తిరిగి మూసివేయడంలో నైపుణ్యం సంపాదించాడు.

## ఎమర్జెన్సీలో నన్ను కూడా పలుసార్లు అరెస్టులు చేసారు

### రాజ్యసభలో విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి జెపి నడ్డా కౌంటర్



**న్యూఢిల్లీ,జులై 29:** రాజ్యసభలో బుధవారం ఢిల్లీ పోలీసుల చర్యలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కేంద్ర మంత్రి జెపినడ్డా మాట్లాడుతూ, తాను కూడా ఒకప్పుడు విద్యార్థి నాయకుడినేనని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ కాలంలో పలుమార్లు అరెస్టయ్యానని చెప్పారు. చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని పేర్కొన్నారు. ఉద్యమాల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు పోలీసు చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో నినాదాలు కొనసాగడంతో గందరగోళం నెలకొంది. చివరకు ఛైర్మన్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు వెళ్లి మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఘటనను ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సభలో ఆందోళన, నినాదాలు కొనసాగాయి. దీనిపై స్పందించిన రాజ్యసభ సభా నేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఉద్యమాలు చేయాలనుకునే ఏ విద్యార్థైనా పోలీసులను ఎదుర్కోవాల్సిందే అని అన్నారు. సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల నిరసనలో పాల్గొనడమే ఐషే ఘోష్ చేసిన తప్పని పేర్కొన్నారు. 2020–21 కేసులను చూపిస్తూ పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే జాతీయ రాజకీయ పార్టీ కార్యాలయంలోకి వెళ్లడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా దీన్ని ఖండిస్తూ, పార్టీ కార్యాలయంలోకి వెళ్లి నాయకురాలిని అరెస్టు చేయడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# సంక్షిప్త వార్తలు

## వయస్సు నిర్ధారణకు ఆధార్ ప్రమాణం కాదు: ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

**రాయ్‌పూర్, జులై 29:** మోటారు ప్రమాద పరిహారం క్లెయిమ్‌ల కేసుల్లో బాధితుల లేదా క్లెయిమ్ దారుల వయస్సును నిర్ధారించడానికి ఆధార్ కార్డును ఒక నమ్మదగిన అధికారిక పత్రంగా పరిగణించలేమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టం చేసింది. వయస్సు నిర్ధారణకు సంబంధించి కేవలం ఆధార్ కార్డుపై ఉన్న వివరాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోలేమని ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కె. అగర్వాల్‌తో కూడిన న్యాయస్థానం ఒక మోటారు వాహన ప్రమాద బీమా కేసు విచారణ సందర్భంగా ఈ సంచలన తీర్పును వెలువరించింది.

## తమిళనాడు విద్యార్థులకు చికెన్ బిర్యానీ!



**చెన్నై,జులై 29:** పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు భోజనాన్ని ఆసక్తికరంగా మార్చేందుకు తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం ఒక కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, దేశంలోనే సుదీర్ఘకాలంగా అమలవుతున్న ఈ పథకంలో ఇదొక ముఖ్యమైన మార్పు అవుతుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

## జపాన్ భూకంపంలో 13 మంది మృతి, వందల మందికి గాయాలు



**టోక్యో,జులై 29:** జపాన్ నైరుతి ప్రాంతంలోని క్యుషూ ద్వీపాన్ని మంగళవారం సాయంత్రం సంభవించిన 7.1 తీవ్రత గల భారీ భూకంపం అతలాకుతలం చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 13 మంది మృతి చెందగా, వందల మంది గాయపడ్డారు. పలువురు ఇంకా శిథిలాల కింద చిక్కుకుని ఉండడంతో సహాయక బృందాలు రాత్రంతా సహాయక చర్యలు కొనసాగించాయి. ఈ విషయాన్ని జపాన్ ప్రధాని సనాయే తకైచి బుధవారం వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 4:27 గంటలకు కుమమోటో ప్రాంతంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.1గా నమోదైంది.

## బస్సుడ్రైవర్ ఇంట్లో పెద్ద ఎత్తున బంగారం, నోట్ల కట్టలు

**బీర్‌భూమ్(బెంగాల్),జులై 29:** పశ్చిమబెంగాల్‌లో బస్సు డ్రైవర్‌ఇంట్లో పెద్దఎత్తున నోట్ల కట్టలు, బంగారం బిస్కెట్లు బయటపడ్డాయి. ఇసుక, క్వారీ మాఫియా పై దర్యాప్తులో భాగంగా చేపట్టిన సోదాల్లో ఈ సొమ్మును పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు రూ.5.5 కోట్ల నగదు, 15 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీర్‌భూమ్ జిల్లాకు చెందిన మీనా మండల్ నివాసంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇసుక మాఫియాపై దర్యాప్తులో భాగంగా పక్కా సమాచారంతో ఈ సోదాలు జరిపారు. ఈ క్రమంలోనే అతడి ఇంట్లో భారీగా అక్రమ నగదు బయటపడింది.

## ఒక అధికారికి ఇకపై ఒకే ప్రభుత్వ కారు





**న్యూఢిల్లీ,జులై 29:** ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అర్హులైన ఒక అధికారికి ఒకే ప్రభుత్వవాహనాన్ని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం ఒక అధికారికిఒకే కారు విధానాన్ని అమల్లోకి తెస్తూ అధికారిక మెమొ జారీ చేసింది. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక ప్రయోజనాల కోసమే వినియోగించేలా చూడటమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం.

## మోస్ట్ వాంటెడ్ జాబితాలో టెలిగ్రామ్ సిఇఓ పావెల్ దురోవ్

**మాస్కో,జులై 29:** టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్‌పై రష్యా తీవ్ర ఆరోపణలు చేసింది. ఉక్రెయిన్ నిఘా సంస్థలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి రష్యాలో దాడులు నిర్వహించేందుకు యువకులను నియమించుకున్నప్పటికీ ఆ కార్యకలాపాలను అడ్డుకోకుండా ఉగ్రవాద చర్యలకు సహకరించారని రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ ఆరోపించింది. ఈ కేసును మరింత తీవ్రతరం చేసిన రష్యాదర్యాప్తు సంస్థలు దురోవ్‌పై ఉగ్రవాద కార్యకలాపాలకు సహకరించినట్లు క్రిమినల్ కేసు నమోదు చేసి, అంతర్జాతీయ వాంటెడ్ జాబితాలో చేర్చినట్లు పేర్కొన్నాయి.

## చైనాలో ఒక్కనెలలోనే 79 వేల కరోనాకేసులు

**బీజింగ్,జులై 29:** చైనాలో మరోసారి కోవిడ్19 కేసులు పెరుగుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. చైనా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం వివరాల ప్రకారం జూలై 13 నుంచి 19వరకు నిర్వహించిన పరీక్షల్లో కోవిడ్19 పాజిటివిటీ రేటు 16.3శాతానికి చేరుకుంది. ఇది అంతకుముందు వారంతో పోలిస్తే 4.3 శాతం పాయింట్లు ఎక్కువ. అదే సమయంలో ఫ్లూ పాజిటివిటీ రేటు 12.6 శాతంగా నమోదైంది. జూన్ 2026లో దేశవ్యాప్తంగా 79 వేల కొత్త కరోనా కేసులు నమోదవగా, వాటిలో 130 మంది పరిస్థితి విషమంగా మారింది.

30-7Pg6exHMNWJQE_30-7Pg6exHMNWJQE.qxd 29/Jul/26 10:31 PM Page 1



# పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దు

**● టిడిపి నేతలకు ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** టిడిపి నేతలు కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందువల్ల నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని ఆదేశించారు. ఎవరైనా గీత దాటితే మాత్రం చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని అందరు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అందరు దృష్టిలో పెట్టుకోవాలని దిశానిర్దేశం చేశారు. బుధవారం అమరావతిలోని టిడిపి కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, బోండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో హైకమాండ్ సంతృప్తి చెందిందని తెలిపారు. పార్టీ లైన్ దాటి మాట్లాడిన వారిపై చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. పార్టీ నియమావళికి అందరు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. వైసిపి నేతలతో టిడిపి నేతలు ఎవరు వేదిక పంచుకోవద్దని హుకుం జారీ చేశారు. ఎక్కడైనా నివాళి అర్పించాల్సి వేస్తే వెళ్లి రావాలని సూచించారు. టిడిపి అధినేత చంద్రబాబు ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. అందరు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రయత్నం: మంత్రి నిమ్మల



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం నాడు కూటమి ఏర్పడిందని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరు కూడా అధినేతకు మద్దతు ఇవ్వాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు, లైన్‌కు కట్టుబడి పని చేయాలని ఆదేశించారు. మనకు వచ్చిన గౌరవం, అధికారం పార్టీ ద్వారా, చంద్రబాబు ద్వారా వచ్చిందని నేతలు అందరు తెలుసుకోవాలని తెలిపారు. పార్టీ లైన్ దాటిన వారిని, పార్టీకి నష్టం కలిగించే వారు ఎవరైనా కూడా ఎంతటివారు అయినా కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి నిమ్మల సూచించారు. కూటమి ధర్మాన్ని పాటించకపోతే మాత్రం ఎంతటివారైనా కూడా ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారని అన్నారు. కొంతమంది నేతలను పిలిపించి మాట్లాడుతున్నామని తెలిపారు. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమనేది అందరు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీకి, కూటమికి ఎవరైనా విఘాతం కలిగిస్తే మాత్రం హై కమాండ్ ఊరుకోదని హెచ్చరించారు. అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని ఎవరైనా మాట్లాడితే మాత్రం ఉపేక్షించవద్దని చంద్రబాబు స్పష్టం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# కంగనా రనౌత్ వ్యాఖ్యలు సరికాదు

**● సిపిఐ క్రమశిక్షణా సంఘం చైర్మన్ కె. నారాయణ**



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రదర్శనకారుల మనోభావాలను దెబ్బతీసిన తన గత 'బొద్దింకలు' వ్యాఖ్యల విషయంలో సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించడం అభినందనీయమని సిపిఐ జాతీయ సమితి క్రమశిక్షణా సంఘం చైర్మన్ డాక్టర్ కె. నారాయణ వ్యాఖ్యానించారు. ఆందోళనకారులపై చేసిన వ్యాఖ్యల వల్ల కలిగిన బాధను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే వైఖరి న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబి స్తుందన్నారు. జెన్ జెడ్ యువత, మహిళలను ఉద్దేశించి కంగనా రనౌత్ చేసిన అవమానకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయమైనవి కావని నారాయణ పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేసే సమయంలో బాధ్యతాయుతంగా, సంయ మనంతో వ్యవహరించాలి. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను మరింత పెంచడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయన్నారు. కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఆమె అవమానించిన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కరవు మండలాలు ప్రకటించాలి

**● సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ**



**అనంతపురం, జులై 29 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్షాభావ మండలాలను తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం లేఖ రాశారు. సాధారణంగా 225 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 104 మి.మీ. మాత్రమే కురిసిందని, రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం వర్షపాతం లోటు నమోదైందని లేఖలో పేర్కొన్నారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్ల సాధారణ సాగుకు బదులుగా ఇప్పటివరకు కేవలం 16.35 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు జరిగిందని, వరి, పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, టమాటా తదితర పంటలు ఎండిపోతుండగా ఉద్యాన పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. ప్రత్యామ్నాయ పంట విత్తనాలను రైతులకు 100శాతం ఉచితంగా పంపిణీ చేయాలని, అన్ని పంటలకు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలని, పంటల బీమా గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించడం, పశుగ్రాసం, మంచినీటి సరఫరా కల్పించడం, వ్యవసాయ ఇన్‌పుట్‌ల ధరలు తగ్గించడం, పొగాకు రైతులకు మద్దతు నిధి, రొయ్యలకు కనీస మద్దతు ధర నిర్ణయించడం, ఎరువుల యాప్‌ను రద్దు చేయడం వంటి 14 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అత్యవసరంగా అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తన లేఖలో కోరారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు



**తిరుపతి, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 2019 సంవత్సరంలో కేసులో ముద్దాయి తమిళనాడు తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా పాదిరి గ్రామానికి చెందినదొరసామి ఏలుమలై ఎర్రచందనం దుంగలతో పట్టుబడ్డాడు. ఇతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో బాటు రూ.6లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# విద్యుత్ ఉత్పత్తిలో రాజీ లేదు

**● పూర్తి సామర్థ్యంతో యూనిట్ల నిర్వహణ.. పిఎల్ఎఫ్ పెంపు ● 10 రోజుల బొగ్గు నిల్వలు, ఆర్అండ్ఎం పనులు వేగవంతం ● ఎపి జెన్‌కో ఎండి ఎస్.నాగలక్ష్మి**



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలంటే థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయడం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఎపి జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అన్ని ఉత్పత్తి యూనిట్లను గరిష్ట సామర్థ్యంతో నిర్వహిస్తూ రాష్ట్ర గ్రిడ్‌కు నిరంతర విద్యుత్ అందించేందుకు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. బుధవారం విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (విటిపిఎస్)ను థర్మల్ డైరెక్టర్ అశోక్ కుమార్ రెడ్డితో కలసి ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు, బొగ్గు నిర్వహణ వ్యవస్థ, బాయిలర్లు, టర్బైన్లు, స్విచ్‌యార్డులు, నిర్వహణ ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లు, పర్యావరణ పరిరక్షణ చర్యలను పరిశీలించిన అనంతరం ప్లాంట్ పనితీరుపై ఉన్నతాధికారులతో ఎండి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పిఎల్ఎఫ్)ను మరింత పెంచడంతో పాటు ముందస్తు నిర్వహణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ట్రిప్పింగ్‌లు, సాంకేతిక లోపాలు, బ్రేక్‌డౌన్‌లు తగ్గించేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, హీట్‌రేట్‌ను మెరుగుపరచి ఇంధన వినియోగ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. వాల్మెట్ డిఎన్‌ప డిసిఎస్ వ్యవస్థ ఆధునికరించటం యూనిట్4 జనరేటర్, బాయిలర్ పనులను పరిశీలించిన నాగలక్ష్మి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కనీసం 10 రోజుల అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బొగ్గు సరఫరా సంస్థలు, రైల్వే శాఖతో నిరంతర సమన్వయం కొనసాగించాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్న ఎండీ, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అన్ని యూనిట్లలో స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి కొనసాగించేలా అధికారులు, సాంకేతిక సిబ్బంది సమన్వయం తో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రతి రైతుకు, ప్రతి పరిశ్రమకు నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఏపీజెన్‌కో పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని నాగలక్ష్మి తెలిపారు.

# విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభతరం

**● యుపిఐ యాప్‌లతో నేరుగా చెల్లించే అవకాశం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**






**తిరుపతి, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) కృషి చేస్తోంది. వినియోగదారులు సులభంగా విద్యుత్తు బిల్లును చెల్లించే ప్రక్రియను మరింత సరళతరం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగానే యూపీఐ యాప్‌ల నుండి నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎపిఎస్‌పిడిసిఎల్‌లో ఇప్పటి వరకు అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్, డైనమిక్ క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు అవకాశం ఉండేది. అయితే వినియోగదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే, అమెజాన్ పే తదితర యూపిఐ యాప్‌ల నుండి నేరుగా బిల్లుల చెల్లింపు ప్రక్రియ ద్వారా వేగవంతమైన, సురక్షితమైన, పారదర్శకమైన చెల్లింపు వ్యవస్థను అమలు చేస్తోంది. యూపిఐ యాప్‌ల ద్వారా వినియోగదారులు కొన్ని క్షణాల్లో విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించే అవకాశం ఏర్పడింది. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే దిశగా సంస్థ చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాల (ఇఆర్ఒ)లో కూడా డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యతనివ్వడం జరుగుతోంది. నగదు లావాదేవీలను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు వీలుగా విద్యుత్తు బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

**విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభం:** విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియను మరింత సులభతరంగా తీర్చిదిద్దాం. ఆన్లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. యూపీఐ యాప్‌ల నుండి నేరుగా సామాన్యులు కూడా సులభంగా బిల్లులను చెల్లించే అవకాశం ఏర్పడడంతో డిజిటల్ చెల్లింపులు త్వరలోనే వంద శాతానికి చేరుకుంటాయి. డిజిటల్ చెల్లింపుల శాతాన్ని మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేస్తాం. డిజిటల్ చెల్లింపుల సందర్భంగా గుర్తు తెలియని లింకులు, సందేశాలు లేదా నకిలీ యాప్‌లను నమ్మి మోసపోవద్దు. సురక్షితమైన, వేగవంతమైన, పారదర్శకమైన బిల్లుల చెల్లింపు కోసం వినియోగదారులు డిజిటల్ విధానానికి

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

**పోలవరం పూర్తి కోసం యజ్ఞం చేస్తున్నారు: భువనేశ్వరి**



**కుప్పం, జులై 29 ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేది సిఎం చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కుప్పం మండలం వసనాడు గ్రామంలో ఆమె మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో ఖజానా ఖాళీ చేశారని పేర్కొన్నారు. అలాగే వారి పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వైసిపి పాలనలో ఏ అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. చివరకు రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు మట్టి సైతం వేసి పూడ్చలేని దుస్థితి అప్పట్లో ఉండేది అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రం కోసం ఆలోచిస్తున్నారని, ప్రజలు, పిల్లల భవిష్యత్తుపై పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబును నమ్మి ప్రజలు ఓట్లేసారని పేర్కొన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి సిఎం చంద్రబాబు యజ్ఞం చేస్తున్నారన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో పోలవరం ప్రాజెక్టును పట్టించుకోక నిధులను వారి సొంత అవసరాలకు వాడుకున్నారని పేర్కొన్నారు. ఆచరణలో సాధ్యమయ్యే హామీలను మాత్రమే సిఎం చంద్రబాబు ఇస్తారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టరని పేర్కొన్నారు. మహిళలు కష్టపడి ఆర్థికంగా పైకి ఎదగాలని సూచించారు. పిఫోర్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ గ్రామం తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, సిఎం పిఎ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాసులు రెస్కో చైర్మన్ ప్రతాప్, ఎఎంసి చైర్మన్ జిఎం రాజు, ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, స్థానిక నేతలు మునికృష్ణ, వల్లెప్ప, సికె సుబ్రహ్మణ్యం, బాబు, రెస్కో మణి తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 3 నుంచి డిపిటి టీకా కార్యక్రమం

**● పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు**

**● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్**

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** గొంతువాపు(డిఫ్తీరియా), కోరింత దగ్గు (పెర్టురిస్), ధనుర్వాతం (టెటానస్) వంటి ప్రాణాంతక బ్యాక్టీరియా వ్యాధుల నుంచి పిల్లలు, కౌమార దశ యువతకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ఆగస్టు 3 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టీకా (డిపిటి, టిడి) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి. వీరపాండియన్ తెలిపారు. సాధారణ టీకా కార్యక్రమాల్లో టీకాలు వేసుకోలేకపోయిన పిల్లలకు ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా టీకాలు వేయడమే ప్రధాన ఉద్దేశమని ఆయన నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని అర్హులైన పిల్లలను కూడా గుర్తించి టీకాలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలతో సమన్వయం చేసుకుని జిల్లా, మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులకు ముందుగానే టీకాలు వేసే తేదీల సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక పరిశీలకులను నియమించి కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని డిఎంహెచ్‌ఒలు, డిఐఒలను కమీషనర్ ఆదేశించారు.

# తిరుమల సమాచారం



## గరుడునిపై మలయప్ప అభయం

**తిరుమల, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్రమైన గురుపౌర్ణమి ఘడియల్లో పున్నమివెలుగుల్లో బుధవారం రాత్రి మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు ముగించుకుని సహస్ర దీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహన మండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకార భూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడ వాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

**సర్వదర్శనానికి 18 గంటలు:** తిరుమలేశుని దర్శనం కోసం భారీగా పెరిగిన భక్తులతో ఏడుకొండలు కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఉదయానికి వైకుంఠమ్2లో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోంది. సోమవారం రాత్రివరకు 78 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం 4.76 కోట్లు చేకూరింది. భక్తుల రద్దీ దృష్ట్యా దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

# శాస్త్రోక్తంగా జీయర్ల చాతుర్మాస్యదీక్ష సంకల్పం



**తిరుమల, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాసదీక్ష విశేషమైందని టిటిడి పెద్దజీయంగారు తెలిపారు. ఆషాడ శుద్ధఏకాదశిన శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొంటారు. ఈ నాలుగునెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారన్నారు. చాతుర్మాస్యదీక్షలో భాగంగా బుధవారం తిరుమలలోని పెద్దజీయర్‌స్వామి మఠంలో కలశ స్థాపన, కలశపూజ, విశ్వక్సేనారాదన, మేధినపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత పుట్టమన్ను సేకరించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అక్కడ నుండి పెద్దజీయర్‌స్వామి మఠం వద్ద నుండి చిన్నజీయంగారు, శిష్య బృందంతో కలసి మంగళవాయిద్యాల నడుమ బయలుదేరి తొలుత వరాహస్వామిని, అక్కడ నుండి దేవదేవుని ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం పెద్దజీయర్‌కు మేల్‌ఛాట్ వస్త్రాన్ని, చిన్నజీయర్‌కు నూలువస్త్రాన్ని బహుకరించారు. అలాగే టిటిడి ఇఒ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంను జీయంగార్లు శాలువతో సన్మానించారు. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక పవిత్ర మాసాలలో ఆచార్య పురుషులు స్నాన, జప, హోమ, వ్రత దానాదులను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, జీయంగార్లు పాల్గొన్నారు.

# ఏకం క్షేత్రంలో వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు





**వరదయ్యపాలెం (తిరుపతి జిల్లా), జులై 29 ప్రభాతవార్త:** చెన్నై- తిరుపతి మధ్య ఉన్న పాలరాతి ఆలయమైన ఏకం క్షేత్రం, పవిత్ర గురు పూర్ణిమ సందర్భంగా రోజంతా ముక్తిగురు దర్శనాన్ని అందించింది. సూర్యాస్తమయం నాటికి, సుమారు 70వేల మంది ఈ ప్రాంగణంలో చేరుకున్నారు. ప్రతి ఒక్కరూ ముక్తి గురు శ్రీకృష్ణాజీ ముందు ఒక క్షణం నిలబడాలని, ఆయన చూపుతో లభించే ఇచ్ఛా సిద్ధి ఆశీర్వాదాల కోసం ఎదురుచూశారు. జార్ఖండ్, బీహార్, మహారాష్ట్ర వంటి సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక రైళ్లు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన భక్తులు తమ ప్రయాణ సమయాన్ని ఆరాధనగా మలచుకుని, యాత్ర పొడవునా మంత్రాలు జపించారు. కర్ణాటక, తమిళనాడు నుండి బస్సులు, ప్రైవేట్ వాహనాల నిరంతర తాకిడి కొనసాగింది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ ఉచితంగా దర్శనానికి తరలివచ్చారు. హైకోర్టు జడ్జి లక్ష్మణ రావు, నెల్లూరు జిల్లా జడ్జి శ్రీనివాస్, కృష్ణ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాస రావు, సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, శ్రీ కాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, కడూరు పిఎసిఎస్ చైర్మన్ ఆణిముత్యం నందాకిషోర్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డోరేటర్ బొప్పన తిలక్ బాను, తెలుగుదేశం పార్టీ వరదయ్యపాలెం మండలం అధ్యక్షుడు పిన్నమనేని యుగంధర్ రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పి.నిర్మల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# నకిలీ వెబ్‌సైట్‌పై అప్రమత్తంగా ఉండాలి: టిటిడి




**తిరుమల, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనాల పేరుతో భక్తులను కొందరు మోసగాళ్ళు పలు రకాలుగా మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని టిటిడి హెచ్చరించింది. సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్న "టిటిదేవస్థానమ్. ఆన్‌లైన్" అనే నకిలీ వెబ్‌సైట్‌ను టిటిడి విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఈ వెబ్ సైట్ టిటిడి అధికారిక ఆన్‌లైన్ సేవలను పోలి ఉండేలా రూపొందించిన కొందరు వ్యక్తులు భక్తులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. టిటిడి అధికారిక వెబ్‌సైట్ మాదిరిలోనే ఉండేలా, కేవలం డొమైన్ పేరులో స్వల్ప మార్పులతో ఈ నకిలీ వెబ్‌సైట్ రూపొందించారు. ఇందులో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు శ్రీవారి దర్శనం, సేవా టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తప్పుడు సమాచారం ప్రదర్శిస్తున్నారు. దర్శన టికెట్ల పేరుతో భక్తుల నుంచి నగదు వసూలు చేయడం ద్వారా వారిని మోసం చేయడంతో పాటు, టిటిడి ప్రతిష్ఠను దెబ్బతీయడమే ఈ నకిలీ వెబ్‌సైట్ ఉద్దేశం. ఈ నకిలీ వెబ్‌సైట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత డొమైన్ ప్లాట్ ఫారమ్ నిర్వాహకులకు టిటిడి ఇప్పటికే ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరుగుతోంది. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా భక్తులను మోసం చేసే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. టిటిడి సేవలు, దర్శనం, వసతి, ఆన్‌లైన్ టికెట్లకు సంబంధించి భక్తులు అధికారిక టిటిడి వెబ్‌సైట్. అధికారిక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే బుకింగ్‌లు చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది.సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న అనధికారిక వెబ్‌సైట్లు, లింకులను నమ్మి మోసపోవద్దని కోరింది.

# రాష్ట్ర వ్యాప్తంగా వైభవంగా గురు పూర్ణిమ వేడుకలు

**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గురు పూర్ణిమ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శిర్డీ సహా రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. గురువును పూజించే రోజే గురు పూర్ణిమగా, వ్యాస పూర్ణిమగానూ గురు పూర్ణిమకు పేరు ఉంది. నారాయణుని స్వరూపమైన వ్యాసుడి పుట్టినరోజు సందర్భంగా గురు పూర్ణిమ జరుపుకున్నారు. ఆ నేపథ్యంలో సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయా పరిసర ప్రాంతాలు గురునామా స్మరణతో మార్మోగాయి. వివిధ సాయిబాబా ఆలయాల్లో కాకడ హారతి, అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రమంతటా సాయిమందిరాలో గురుపూర్ణిమ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించారు.

# ఆగస్టు 4 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు

**శ్రీకాళహస్తి, జులై 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై ఆగస్టు 4 నుంచి ప్రారంభమయ్యే ఆడికృత్తి మహోత్సవాలను విజయవంతం చేయటానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేద్దామని ఆలయ ఇఓ బికె వెంకటేశులు పిలుపునిచ్చారు. చెంగల్వ రాయ స్వామి ధ్వజారోహణంతో ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభమౌతాయని ఇఓ వివరించారు. డిఎస్‌పి నరసింహమూర్తి, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిఐ వెంకటేశ్, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, పారోహితులు అర్ధగిరి, ఎఇఓ లోకేష్‌బాబు, హేమామాలిని, డిఇ శ్రీనివాసు లురెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, రవి, శ్రీహరి, తహశీల్దార్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 12న సూర్యగ్రహణం

**న్యూఢిల్లీ, జులై 29:** సంపూర్ణ సూర్యగ్రహణం వచ్చేనెల 12న సంభవించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఖగోళ శాస్త్రవేత్తలు, ఔత్సాహికులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో మాత్రం కనిపించదు. మన దేశంలో ఆ సమయానికి రాత్రి అవుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు అడ్డుగా వచ్చినప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడుతుంది. చంద్రబింబం సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో పగటిపూట కూడా ఆకాశం చీకటిగా మారి, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ సమయంలో నక్షత్రాలు, గ్రహాలు కూడా స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. నాసా శాస్త్రవేత్తల కథనం ప్రకారం, సూర్యుడు చంద్రుడి కంటే 400 రెట్లు పెద్దదైనప్పటికీ, అదే స్థాయిలో (400 రెట్లు) దూరంగా ఉండటం వల్ల ఆకాశంలో చంద్రుడు, సూర్యుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తారు. ఈ సంపూర్ణ గ్రహణం గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఉత్తర రష్యా, అట్లాంటిక్ మహాసముద్రం పరిధిలో కనిపిస్తుంది. ఇక ఉత్తర అమెరికా, కెనడా, యూరప్, వాయువ్య ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణాన్ని వీక్షించే అవకాశం ఉంది. భారత కాలమానం ప్రకారం, ఆగస్టు 12 రాత్రి 9:45 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం, ఆగస్టు 13 తెల్లవారుజామున 2:15 గంటల వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో మన దేశంలో సూర్యరశ్మి ఉండదు కాబట్టి గ్రహణాన్ని వీక్షించే వీలు లేదు. అందువల్ల, గ్రహణం సమయంలో పాటించే సూతక్ కాలం వంటి సాంప్రదాయ నియమాలు మనకు వర్తించవని పండితులు స్పష్టం చేస్తున్నారు.

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి రిమాండ్

## చంచల్‌గూడ జైలుకు తరలింపు

## హైకోర్టులో విచారణ నాలుగు వారాలు వాయిదా



**హైదరాబాద్ (శంకర్‌పల్లి), జులై 29 ప్రభాతవార్త:** మహిళా ట్రైనీఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టు అయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి రెండు వారాల రిమాండ్ విధిస్తూ ఉప్పర్‌పల్లి కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులకు సంబంధించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదవడం తెలిసిందే. అనంతరం ఈ కేసును మహిళా భద్రత విభాగానికి బదిలీ చేశారు. దీని తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసు అకాడమీ నుంచి సస్పెండ్ చేయగా బోరబండలోని తన స్నేహితుడి ఇంటికి వెళ్లి అతిగా మద్యం సేవించి అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే అతన్ని స్నేహితులు ఆస్పత్రికి తరలించడంతో మూడు రోజుల తర్వాత కోలుకున్నాడు. అనంతరం ఉన్నట్టుండి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇదే సమయంలో తనను పోలీసులు అరెస్టు చేయకుండా ఉండేందుకు ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు హైకోర్టు విచారణలో ఉన్నది. ఓ వైపు ఉదయ్ కృష్ణారెడ్డికోసం పోలీసులు గాలిస్తుండగా మంగళవారం ప్రకాశం జిల్లా నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి మీడియా ప్రకటన విడుదల చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, పోలీసులకు అందుబాటులో ఉన్నానని, హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలిపారు. అతని గురించి సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం మిరియాలగూడవద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున నాటకీయ పరిణామాల మధ్య ఉస్మానియాలో వైద్య పరీక్షలు నిర్వహించి సాయంత్రం 4గంటల సమయంలో ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచగా కోర్టు ఆగస్టు 11వరకు రిమాండ్ విధించింది. పోలీసు బందోబస్తు మధ్య చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# పిల్లల హక్కులను కాలరాస్తే కఠిన చర్యలు

• రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 29 ప్రభాతవార్త:** పిల్లల హక్కులను పరిరక్షించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఎక్కడైనా పిల్లలపై వేధింపులు, దోపిడీ, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, హక్కుల ఉల్లంఘనలు జరిగినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారి సురక్షితంగా, విద్యావంతుడిగా, ఆరోగ్యవంతంగా ఎదిగేలా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. పిల్లల్లో పెరుగుతున్న చెడు అలవాట్లు, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, చిన్నారులను నేర కార్యకలాపాలకు వినియోగించే ధోరణిపై కమిషన్ సభ్యులు, నిపుణులతో కలిసి విస్తృత అధ్యయనం నిర్వహించి సమగ్ర నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ నివేదికను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి, అందులోని సూచనల ఆధారంగా పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పిల్లల హక్కులకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని చైర్మన్ స్పష్టం చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారు, బాల్య వివాహాలకు పాల్పడే వారు, చిన్నారులను డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ రవాణా వంటి నేరాలకు వినియోగించే ముఠాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను నేరాల బారిన పడకుండా కాపాడటం సమాజం, ప్రభుత్వ యంత్రాంగం, తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కేజీ వెంకట పద్మలత, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.







# స్టాప్ - థింక్ - వెరిఫై - దెన్ యాక్ట్‌తోనే సైబర్ మోసాలకు చెక్

• ప్రతి విద్యార్థి సైబర్ భద్రత రాయబారిగా మారాలి • జిల్లా ఎస్‌పి డా. అజితా వేజెండ్ల పిలుపు

**నెల్లూరు(క్రైం), జులై 29 ప్రభాతవార్త:** డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి విద్యార్థి సైబర్ భద్రత రాయబారిగా మారి సమాజంలో అవగాహన కల్పించాలని జిల్లా ఎస్‌పి డా. అజితా వేజెండ్ల పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన సైబర్ భద్రత - సైబర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నగరంలోని కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు, ప్రజలు, పోలీసు అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎస్‌పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్ మోసాలు, ఫిషింగ్ లింకులు, ఓటీపీ, క్యూఆర్ కోడ్, యూపీఐ మోసాలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీములు, పార్ట్‌టైమ్ జాబ్ స్కామ్స్, సోషల్ మీడియా ఇంపర్సనేషన్, ఏపికె ఫైళ్లు, ఏఐ డీప్‌ఫేక్, వాయిస్ క్లోనింగ్ వంటి ఆధునిక సైబర్ నేరాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఫోటోలు మార్ఫింగ్ చేయడం, సోషల్ మీడియా ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిగత ఫోటోలు, బ్యాంకు వివరాలు, ఒటిపి, యుపిఐ పిన్, సివివి వంటి గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ తెలియజేయరాదని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి కుటుంబం, గ్రామం, కాలనీలో సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తూ సైబర్ నేరస్థులపై పోరాటంలో ఆర్థిక యోధులుగా నిలవాలని పిలుపునిచ్చారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. స్టాప్, థింక్, వెరిఫై, యాక్ట్ అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అదనపు ఎస్‌పీ (అడ్మిన్) సీహెచ్. సౌజన్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ రకాల సైబర్ మోసాలు, వాటి నుంచి రక్షణ మార్గాలను వివరించగా, టౌన్ ఎఎస్‌పీ దీక్ష జిల్లాలో ఇటీవల నమోదైన సైబర్ కేసులను ఉదాహరణలతో వివరించారు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని చరిష్మా తమ కుటుంబం సైబర్ మోసానికి గురైన అనుభవాన్ని పంచుకుని అప్రమత్తత అవసరాన్ని వివరించారు. దర్గామిట్ట, బాలాజీనగర్, సంతపేట సీఐలు కళ్యాణరాజు, సాంబశివరావు, వైవి సోమయ్య కూడా తమ పరిధిలో నమోదైన సైబర్ కేసులను వివరించి ప్రజలకు సూచనలు అందించారు. అనంతరం సైబర్ భద్రత అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ ర్యాలీ ద్వారా బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగం, ఆన్‌లైన్ మోసాల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు.

# రైతు బజార్లకు పలమనేరు టమోటాలు

## ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సి.రామాంజనేయులు

**పలమనేరు, జులై 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతు బజార్లకు చిత్తూరు జిల్లా పలమనేరు మార్కెట్ కమిటీ నుండి టమోటాలు సరఫరా చేయనున్నట్లు కడప ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సి.రామాంజనేయులు తెలిపారు. పలమనేరు మార్కెట్ యార్డును మంగళవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 నుండి 30 మెట్రిక్ టన్నుల టమోటాలు రైతు బజార్లకు తరలిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి వ్యవసాయ శాఖ ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. రైతు బజార్లకు తరలించడానికి సిద్ధం చేసిన టమోటాల నాణ్యత గ్రేడింగ్ ప్యాకింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. మార్కెట్‌లో టమోటాల ధరలు పతనం కాకుండా ముందుగా రాజమహేంద్ర వరం, ప్రకాశం జిల్లా ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రైతు బజార్లకు పంపుతున్నట్లు సహాయ సంచాలకులు సి.రామాంజనేయులు తెలిపారు. అలాగే మదనపల్లె, గుర్రంకొండ, ములకల చెరువు, పుంగనూరు, సోమల మార్కెట్ యార్డులతో పాటు అనంతపురం జిల్లా నుండి కూడా రాష్ట్రంలోని వివిధ రైతు బజార్లకు టమోటాలు సరఫరా చేస్తామని తెలిపారు. పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్.. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో బహిరంగ సభలకు అనుమతి లేదు

• జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి



**శ్రీకాకుళం, జులై 29 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి పర్యటన అనుమతులపై స్పష్టత ఇచ్చారు. 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్టీ ప్రతినిధులు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు అనుమతి కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ధరఖాస్తులో బహిరంగ సభ, ర్యాలీ, రోడ్ షో లేదా ప్రజా సమావేశాల నిర్వహణకు ఎలాంటి అనుమతి కోరలేదు. అలాగే ఆ తరహా కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా సమర్పించలేదు. అందువల్ల అటువంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వబడలేదు. ములాఖాత్‌కు అనుమతి మంజూరు చేసిన పక్షంలో, జైలులో ఉన్న వ్యక్తిని పరామర్శించి తిరిగి వెళ్లేందుకు మాత్రమే పోలీసు అనుమతి వర్తిస్తుంది. విశాఖపట్నం నుండి శ్రీకాకుళం అంపోలు జిల్లా జైలులో ఉన్న వ్యక్తిని ములాఖాత్ ద్వారా కలిసేందుకు సంబంధిత జైలు అధికారులు నిబంధనల ప్రకారం అనుమతిలు మేరకు ఆ పర్యటనకు అవసరమైన అనుమతులను శ్రీకాకుళం జిల్లా పోలీసులు కల్పిస్తారు. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు లేదా ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడే కార్యక్రమాలకు అనుమతి లేదు. పర్యటన సందర్భంగా గరిష్టంగా 8 వాహనాలతో కూడిన కాన్వాయ్‌కు మాత్రమే అనుమతి ఇవ్వబడుతుంది. ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి' అని విజ్ఞప్తి చేశారు.

# పేర్ని నాని, జోగి రమేష్‌ల బండారం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు

• రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం



**తిరుపతి(హెల్త్), జులై 29 ప్రభాతవార్త:** వైసిపి మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్‌ల అవినీతి, అక్రమాల బండారం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని వారి కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు సైతం చీదరించుకున్న తీరు వీరిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం విమర్శించారు. బుధవారం తిరుపతి నగరంలోని చంద్రశేఖర్ రెడ్డి కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విమర్శించే అర్హత వీరికి లేదన్నారు. పేదలకు అందాల్సిన ఉచిత రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా పేర్ని నాని నిలిచారన్నారు. ఐదేళ్ల మంత్రిగా ఉండి మచిలీపట్నానికి ఒక్క మంచి పని కూడా చేయని నాని అధినేత మెప్పు కోసం, మీడియాలో ప్రచారం కోసం ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. పేర్ని నాని ముందుగా తన అవినీతి సామ్రాజ్యంపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జోగి రమేష్ కోడలికి జరిగిన అన్యాయంపై జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. నిత్యం మీడియా ముందు మాట్లాడే మాజీ మంత్రి రోజా, వైసిపి నాయకురాలు శ్యామల ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదు. బయటకు వచ్చి బిసి రక్షణ చట్టాలు గురించి మాట్లాడే జోగి రమేష్‌కు తన ఇంట్లో మహిళలను రక్షించుకునే సంస్కృతి లేదు. ఐదేళ్ల అరాచక పాలన చూసి ప్రజలు వైసిపిని 11 సీట్లకే పరిమితం చేశారు. ఇప్పటికీ మారకపోతే సున్నా సీట్లకు పడిపోతారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి నాయకులు కుమ్మలమల సుధాకర్, సత్తు మధుసూదన్ యాదవ్, బాలరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మణికంఠేశ్వరాలయంలో కూరగాయలు, పండ్లతో అలంకరణ



బంగారు ధ్వజస్థంభంకు కూరగాయలతో చేపట్టిన అలంకరణ

# కాణిపాకంలో వైభవంగా శాకాంబరి ఉత్సవం

**కాణిపాకం, జులై 29 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఆషాడ పౌర్ణమి సందర్భంగా బుధవారం శాకాంబరి అలంకారంను వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకంలో 2022 నుండి ఆషాడ పౌర్ణమి సందర్భంగా శాకాంబరి అలంకారంను దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మణికంఠేశ్వరాలయంతో పాటు ప్రధాన ఆలయంలో శాకాంబరి అలంకారంను ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని అంత్రాలయం, అర్ధమండపం, బంగారు ధ్వజస్థంభంలను వివిధ రకాల కూరగాయలు పండ్లతో సర్వాంగ సుందర ంగా అలంకరించారు అలాగే మణికంఠేశ్వరాలయం లోని శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవి అమ్మ వార్లతో పాటు ఆలయ మండపాలను వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకాంబరి అలంకారంను నిర్వహించారు. ఇందుకోసం భక్తులు ఉచితంగా కూరగాయాలు సమర్పించాలన్న దేవస్థానం విజ్ఞప్తితో పలమనేరు కూరగాయల మార్కెట్‌కు చెందిన రవీంద్రరెడ్డి వారి మిత్రబృందం పలమనేరు, వడ్డేపల్లె, కోలారు, ముళబాగళ్, బెంగళూరు, హోసూరు ప్రాంతాలలోని కూరగాయల మార్కెట్ యజమానుల నుండి విరాళంగా అందజేసిన 15 టన్నుల వివిధ రకాల కూరగాయలు, పండ్లు, కరివేపాకులతో ప్రధాన ఆలయాన్ని, శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవి అమ్మవార్లను సరా ్వంగ సుందరంగా అలంకరించారు.

# రూ.24కోట్లతో అమృత్ 2.0

## మంచినీటి సమస్యకు పరిష్కారం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి, జులై 29 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు పరిష్కారం లభించిందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో పబ్లిక్ హెల్త్ శాఖ నిర్వహించిన కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, పబ్లిక్ హెల్త్ శాఖాధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.24 కోట్లతో అమృత్ 2.0 పథకంను శ్రీకాళహస్తికి మంజూరు చేసారన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పవిత్రతను కాపాడుటకు స్వర్ణముఖి పరిరక్షణలో భాగంగా మురుగునీటి పారుదల, సేప్టేజ్ నిర్వహణకు రూ.6.3కోట్ల అంచనాలతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. స్వర్ణముఖి నది కలుషితం కాకుండా 1.5 ఎంఎల్‌డి సామర్థ్యం గల మురుగునీటి శద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# భోగాపురం విమానాశ్రయం మా కష్టఫలితమే!

• చంద్రబాబు తన ఖాతాలో వేసుకోవాలనుకుంటున్నారు: మాజీ సిఎం జగన్



**విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి:** భోగాపురం విమానాశ్రయాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగదారులు వెతుకుతున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి నేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆరోపించారు. కిరీటం వేసుకోవడంలో ఆయన చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపరని వైసిపి అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ 2020లో జిఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతిదీ వైసిపి ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి" అని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ.1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు. కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయ పడుతున్నారని ధ్వజమెత్తారు.

డిఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ, స్పోర్ట్స్ కోటాలో జరిగిన అన్యాయంపై జగన్ ఆరోపణలు చేసారు. ఈ విషయంలో యువతలో తీవ్ర ఆగ్రహాన్ని, నిరాశను రేకెత్తించాయని పేర్కొన్నారు. వైసిపి విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, ప్రజలతో కలిసి జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన నిరసన ర్యాలీలు విజయవంతమయ్యాయని జగన్ తెలిపారు. డిఎస్సీ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యువత బలంగా డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా నియామకాల వరకు జరిగిన ప్రతి అక్రమంపై సమగ్ర సిబిఐ విచారణ జరిపించాలని ఆయన కోరారు.

# మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మిసిర్ బెస్రా అరెస్టు

## అనుచరులు గౌరవ్ హోస్థా మోచూ సహా జార్ఖండ్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు



**చర్ల, జులై 29, ప్రభాతవార్త:** మావోయిస్టు కేంద్ర కమిటీలో ఉన్న ఒకే ఒక్క సభ్యుడు మిసిర్ బెస్రాను ఝూర్ఖండ్ పోలీసులు సిఆర్పిఎఫ్ సిబ్బందికి చేతికి చిక్కాడు. ఆపరేషన్ కగార్ చేపట్టిన నాటి నుండి ఆయన ఆయన అనుచరులకోసం ఝూర్ఖండ్ పోలీసులు గత రెండు సంవత్సరాలుగా విశృత సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. కేంద్ర కమిటీలో ఉన్న 40 మంది సభ్యుల్లో చాలా మంది లొంగిపొగా మరికొందరు ఎన్ కౌంటర్లలో మరణించారు. కమిటీలో గణపతి మిసిర్ బెస్రానే ఉండగా వీరిద్దరి ఆచూకి కోసం కేంద్ర రాష్ట్ర బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఝూర్జండ్ రాష్ట్రంలోని వెస్ట్ సింగ్ భూమ్ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండటంతో ఆ జిల్లాను మావోయిస్టు ప్రభావిత జిల్లాగా కేంద్రం ప్రకటించింది. బెస్రా అతని అనుచరులు గౌరవ్ హస్థా మోచు మరికొంత మంది కోసం గత కొంతకాలంగా భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో సిఆర్పిఎఫ్ బలగాల వత్తిడి ఎక్కువ అవ్వడంలో 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపొగా భుదవారం బెస్రాను ఆయన అనుచరులు గౌరవ్ హస్థా మోచూలను ధన్ బాధ్ గిరిడి జిల్లాల సరిహద్దులో భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. పట్టుబడిని మోస్టు వాండెట్ మావోయిస్టు నేత బెస్రా పై కోటి రూపాయల రివార్డు ఉంది. ఆపరేషన్ కగార్ చేపట్టిన కేంద్ర ప్రభుత్వం మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశం చూస్తారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించి అందుకు అనుగుణంగా అడుగులు వేయడంతో మావోయిస్టుల నిర్మూలన సాద్యం అయ్యింది. మావోయిస్టు రహిత భారత్ అని కేంద్ర ప్రకటించి విజయం సాదించినా కేంద్ర కమిటిలో ఉన్న బెస్రా గణపతి ఆచూకి తెలియక పొవడం కొంత వెలితిగా అనిపించింది. ఇప్పుడు మిసిర్ బెస్రా పట్టుబడటంతో గణపతి ఆచూకి కోసం కేంద్ర ఇంటిలిజెన్సీ నిఘా విభాగం గణపతిపై మరింత ఫోకస్ పెట్ట నున్నారు. కాగా చత్తీస్‌గఢ్ అటవి ప్రాంతంలో అక్కడక్కడగా మావోయిస్టుల ఉణికి వినిపిస్తుండ టంలో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు సమాచారం మావోయిస్టుల డంప్‌లు ఐఈడిల కోసం దండకారణ్యంలో నిరంతరం ఆపరేషన్ కొనసాగుతుంది.

30-7pg10_30-7pg10.qxd 29/Jul/26 10:32 PM Page 1



# లంక ప్రీమియర్ లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్?




## 4 ఓవర్లలో 71 పరుగులు

**న్యూఢిల్లీ:** లంక ప్రీమియర్ లీగ్-2026 (ఎల్‌పిఎల్) ప్రస్తుత సీజన్ ప్రారంభం నుంచీ వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. ఫ్రాంచైజీల అవినీతి, షాహీన్ అఫ్రిది ఎంపికపై వివాదం, ఒక ఫ్రాంచైజీ యజమాని అరెస్ట్ వంటి వరుస పరిణామాలతో లీగ్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఇంకా ఈ సీజన్‌లో రెండు వారాల క్రికెట్ మిగిలి ఉండగానే, లీగ్ ప్రతిష్టను మరింత దెబ్బతీసేలా మరో సంచలన సంఘటన చోటుచేసుకుంది. కొలంబో క్యాప్స్, జాఫ్నా కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జరిగిన ఓ పరిణామం లీగ్‌పై ఉన్న నమ్మకాన్ని మరింతగా సడలించింది. కొలంబో క్యాప్స్ తరఫున బౌలింగ్ ప్రారంభించిన పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ షానవాజ్ దహానీ ఈ మ్యాచ్‌లో దారుణమైన ప్రదర్శన ఇచ్చాడు. తన 4 ఓవర్ల స్పెల్‌లో ఏకంగా 6 ఎక్స్‌ట్రాలతో కలిపి 71 పరుగులు సమర్పించుకున్నాడు. వికెట్ ఏమీ తీయలేకపోయాడు. తొలి ఓవర్లో వైడ్‌తో పరుగుల ఖాతా తెరిచి 6 పరుగులు ఇవ్వగా, రెండో ఓవర్లో జాఫ్నా బ్యాటర్లు విరుచుకుపడి రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నారు. ఆ తర్వాత ఆఖరి ఓవర్లలో తిరిగొచ్చిన దహానీ వరుసగా వైడ్లు, నోబాల్స్‌తో వైఫల్యం చెందాడు. ఇక చివరి ఓవర్లో తోహిద్ హృదోయ్ వరుసగా మూడు సిక్సర్లు, ఆపై మరో సిక్స్, ఫోర్‌తో ఒకే ఓవర్లో ఏకంగా 31 పరుగులు రాబట్టాడు. ఎల్‌పిఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన బౌలింగ్ స్పెల్ నమోదవడంతో ఇప్పుడు అందరి దృష్టి దీనిపైనే కేంద్రీకృతమైంది. ఈ లీగ్‌లో పక్కాగా మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని, లీగ్ పారదర్శకతపై పెద్ద ఎత్తున అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల ప్రారంభంలోనే అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణలతో జాఫ్నా కింగ్స్ జట్టు యజమానుల్లో ఒకరైన మన్జోత్ కల్రాను శ్రీలంక పోలీసుల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ అరెస్ట్ చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. క్యాచ్‌లను కావాలనే వదిలేస్తున్నారని, మ్యాచ్‌లో ఎలాంటి తీవ్రత లేకుండా 30 పరుగుల ఓవర్లు మామూలైపోయాయని పోస్టులు పెడుతున్నారు. ఒకప్పుడు అత్యుత్తమ టి20 బౌలర్‌గా పేరొందిన 27 ఏళ్ల దహానీకి ఇది అత్యంత చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. పిఎస్ఎల్ సీజన్‌లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున 20 వికెట్లు, తదుపరి సీజన్లో 17 వికెట్లు తీసి దహానీ వెలుగులోకి వచ్చాడు.






### వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్..

## క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ పురుష, మహిళా జట్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ల నాకౌట్ దశల్లో విభిన్నమైన విజయాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఐదవ సీడ్ భారత పురుషుల జట్టు, ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బ నుండి కోలుకుని ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో 11వ సీడ్ కువైట్‌ను 2-1 తేడాతో ఓడించింది. మరోవైపు, మహిళల జట్టు గ్రూప్ దశలో తమ అజేయ పరంపరను కొనసాగిస్తూ, దక్షిణాఫ్రికాపై 3-0 తేడాతో ఘన విజయం సాధించింది. అబ్దుల్లా అలీ చేతిలో యుషా నఫీస్ వరుస గేమ్‌లలో తొలి షాట్‌ను కోల్పోవడంతో భారత పురుషుల జట్టుకు ఆరంభం కష్టంగా మారింది. అయితే, ఖలీద్ వలీద్ అల్ ఫౌజైన్‌పై 11-5, 11-6, 11-5 తేడాతో ఆధిపత్య విజయం సాధించి ఆర్యవీర్ దీవాన్ టైని సమం చేశాడు. ఆ తర్వాత గుర్వీర్ సింగ్ అద్భుతమైన ప్రదర్శనతో అబ్దుల్ రహ్మాన్ అల్ సానియాను 11-3, 11-3, 11-4 తేడాతో ఓడించి జట్టు స్థానాన్ని ఖాయం చేశాడు. మరోవైపు, భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాపై ఏకపక్ష ప్రదర్శన కనబరిచింది. రుద్ర సింగ్, మకైలా నాయుడుపై 11-4, 11-5, 11-3 తేడాతో విజయం సాధించి మ్యాచ్‌ను ప్రారంభించగా, ఆ తర్వాత అనాహత్ సింగ్, బ్రియానా రాబిన్సన్‌ను 11-1, 11-1, 11-3 తేడాతో ఓడించింది. సాన్వి కలంకి, వివియెన్ వాన్ డెర్ షిఫ్‌ను 11-4, 11-3, 11-3 తేడాతో ఓడించి క్లీన్ స్వీప్ పూర్తి చేసింది..






### తైపే ఓపెన్‌లో రెండో రౌండ్‌కు

## ప్రణయ్, ఉన్నతి

**న్యూఢిల్లీ:** భారత జట్టు ప్రచారానికి సారథులుగా ఉన్న అనుభవజ్ఞులైన షట్లర్లు హెచ్.ఎస్. ప్రణయ్, ఉన్నతి హూడా, బుధవారం తైపే ఓపెన్ సూపర్ 300లో తమతమ సింగిల్స్ ఈవెంట్లలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. ఏడవ సీడ్ అయిన ప్రణయ్, కేవలం 35 నిమిషాల్లో ముగిసిన తన తొలి రౌండ్ పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన మినోరు కోగాను 21-11, 21-14 తేడాతో ఓడించాడు. రెండో రౌండ్‌కు చేరుకున్న ఇతర భారత పురుషుల సింగిల్స్ ఆటగాళ్లలో కిరణ్ జార్జ్, తరుణ్ మన్నేపల్లి ఉన్నారు. జార్జ్ చైనీస్ తైపీకి చెందిన వాంగ్ పోవెయ్‌ను 21-10, 21-18 తేడాతో, మన్నేపల్లి కొరియాకు చెందిన ఎనిమిదో సీడ్ జియోన్ హ్యోక్ జిన్‌ను 21-12, 21-15 తేడాతో అనూహ్యంగా ఓడించారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫైయర్స్‌ద్వారా ముందుకు సాగిన వర్ధమాన ఆటగాడు రౌనక్ చౌహాన్‌కు మాత్రం తెరపడింది. ఇండోనేషియాకు చెందిన రిచీ దూటా రిచర్డో చేతిలో అతను 14-21, 16-21 తేడాతో ఓడిపోయాడు. మూడో సీడ్ ఉన్నతి, చైనీస్ తైపీకి చెందిన పెయ్ యు వాంగ్‌పై 21-12, 21-18 తేడాతో విజయం సాధించి తన మహిళల సింగిల్స్ ప్రచారాన్ని సానుకూలంగా ప్రారంభించింది. ఎనిమిదో సీడ్‌గా ఉన్న యువ దేవికాసిహాగ్, తన్వి శర్మ, అన్మోల్ ఖర్బ్‌కూడా మహిళల సింగిల్స్ తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. దేవిక^గా యున్ పార్క్‌ను 14-21, 21-7, 21-15 తేడాతో ఓడించగా, తన్వి తస్నీమ్ మీర్‌పై 21-16, 22-20 తేడాతో విజయం సాధించింది.

### ఐసిసి ర్యాంకింగ్స్‌లో..

## టి20 వరల్డ్ నంబర్‌గా కిషన్

### వన్డే ఫార్మట్‌లో అగ్రస్థానంలో శుభమన్ గిల్







**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రికెట్‌లో భారత ఆటగాళ్ల హవా నిరంతరంగా కొనసాగుతోంది. ఐసిసి బుధవారం విడుదల చేసిన టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా కుర్రాళ్లు ఊహించని సంచలనాలు సృష్టించారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత డాషింగ్ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అగ్ర పీఠాన్ని అధిరోహించి చరిత్ర తిరగరాశాడు. జింబాబ్వేతో జరిగిన రెండో టి20లో 81 పరుగులతో చెలరేగిన కిషన్ తన కెరీర్‌లోనే అత్యధికంగా 916 రేటింగ్ పాయింట్లను తాకాడు. సిరీస్ ముగిసే సమయానికి 910 పాయింట్లతో నంబర్ వన్ స్థానంలో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్నాడు. జింబాబ్వే సిరీస్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ రవి బిష్ణోయ్ ఐసిసి టి20 బౌలర్ల జాబితాలో 41వ ర్యాంకుకు చేరుకున్నాడు. బ్యాటర్ల విభాగంలో తిలక్ వర్మ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకులో నిలవగా, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ 24వ ర్యాంకును దక్కించుకున్నాడు. జింబాబ్వే ఆటగాళ్లలో ఫాస్ట్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరబాని బౌలర్ల జాబితాలో 26వ స్థానంలో నిలిచారు. జింబాబ్వే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనతో 48వ ర్యాంకుకు చేరుకున్నాడు. వన్డే ఫార్మట్‌లో భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ తిరిగి నంబర్ వన్ కిరీటాన్ని కైవసం చేసుకున్నాడు. అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్, వెస్టిండీస్ సిరీస్‌కు దూరం కావడంతో ఆ స్థానం గిల్ వశమైంది. అటు టెస్టుల్లో వెస్టిండీస్‌కు చెందిన బౌలర్ జేడెన్ సీల్స్ 24వ ర్యాంకుకు చేరుకోగా, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజం తన 32వ టెస్ట్ హాఫ్ సెంచరీతో బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 15వ స్థానానికి చేరుకున్నాడు.

### కామన్వెల్త్ గేమ్స్..

## గుల్వీర్‌కు రజత పతకం




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంలో పతకం గెలిచిన భారతదేశపు మొట్టమొదటి అథ్లెట్‌గా గుల్వీర్ సింగ్ నిలిచాడు. ఆస్ట్రేలియాకు చెందిన కై రాబిన్సన్ (27:48.93) వెనుక, మరియు 27:50.28 సమయంతో కాంస్యం గెలుచుకున్న ఐల్ ఆఫ్ మ్యాన్‌కు చెందిన డేవిడ్ ముల్లార్కీ కంటే కొద్దిగా ముందుగా, గుల్వీర్ 27:49.78 సమయంతో ముగింపు రేఖను చేరుకున్నాడు. ఆందోళన, ఆపై ఉద్వేగభరితంగా అతను రెండవ స్థానంలో ప్రారంభించి, సగం దూరం పూర్తయ్యే వరకు మొదటి మూడు స్థానాల్లో కొనసాగి, ఆ తర్వాత ఆరవ స్థానానికి పడిపోయాడు. 5,600 మీటర్ల తర్వాత వేగం పుంజుకోవడంతో అతను తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. ఆపై చివరి 1,200 మీటర్లలో వేగం పుంజుకుని, ల్యాప్‌లోకి ప్రవేశించే ముందు మూడో స్థానానికి చేరుకున్నాడు, అనంతరం అద్భుతమైన వేగంతో దూసుకెళ్లి రెండో స్థానంలో నిలిచాడు. అతను 3,000 మీటర్ల దూరాన్ని 8:39.2 సమయంలో పూర్తి చేసి, 6,000 మీటర్ల వరకు ఐదవ స్థానానికి పడిపోయినప్పటికీ పోటీలో నిలిచి, చివరి ల్యాప్‌కు ముందు తిరిగి తన స్థానానికి చేరుకున్నాడు.

## కేంద్రానికి ఎల్ఐసి రూ.12,207 కోట్ల డివిడెండ్




**న్యూఢిల్లీ,జులై 29:** కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసి రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసి ఎండీ, సిఇఒ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎల్ఐసి ఎండి రత్నాయక్ పట్నాయక్, ఎండి ఆర్ చందర్, జోనల్‌మేనేజర్ ఎస్ఎస్ రాఘవ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సిఇఒ అశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సిఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జిఎన్‌పిఎ) నిష్పత్తి 1.9 శాతానికి తగ్గిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది.

## ఆర్‌బిఐ రూ.12,604 కోట్ల ప్రభుత్వ బాండ్ల బైబాక్




**ముంబయి,జులై 29:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన ప్రభుత్వ సెక్యూరిటీల బైబ్యాక్ వేలంలో మార్కెట్ పాల్గొనేవారి నుంచి మొత్తం రూ.16,959.07 కోట్ల విలువైన బిడ్లు అందితే వాటిలో రూ.12,604.07 కోట్ల విలువైన బిడ్లను ఆమోదించింది. ఈ బైబ్యాక్‌లో అత్యధికంగా 7.33 శాతం జీఎస్2026 సెక్యూరిటీలను ఆర్‌బిఐ తిరిగి కొనుగోలు చేసింది. ఈ విభాగంలో రూ.9,160.69 కోట్ల విలువైన ఆఫర్లు రాగా, వాటిలో రూ.8,960.69 కోట్ల విలువైన సెక్యూరిటీలను స్వీకరించింది. అదనంగా 8.15 శాతం జిఎస్ 2026 సెక్యూరిటీలలో రూ.2,400.387 కోట్లు, 5.74 శాతం జిఎస్2026లో రూ.893 కోట్లు, 8.24 శాతం జిఎస్2027లో రూ.350 కోట్ల విలువైన బాండ్లను కూడా ఆర్‌బిఐ తిరిగి కొనుగోలు చేసింది.ఈ బైబ్యాక్‌కు సంబంధించి కట్‌ఆఫ్ ధరలను 7.33 శాతం జిఎస్2026కు రూ.100.48, 5.74 శాతం, జీఎస్2026కు రూ.100.10, 8.15 శాతం జీఎస్2026కు రూ.100.86, 8.24 శాతం, జీఎస్2027కు రూ.101.40గా నిర్ణయించింది. వెయిటెడ్ యావరేజ్ ధరలు వరుసగా రూ.100.47, రూ.100.10, రూ.100.86, రూ.101.39గా నమోదయ్యాయి.




## ఐటి, మెటల్, ఎఫ్ఎంసిజిల మద్దతు లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి,జులై 29:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ఐటీ, మెటల్, ఎఫ్ఎంసీజీ షేర్లలో బలమైన కొనుగోళ్లు కొనసాగడంతో పాటు విస్తృత మార్కెట్లలో కూడా కొనుగోళ్ల జోరు కనిపించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా నాలుగు రోజుల విక్రయాల తర్వాత మళ్లీ కొనుగోలుదారులుగా మారడం, మార్కెట్ అస్థిరత తగ్గడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతుందన్న ఆశావహ అంచనాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 888.68 పాయింటు ఎగిసి 77,654.60 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 264.85 పాయింటు లాభపడి 24,250.20 వద్ద స్థిరపడింది.నిఫ్టీ ర్యాలీకి ప్రధానంగా ఇన్ఫోసిస్ 4.32, భారతి ఎయిర్‌టెల్ 2.32, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్1.75 షేర్లు మద్దతునిచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్150 సూచీ 0.78 శాతం, బిఎస్ఇ స్మాల్‌క్యాప్250 సూచీ 1.47 శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో మొత్తం 2,533 షేర్లు లాభపడగా, 1,705 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 201 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 3.82 డాలర్లు పెరిగి 87.91 డాలర్లకు చేరింది.రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 95.6600 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.8200గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర స్వల్పంగా 0.01 శాతం పెరిగి రూ.1,41,639 వద్ద ట్రేడైంది. నిఫ్టీ ఐటీ సూచీ 2.32 శాతం ఎగిసింది. ఇందులో ఇన్ఫోసిస్ 4.32 శాతం లాభపడగా, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ 2.34, టిసిఎస్ 1.75, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 1.70, కోఫోర్జ్1.25, విప్రో 1.20, పర్సిస్టెంట్ సిస్టమ్స్0.62, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 0.56 , టెక్ మహీంద్రా 0.42 లాభాలతో ముగిశాయి.

## కనీస నిల్వల ఛార్జీలతో బ్యాంకులు దూకుడు




**నూఢిల్లీ,జులై 29:** దేశంలోని బ్యాంకులు తమ ఖాతాదారులకు భారీ షాక్ ఇచ్చాయి. అకౌంట్లలో కనీస సగటు బ్యాలెన్స్ నిర్వహించనందుకు గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా రూ.26,170 కోట్లకు పైగా జరిమానాల రూపంలో వసూలు చేశాయి. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను అందించారు. 2022-23 నుంచి 202526 ఆర్థిక సంవత్సరం మధ్య కాలంలో ఈ భారీ మొత్తాన్ని బ్యాంకులు ఆర్జించాయి. ఈ వసూళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటానే అధికంగా ఉండటం గమనార్హం. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకులు రూ.7,086.63 కోట్లను మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీల కింద వసూలు చేశాయి. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2,137.92 కోట్లు వసూలు చేయగా, ప్రైవేట్ బ్యాంకులు ఏకంగా రూ.4,948.71 కోట్లు ఆర్జించాయి. ఇది ప్రభుత్వ బ్యాంకుల వసూళ్ల కన్నా రెండింతలకు పైగా ఉండటం గమనార్హం. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంక్ రూ.1,081.33 కోట్లు వసూలు చేసింది. ఈ రెండు బ్యాంకుల వాటానే ప్రైవేట్ బ్యాంకుల మొత్తం వసూళ్లలో దాదాపు 58 శాతంగా ఉంది. ఐసిఐసిఐ బ్యాంక్ (రూ.353.50 కోట్లు), కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.290.65 కోట్లు, యెస్ బ్యాంక్ రూ.195.05 కోట్లు వంటివి కూడా గణనీయంగా జరిమానాలు విధించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.477.27 కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఈ మొత్తం కేవలం కరెంట్ అకౌంట్లకు సంబంధించినదేనని, 2020 మార్చి నుంచే సేవింగ్స్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ జరిమానాలను ఎస్బీఐ రద్దు చేసిందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎస్బీఐ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.394.10 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.299.17 కోట్లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో చాలా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ ఛార్జీలను తగ్గించాయని ప్రభుత్వం తెలిపింది. మొత్తం 12 ప్రభుత్వ బ్యాంకుల్లో 10 బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై ఈ పెనాల్టీలను పూర్తిగా రద్దు చేశాయని పేర్కొంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14